

రాచర్ల మండలం అనుమలవీడుకు చెందిన ఓ రైతు పొలంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం వెళితే.. లైన్‌మన్ రామలింగం రూ.20 వేలు లంచం అడిగాడు. దీంతో ఆ రైతు విసిగి పోయి అతనిని ఏసీబీకి పట్టించాడు. లైన్‌మన్ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడని తెలిసి బాధిత రైతులంతా హర్షం వ్యక్తం చేశారు.

మర్రిపూడి మండలంలో విజిలెన్స్ అధికారులు చేసిన విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రూ.లక్ష నుంచి రెండు లక్షలు డిమాండ్ చేసినట్లు రైతులు వెల్లడించారు. దీంతో ఏఈ, లైన్‌మన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే రూ.50వేలు, పాతది మార్చాలంటే రూ.10వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. స్తంభాలు, పరికరాల అవసరం లేకపోయినా సరే మార్చినట్లు చూపి వాటిని రైతులకు అమ్ముకుంటున్నారు. ఇటీవల అమానిగుడిపాడు సబ్‌స్టేషన్‌లో 110 స్తంభాలను అమ్ముకోగా, అందులో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను అధికారులు సస్పెండ్ చేశారు.

కాసులిస్తేనే కరెంటు

జిల్లాలోని విద్యుత్ శాఖలో ఇదీ పరిస్థితి. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి వసూలు చేయడం పరిపాటైంది. కరెంట్ మీటర్ల దగ్గర నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వరకూ లంచం ఇవ్వకపోతే అడుగు ముందుకు పడదు. కాదూ కూడదంటే కనెక్షన్ కోసం నెలలు తరబడి తిరగాల్సిందే. లైన్‌మన్ నుంచి ఉన్నతాధికారుల వరకు ఆ మొత్తం వాటాలు వేసుకొని పంచుకుతింటున్నారు.



- విద్యుత్ శాఖ అవినీతిమయం
- ప్రతి పనికీ లంచం
- కొత్త కనెక్షన్ ఏర్పాటు అంటే పండగే
- డబ్బులిస్తే ఇష్టారీతిన మార్పులు, చేర్పులు
- కమర్షియల్ అయితే మరింత బాదుడు
- ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.లక్ష డిమాండ్
- మర్రిపూడిలో ఏఈ, లైన్‌మన్‌పై సస్పెన్షన్ వేటు
- ఇటీవల ఏసీబీకి చిక్కిన మరో లైన్‌మన్
- పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- ఇదేఅదనుగా దోచుకుంటున్న విద్యుత్ సిబ్బంది

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 17 : విద్యుత్ శాఖ అవినీతిమయమైంది. పొలాలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు విషయంలో అధికారులు, సిబ్బంది రైతుల నుంచి లక్షలు డిమాండ్ చేసి జేబులు నింపుకొంటున్నారు. వేసిన పైర్లు ఎండిపోతున్నాయని విద్యుత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా లంచం ఇవ్వందే సిబ్బంది కదలని పరిస్థితి నెలకొంది. గత నెలలో రాచర్ల మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ విషయమై రైతును లంచం డిమాండ్ చేయడంతో అతను విసిగిపోయి లైన్‌మన్‌ను ఏసీబీకి పట్టించడమే ఇందుకు నిదర్శనం. అలాగే సామాన్యుడు చిన్న ఇల్లు నిర్మించుకున్నా అందుకు మీటరు ఏర్పాటు చేయాలంటే కనీసం రూ.5వేలకు తగ్గకుండా వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణను పూర్తిగా గాలికొదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేతివాటానికి అలవాటు పడిన సిబ్బంది అనేక విధాలుగా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసి వచ్చినకాడికి దండుకోవడం షరామామూలైంది. నగరంలో కమర్షియల్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.లక్ష డిమాండ్ చేయడం అందుకు ఉదాహరణ. మామూళ్లు ముట్టజెబితే ఎలాంటి అడ్డంకులు ఉండవు. లేకుంటే ఏదో ఒకస్థాయిలో దరఖాస్తులు వెనక్కి వస్తాయి. వినియోగదారులు నేరుగా కార్యాలయాలకు వెళితే ఎలాంటి పనులు కావు. అందుకు సంబంధించి కిందిస్థాయి ఉద్యోగులు లైన్‌మన్, ఏఈలను సంప్రదిస్తే వెంటనే పనులు చేయడం పరిపాటిగా మారింది. గత ఐదేళ్ల నుంచి వేళ్లూనుకున్న అవినీతి.. ప్రభుత్వం మారినా అలాగే కొనసాగుతోంది. సిబ్బందిలో ఎలాంటి మార్పు కన్పించడం లేదు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కట్టాల్సింది రూ.6,200లే!

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతులు ఒక్కొక్కరు కేవలం రూ.6,200 మాత్రమే చెల్లించాల్సి ఉంది. రూ.5వేలు డిపాజిట్, రూ.వెయ్యి సెక్యూరిటీ డిపాజిట్, రూ.200 దరఖాస్తు ఫీజు కట్టాలి. ఇలా ఐదుగురు రైతులు కలిసి రూ.31,000 చెల్లిస్తే 15 నుంచి 30 రోజులలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. అసలు విద్యుత్ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. మీసేవ కేంద్రాలలో అప్లికేషన్ ఫీజుతోపాటు ఆ శాఖకు సంబంధించిన డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది. ఇలా దరఖాస్తు చేసిన 30 రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి. అయితే ఇలాంటి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టి ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికి ఏర్పాటు చేయడం ఎక్కువైంది.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.లక్ష డిమాండ్

మర్రిపూడి మండలం గుండ్లసముద్రానికి చెందిన చంద్రమౌళి అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా ఉపయోగం లేకుండాపోయింది. అందుకోసం విద్యుత్ అధికారులు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై చంద్రమౌళి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేయాలని విజిలెన్స్ అధికారులను సీఎండీ ఆదేశించారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి. ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.లక్ష చొప్పున తీసుకున్నట్లు రైతులు తెలిపారు. ఈమేరకు విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చిన తర్వాత అక్కడ పనిచేస్తున్న ఏఈ రామకృష్ణారెడ్డి, లైన్‌మన్ బాలకృష్ణారెడ్డిలను సస్పెండ్ చేశారు.

అపార్ట్‌మెంట్‌కు కనెక్షన్ ఇస్తే రూ.లక్ష

అపార్ట్‌మెంట్‌లో వినియోగించుకునే మీటర్లకు విద్యుత్ శాఖకు డిపాజిట్ చెల్లించినా అదనంగా రూ.లక్ష ఇవ్వకుంటే ఆ దరఖాస్తులు వెనక్కి వస్తాయి. సామాన్యులు విద్యుత్ మీటరు ఏర్పాటుకు రూ.5వేలు వసూలు చేస్తున్నారు. మామూలుగా అయితే కిలోవాట్‌కు రూ.2వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ.800 చెల్లించడంతోపాటు మీసేవలో అప్లికేషన్ ఫీజు రూ.150 కట్టాలి. అయితే లైన్‌మెన్లను సంప్రదిస్తే రూ.5 వేలు మీటరుకు వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతి పనికీ ఓ రేటు పెట్టి సామాన్యుల నుంచి అధిక మొత్తంలో గుంజుతున్నారు.



ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఇష్టారాజ్యం

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచాలంటే తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి. అయితే వైపాలెం నియోజకవర్గంలో డబ్బులిస్తే చాలు ఎంత కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ అయినా బిగిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోంది. అదేసమయంలో అధికారులు మాత్రం పెద్దమొత్తంలో లబ్ధిపొందుతున్నారు. వైపాలెం నియోజకవర్గంలో ఇప్పటికీ గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే అన్ని వ్యవహారాలను చక్కబెడుతుండటం గమనార్హం. పుల్లలచెరువు మండలంలో హెచ్‌వీడీఎస్ జరగ్గా అందులో కొంత పాత సామానునే వాడారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినందుకు కూడా రైతుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేశారు. అలాగే మండలంలో ఒక అధికారి స్థానికంగా పాతుకుపోయారు. ఏ ప్రభుత్వం ఉన్నా అతనే చక్రంతిప్పుతున్న పరిస్థితి. అతనికి అర్హత లేకున్నా గతంలో మూడు మండలాలకు అధికారిగా కొనసాగారు. వైపాలెం మండలంలోని పిల్లికుంట నుంచి పుల్లలచెరువు మండలం మురికిమళ్ల వరకు 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైన్ నిరుపయోగంగా ఉంది. అయితే ఆ లైన్‌కు వాడిన ఇనుప స్తంభాలు, వైర్లను ఇటీవల తొలగించి గుట్టుచప్పుడు కాకుండా మాయం చేశారు. వాటి విలువ సుమారు రూ.15లక్షల వరకూ ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు



విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడితే ఎంతటి వారైన చర్యలు తప్పవు. మర్రిపూడి మండలంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా అక్కడ పనిచేస్తున్న ఏఈ, లైన్‌మన్‌ను సస్పెండ్ చేశాం. అదేవిధంగా ఏసీబీకి దొరికిన లైన్‌మన్‌పై కూడా చర్యలు తీసుకున్నాం. ఏ స్థాయి వారు అవినీతికి పాల్పడినా సహించేది లేదు. వినియోగదారులు నేరుగా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

- కేవీజీ సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఈ

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



విద్యార్థికి నులిపురుగు నివారణ మాత్రను మింగిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 17 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం ఆవిష్కృతమవుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. దానిపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారు 5,96,751మంది ఉన్నారన్నారు. వీరికి 2,849 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,718 పాఠశాలలు, 233 కళాశాలలు, 95 ఇతర వృత్తి విద్యాసంస్థలలో ఈ మాత్రలను ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 64 పీహెచ్‌సీలు, 18 యూహెచ్‌సీలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రులలో ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని పిల్లలు, యువత అందరికీ కచ్చితంగా ఈ మాత్రలు అందేలా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరధి, డీఐవో డాక్టర్ పద్మజ, డీపీఎంవో వాణిశ్రీ, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం.. పరిశుభ్రత

- జిల్లావ్యాప్తంగా స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలు ప్రారంభం
- తూర్పునాయుడుపాలెంలో మొక్కలు నాటిన మంత్రి స్వామి
- ఒంగోలులో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్



తూర్పునాయుడుపాలెంలో మొక్కను నాటి నీరు పోస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమ పక్షోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పరిశుభ్రత ప్రజల జీవన విధానం పేరుతో ప్రజల్లో అవగాహన, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రధానంగా స్థానిక సంస్థల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు, కాలువల్లో పూడిక తీతలు, పార్కులు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ, తాగునీటి క్లోరినేషన్, భారీగా మొక్కలు నాటడం, పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ప్రత్యేక వైద్యశిబిరాలు వంటి పలురకాల కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పక్షోత్సవాల ప్రారంభం సందర్భంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమాలను యంత్రాంగం నిర్వహించింది. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు. డ్వామా ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బంది ఊరూరా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులోభాగంగా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఉపాధి సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రజలంతా విస్తారంగా మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. కనిగిరిలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు.

జిల్లాకు కొత్తగా ఐదు కేజీబీవీలు

- సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు



ఒంగోలు (విద్య), సెప్టెంబరు 17 : జిల్లాకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొత్తగా ఐదు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు మంజూరయ్యాయి. ఈమేరకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొత్తగా రాష్ట్రానికి 38 కేజీబీవీలు రాగా అందులో జిల్లాకు ఐదు కేటాయించారు. దొనకొండ జడ్పీ హైస్కూలు, పెద్దారవీడు మండలం ఏనుగులదిన్నెపాడు, సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లె, కొత్తపట్నం జడ్పీ హైస్కూల్, తాళ్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ టైప్-4 కేజీబీవీలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో కేజీబీవీకి రూ.10లక్షల చొప్పున రూ.50లక్షలు విడుదల చేశారు. ఆయా పాఠశాలల్లో హాస్టల్ ఏర్పాటు చేసే భవనాల మరమ్మతులు, ఎలక్ట్రికల్, పారిశుధ్య పనులు తదితరాలకు ఈ నిధులను వినియోగిస్తారు. ఈ పాఠశాలలకు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న బాలికలకు టైప్-4 కేజీబీవీల్లో వసతి కల్పిస్తారు. మామూలు కేజీబీవీల్లా కాకుండా ఇక్కడ విద్యార్థినులకు కేవలం హాస్టల్ వసతి మాత్రమే కల్పిస్తారు. దూరప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే బాలికల కోసమే వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

- 23 వరకూ పొడిగించిన ప్రభుత్వం
- 30న తుది జాబితా ప్రకటన



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

ఒంగోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదు గడువును ఈనెల 23 వరకూ ప్రభుత్వం పెంచింది. తొలుత ఈ నెల 15 నాటికే నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో ఈనెల 10 నాటికే సాగైన విస్తీర్ణంలో 90 శాతం విస్తీర్ణానికి సంబంధించి ఈ-పంట నమోదును ఆ శాఖ సిబ్బంది పూర్తి చేశారు. అయితే కీలకమైన వీఆర్వో గుర్తింపు, గ్రామస్థాయి వ్యవసాయశాఖ అసిస్టెంట్(వీఏఏ) ద్వారా సాగుదారు కేవైసీ కార్యక్రమాలు 75శాతం మేర పూర్తయ్యాయి. అయితే పలు జిల్లాల్లో వరదల కారణంగా ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఈ-పంట నమోదు గడువును ప్రభుత్వం పెంచింది. ఈనెల 23 వరకూ అవకాశం కల్పించింది. ఆలోపు ఈ-పంట నమోదుతోపాటు కేవైసీ ప్రక్రియను కూడా పూర్తిచేయాలి. ఆ జాబితాలను ఈనెల 24 నుంచి 27 వరకూ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో ప్రకటించాలి. వాటిపై వచ్చిన అభ్యంతరాలను 28, 29 తేదీల్లో పరిష్కరించి తుది జాబితాలను ఈనెల 30న ప్రకటిస్తారు. ఆ మేరకు షెడ్యూల్‌ను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తదనుగుణంగా జిల్లాలో వ్యవసాయశాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఏవో సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. అలాగే ప్రభుత్వపరంగా అందే అన్నిరకాల పథకాలకు ఈ-పంట నమోదు ప్రధానమైనది కనుక సాగుదారులంతా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్యేలకు నేడు బాబు విందు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతున్న సందర్భంగా ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం మంగళగిరి సమీపంలోని సీ కన్వెన్షన్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా హాజరుకానున్నారు. రాత్రికి వారికి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు, లోకేష్‌లు ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. కాగా, గత ఎన్నికల్లో ఓడిపోయిన ఎర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు ఎరిక్షన్‌బాబు, డాక్టర్ లక్ష్మిలు మంగళవారం సాయంత్రం చంద్రబాబును కలిశారు. పోటీచేసి ఓడిపోయిన 9మంది టీడీపీ అభ్యర్థులతోపాటు జనసేన, బీజేపీలకు కేటాయించిన స్థానాల్లో టీడీపీ టికెట్లు ఇవ్వలేకపోయిన నేతలకు మంగళవారం రాత్రి చంద్రబాబు విందు ఇచ్చారు. ఆ సందర్భంగా ఆయనకు ఎరిక్షన్‌బాబు, డాక్టర్ లక్ష్మి, ఆమె భర్త సాగర్‌లు నియోజకవర్గ పరిస్థితులను వివరించారు.

అరెస్టు భయంతో వైసీపీ ధర్నా ఎత్తుగడ

- ప్రతిస్పందించిన టీడీపీ నేతలు
- పకడ్బందీగా వ్యవహరించిన పోలీసులు
- ఇరుపార్టీల నాయకులకు ముందస్తు నోటీసులు
- దర్శిలో 144 సెక్షన్ విధింపు
- అదనపు బలగాలతో కవాతు



వివరాలు లోపలి పేజీల్లో..

దర్శిలో కవాతు చేస్తున్న అదనపు బలగాలు

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్‌పై గోప్యం

- ఉత్తర్వులు బయటపెట్టేందుకు విముఖత
- నివేదికను కలెక్టర్‌కు పంపామన్న డీపీవో

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17 : జిల్లాలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినా ఆ విషయాన్ని బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య, మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు కార్యదర్శి శ్రీనివాసులును మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. అయితే ఈ విషయం బహిర్గతమైనా డీపీవో అధికారులు మాత్రం అదేమీ లేదని చెప్పడం విశేషం. సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య అనధికారికంగా ఫోన్ పేకు పంచాయతీ డబ్బులను పంపుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. విచారణాధికారులు రూ.79వేల పంచాయతీ నిధులను రామకోటయ్య తన ఫోన్‌పేకు పంపుకున్నట్లు నివేదించారు. అయితే ఆ నివేదికపై సత్వరమే చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోలేదు. మంగళవారం అందుకు సంబంధించిన నివేదిక కలెక్టర్ అన్సారియాకు చేరడంతో సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పంచాయతీ తీర్మానం లేకుండా రూ.7.30 లక్షలతో పలు పనులు చేపట్టి నిధులు డ్రా చేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించారు. అయితే పంచాయతీ తీర్మానాలు లేకుండా పనులు చేసినట్లుగా విచారణాధికారులు నివేదిక ఇవ్వడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణిని సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య సస్పెన్షన్‌పై వివరణ కోరగా విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. ఒకవైపు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినా ఆ ఉత్తర్వులను బయటపెట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

22న దామచర్ల వర్ధంతి సందర్భంగా మెగా జాబ్‌మేళా, ఉచిత వైద్యశిబిరం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మాజీ మంత్రి దివంగత దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జాబ్ మేళా, ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాలను కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొననున్నట్లు టీడీపీ నేత దామచర్ల సత్య చెప్పారు. స్వగ్రామమైన టంగుటూరు మండలం టీ నాయుడు పాలెంలో జరగనున్న జాబ్ మేళా కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన 60 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారు. అన్ని రకాల ఉద్యోగాలకు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే పలువురు ప్రముఖ వైద్య నిపుణులతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ రెండు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగులను, ప్రజలను సత్య కోరారు. అదే రోజు టంగుటూరు మండలంలోని మల్లవరప్పాడు గ్రామంలో దివంగత ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని సత్య చెప్పారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, స్వామి, అలాగే పార్లమెంట్‌లో టీడీపీ పక్ష నేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఒంగోలు ఎంపీ మాగుంట, మాజీ మంత్రి చంద్రమోహన్‌రెడ్డితోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొంటారు.

ఘనంగా నరేంద్రమోదీ జన్మదినం



వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మంగళవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ముందుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మోదీ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాతా శిశువైద్యశాలలో బాలింతలు, రోగులకు, పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో యోగయ్య యాదవ్ మాట్లాడుతూ బీజేపీలో ఒక సామాన్యకార్యకర్త కూడా గొప్ప నాయకుడు ఆవుతారనేది దానికి నరేంద్ర మోదే ఉదాహరణ అని అన్నారు. గత పదేళ్ళ కాలంలో దేశాభివృద్ధి కోసం ఆయన తీసుకుంటున్న చర్యలు అనేకం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, రాయపాటి అజయ్, మాకినేని అమరసింహ, సీతారామయ్య గుర్రం రంగనాధ్, విజయారావు, సత్యవతి, అరవింద్, సంజీవ్‌కుమార్, మధు, సంజీవకుమార్, కాట్రగడ్డ వాసు, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, కొమ్ము కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నగర కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నగరంలో 20 ప్రాంతాల్లో కూడళ్ళు ఉన్నాయన్నారు. అయితే, ఆటో స్టాండ్లు లేక అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వెంటన ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈచలానాలతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తంబి శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపరెడ్డి, మహ్మద్‌బేగ్, షేక్ హుస్సేన్‌బాషా, టి.మహేష్, వెంకటేశ్వర్లు, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో.. సంతనూతలపాడు, సెప్టెంబరు 17: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం రవాణా, భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల భద్రతకు తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వి.ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మస్తాన్, భగత్‌సింగ్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 17: స్థానిక రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూపు ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగానికి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పీసీబీ డిజైన్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో నరేష్ టెక్నాలజీ అండ్ కోనివేటీస్ సర్వీసెస్ డైరెక్టర్ ఎస్‌వీ నరేష్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో పీసీబీలను ఎలా తయారుచేయాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, ప్రిన్సిపాల్ కేవీ సుబ్రహ్మణ్యం, రవికుమార్, చంద్రశేఖర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేనికి తెలుగు వెలుగు నంది పురస్కారం



భద్రయ్యకు నంది పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మర్రిపూడి, సెప్టెంబరు 17: మండలంలోని రావెళ్లవారిపాలేనికి చెందిన సమరతా సేవా సంస్థ కోఆర్డినేటర్ బొల్లినేని భద్రయ్యకు అరుదైన గౌరవం దక్కింది. సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న ఆయనకు తెలుగు వెలుగు నంది పురస్కారం లభించింది. విజయవాడ బాలోత్సవ భవన్‌లో జరిగిన గిడుగు రామ్మూర్తి జయంతి ఉత్సవాల్లో ఆయనకు తెలుగు వెలుగు సంస్థ నంది పురస్కారాన్ని అందజేసింది. కార్యక్రమంలో చందు సాంబశివరావు, కత్తి వెంకటేశ్వర్లు, అద్దంకి నాగరాజు, పి.రాజకుమార్, కోంగ్రు సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం



జరుగుమల్లిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మర్రిపూడి, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. మంగళవారం స్వచ్ఛత హిసేవ కార్యక్రమంలో భాగంగా మర్రిపూడిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. 15రోజులపాటు మండలంలో పారిశుధ్య కార్యక్రమాలపై పలు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లిలో.. జరుగుమల్లి (కొండపి) : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా జరుగుమల్లిలో జడ్పీ స్కూల్ విద్యార్థులు మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో జలజాక్షి మాట్లాడుతూ ప్రజలు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త, వ్యర్థాలు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కొండపిలో.. కొండపి, సెప్టెంబరు 17: కొండపి పొగాకు వేలం కేంద్రంలో సిబ్బంది మంగళవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ జి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్రం ఆవరణలో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

మొక్కలు నాటుదాం.. పుడమిని రక్షిద్దాం

» మంత్రి స్వామి



మొక్కను నాటిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి డాక్టర్ స్వామి

టంగుటూరు, సెప్టెంబరు 17: మొక్కలను విస్తృతంగా నాటి పుడమి తల్లిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. ఆయన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో మంగళవారం వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బంగారమ్మ గుడి వద్ద ఉన్న చెరువు గట్టుపై మంత్రి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మొక్కను సంరక్షించుకోవడం బాధ్యతగా తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, సర్పంచ్ దామచర్ల రవి, ఉపాధి హామీ పథకం ఏపీడీ పాలేటి వెంకటస్వామి, మండల పరిషత్ ఏవో వసంతలక్ష్మి, ఏపీవో సుభాషిణి, ఈసీ దివికుమార్, టీపీఏ బుధియా, ఎఫ్ఏ వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి అరుణ, గ్రామ టీడీపీ నేత పిచ్చన్న, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: పర్యావరణాన్ని కాపాడుతున్న చెట్టు కన్నతల్లిలాంటిదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా ఉపాధి పథకం ద్వారా మంగళవారం ఒంగోలు మండలం కరవది గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లాంట్ ఫర్ మదర్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తామంతా మొక్కలు నాటుతామని, వాటిని జాగ్రత్తగా పెంచుతామని విద్యార్థులు, ఉపాధి కూలీలు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు వంద కొబ్బరిమొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ విద్యార్థుల కోసం తయారుచేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడ రాగి జావను తాగి రుచిచూశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జునరావు, జడ్పీ సీఈవో మాధురి, డీపీవో ఉషారాణి, ఆర్డీవో సుబ్బారెడ్డి, ఎంఈవో కిషోర్, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, సర్పంచ్ కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులలో భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

» కలెక్టర్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: ఆస్పత్రులలో పారిశుధ్యంతో పాటు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలోని వివిధ కేటగిరిల ప్రభుత్వ ఆస్పత్రుల ఉన్నతాధికారులతో మంగళవా రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా ఆస్పత్రులవారీగా ఉన్న సిబ్బంది, విధుల కేటాయింపు, పారిశుధ్యం, భద్రత, వివిధ పనులలో పురోగతి, హెచ్‌డీఎస్ నిధుల లభ్యత, ఎన్‌టీఆర్ వైద్య సేవలు, ఎంప్యానల్‌మెంట్ సమస్యలను తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఆస్పత్రులలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్యులకు రక్షణ, మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురికాకుండా ప్రత్యేకచర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, డీఐవో పద్మజ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ భగీరథి, డీపీఎంవో వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం లోపం రాకుండా చూడాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు పోషకాహారలోపంతో బాధకూడదని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. చిన్నారుల ఎత్తు, బరువును లెక్కించడంలో అవసరమైతే అంగన్‌వాడీ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉద్దేశపూర్వకంగా విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యవేక్షణా లోపం ఉంటే సీడీపీవోలపైనా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం ఖచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబర్ 17: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపగ్రం థపాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ మానవ మనుగడకు అవసరమైన రకరకాల వృత్తులకు విశ్వకర్మ ఆద్యులని అన్నారు. కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, పి.ఇమ్మానుయేలు, జి.శాంసన్, టి.కృష్ణవేణి, ఎస్.అనిల్‌బాబు, వై.మృదుల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీఅచలానంద ఆశ్రమం నిర్వాహకులు శ్రీ పరిపూర్ణ సిద్ధానంద స్వామి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వ హించారు. ఎన్.అగ్రహారంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సామూ హిక హారతులు కార్యక్రమం జరిగింది. అచాలనంద ఆశ్రమంలో అచలానంద స్వామి, గోవిందమాంబ అమ్మవారు, విశ్వకర్మలకు ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించారు.

మద్దిపాడులో.. మద్దిపాడు, సెప్టెంబరు 17: మద్దిపాడులో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చెట్టు వద్ద ఏలూరు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో ఆదిమూలం శ్రీనివాసరావు, ఆలూరు బ్రహ్మానందం, శోభిరాల నాగబ్రహ్మం, ఆదిమూలం నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడిలో.. మర్రిపూడి, సెప్టెంబరు 17: మర్రిపూడిలో విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక పడమర బజారులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేశారు. పాత పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో గాయత్రీమాత విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా ప్రధాన వీధుల్లో స్వామివారి బోనాలను ఊరేగించారు. విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆయా కార్యక్రమాలలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పుందుర్తి గురవాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, మాజీ అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు, ఈదుమూడి గోవిందయ్య, వీరబ్రహ్మం, గురుబ్రహ్మం, కనకయ్య, శ్రీశైల స్వామీజీ, రవిప్రసాద్, ప్రసాద్, వీరయ్య, గట్టుపల్లి శ్రీనివాసులు, నరసింహాచారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో.. టంగుటూరు, సెప్టెంబరు 17: టంగుటూరు గ్రంథాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు నిజమే

» పొన్నలూరు సొసైటీ సీఈవో వివరణ

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 17: పొన్నలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మూడు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో బకాయిలు ఉన్నమాట వాస్తవమేనని సొసైటీ సీఈవో వి.మనోజ్‌కుమార్ అంగీకరించారు. పొన్నలూరు సొసైటీలో భారీ అక్రమాలు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. తాను 2013లో ఉద్యోగంలో చేరే నాటికే బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. వీటిలో అవకాశం ఉన్న వాటిపై లీగల్ చర్యలు తీసుకున్నామన్నారు. అవకాశంమేర వాటిపై న్యాయ సలహాలు తీసుకుంటున్నామన్నారు. తాను జీతం డ్రా చేసిన విషయంలో ప్రెసిడెంట్ చెక్కుమీద సంతకం చేసేందుకు అందుబాటులో లేరని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలో డబ్బులు లేవన్నారు. ఏడు నెలల నుంచి జీతం లేదని చెప్పారు. దీంతో తన తల్లి అనారోగ్యం, కుటుంబ అవసరాల నిమిత్తం రైతుల నుంచి వసూలు చేసిన మొత్తం నుంచి నగదు పుస్తకంలో రాసి జీతం తీసుకున్నానని ఆయన వివరించారు. సొసైటీ సభ్యుల షేర్ ధనం, బ్యాంకులో చెల్లింపులు ఇతరత్రా లావాదేవీల్లో తాను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని ఆయన తెలిపారు కక్షపూరితంగా తన సొసైటీపై సెక్షన్ 51 విచారణ వేయించేందుకు డీఎస్‌వో కుట్రపూరితంగా ఇతర డివిజన్ ఆడిటర్‌ను ఆడిట్‌కు నియమించారని ఆరోపించారు. ఈఅంశంపై ప్రాథమిక అంశాలు పరిశీలించి తర్వాతే 51 విచారణకు ఆదేశించాలని రాష్ట్ర సంఘాల రిజిస్ట్రార్‌ను కోరారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



ఎమ్మెల్యే బీఎన్‌కు విరాళాలు అందజేస్తున్న నాగులుప్పలపాడు టీడీపీ నాయకులు, వైకుంఠ వీరాంజనేయులు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 17: విజయవాడలోని వరద బాధితులను ఆదుకొనేందుకు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు విరాళాలు సేకరిస్తున్నారు. మండలంలోని ఎం.ముప్పాళ్ల సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ, వీరాంజనేయులు దంపతులు మంగళవారం లక్షా 116 రూపాయలను ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌కు అందజేశారు. అలాగే, నాగులుప్పలపాడుకు చెందిన జనసేన నాయకులు కొంజేటి ధనుష్, సాయి చరణ్ రూ.పది వేలు, కేసినేనివారిపాలెంకు చెందిన జనసేన నాయకులు నాగరాజు, నాగేశ్వరరావు రూ.పది వేలు, నాగులుప్పలపాడుకు చెందిన టీడీపీ నాయకులు ఉప్పుటూరి హరినాథ్, గూడూరి యూన్సీ, సొనగల ఆంజనేయులు రూ.పది వేలు చొప్పున, చుండూరి నాగేశ్వరరావు రూ.ఐదు వేల విరాళాన్ని ఎమ్మెల్యే బీఎన్‌కు అందజేశారు. తన పిలుపుమేరకు స్పందించి వరద బాధితులను ఆదుకొనేందుకు ఆర్థిక సహాయం అందజేసిన నాయకులకు బీఎన్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జ్ గుమ్మడి సాయిబాబా, పోతినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో.. మద్దిపాడు, సెప్టెంబర్, 17: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి, నర్సాయపాలెం, మారెళ్లగుంటపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాసరావు నేతృత్వంలో రు.2.90 లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఇందులో పోతినేని శ్రీనివాసరావు లక్షా పదకొండు వేల రూపాయలు సొంత నిధులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో పోలవరపు రాఘవస్వామి, మన్నం సుబ్బారావు, కామేపల్లి శేషయ్య, గోగినేని సుబ్రహ్మణ్యం, బత్తుల సత్యనారాయణ, చిడిపోతు వెంకటేశ్వర్లు, నల్లూరి మధుబాబు, వడ్డంపూడి వెంకటేశ్వర్లు, నల్లూరి హనుమంతరావు, ఎలమర్తి అనిల్, సర్పంచి కాకి శైలజ తదితరులు పాల్గొని రూ.10 వేల చొప్పున అందజేశారు.

సంతనూతలపాడులో.. సంతనూతలపాడు, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని గంగవరం గ్రామంలోని హనుమంతరావు హైస్కూల్ విద్యార్థులు, యాజమాన్యం విరాళంగా సేకరించిన రూ.50 వేల నగదును మంగళవారం కరస్పాండెంట్ బొడ్డు హనుమంతరావు, విద్యార్థులు మంగళవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.నరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మద్దిపాడు: ఎమ్మెల్యే బీఎన్‌కు విరాళం అందజేస్తున్న టీడీపీ నాయులు



సంతనూతలపాడు ఎమ్మెల్యేకు నగదును అందజేస్తున్న హనుమంతరావు హైస్కూల్ కరస్పాండెంట్ బి.హనుమంతరావు

పీఎంఏవై గృహాలు ప్రారంభం



ప్రారంభించిన గృహం ఎదుట అధికారులు, సర్పంచ్

సింగరాయకొండ, సెప్టెంబరు 17: మండలంలోని పాకలలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 1.0లో చేపట్టి పూర్తయిన గృహాలను మంగళవారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఏఈ నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ 670 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో పీఎంఏవై 2.0 పథకం ద్వారా లబ్ధిదారులను గుర్తించి గృహాలను నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాత జయంత్‌బాబుకు సన్మానం



జయంత్‌బాబును సన్మానిస్తున్న కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు

టంగుటూరు, సెప్టెంబరు 17 : కందుకూరులో బ్లడ్ డోనర్స్ గ్రూపు వారు మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు పాల్గొని రక్తదానం చేశారు. ఈగ్రూపు 264 మంది సభ్యులతో ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో శిబిరాలు నిర్వహిస్తోంది. ఎవరికి రక్తం అవసరమైనా సభ్యులు దానం చేస్తుంటారు. ఈ క్రమంలో కందుకూరులో ఏర్పాటు చేసిన శిబిరంలో 41 మంది రక్తదానం చేశారు. వారిలో జయంత్‌బాబు కూడా ఉన్నారు. ఈయన గతంలో హైదరాబాద్, ఒంగోలు, కందుకూరులలో పలు దఫాలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జయంత్‌బాబును కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రమేష్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: నగరంలో పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన నగర కమిటీ సమావేశానికి దామా శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. రమేష్ మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్ళు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అగ్రహారం వద్ద లబ్దిదారులకు ఇచ్చిన పట్టాలకు వెంటనే పొజిషన్ చూపించాలన్నారు. నగర పాలక సంస్థను అధికార పార్టీ కైవసం చేసుకొని కౌన్సిల్ సమావేశం జరిపారని, ప్రజా సమస్యలను మాత్రం విస్మరించారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో చీకటి శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 17: స్థానిక క్విస్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగముక్కలపాలెంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు తప్పకుండా ఆల్బెంజడోల్ మాత్రలు వేయాలన్నారు. కళాశాల ఎన్‌ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్‌చక్రవర్తి, వైస్‌చైర్మన్ డాక్టర్ గాయత్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దానమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనాథల సేవలో ఆత్మసంతృప్తి



వస్త్రాలను అందజేస్తున్న హేమసుందర రావు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబర్ 17: మనకు శక్తి ఉన్నంతలో అనాథలకు సేవ చేయటంలో ఆత్మ సంతృప్తి ఉంటుందని ఆర్యవైశ్య సంఘం చీమకుర్తి మండల అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త నూనె హేమసుందరరావు అన్నారు. మంగళవారం ఒంగోలులోని శివం శరణాలయంలో వృద్ధులకు పండ్లు, నూతన వస్త్రాలను అందజేశారు. సంచార వాహనం ద్వారా 300 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరీనారాయణ, శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి, మారెళ్ల సుబ్బారావు, నూనె వంశీకృష్ణ, చలువాది రమేష్, కొండవీటి వడ్డికాసులు, మద్ది వెంకటరావు, నూనె శివనాగేశ్వరరావు, జి.శ్రీనుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

మద్దిపాడు, సెప్టెంబరు 17: మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకుడు గాయపడిన సంఘటన మంగళవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర చోటుచేసుకుంది. ఒంగోలు నుంచి అద్దంకి వెళ్తున్న మోటార్‌సైకిల్‌కు సడన్‌గా లారీ అడ్డురావటంతో అదుపుతప్పి కిందపడటంతో మార్టూరుకు చెందిన అరికల శ్రీనివాసప్రసాద్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

సీతారాం ఏచూరికి నివాళి

సంతనూతలపాడు, సెప్టెంబరు 17: సీపీఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరికి ఆపార్టీ నేతలు నివాళులర్పించారు. మంగళవారం పేర్నమిట్ట, మంగమూరులో జరిగిన కార్యక్రమాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏచూరి లేనిలోటు పార్టీకి పూడ్చలేనిదని అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, బీవీ రమణారావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, చినబాబు, కోటేశ్వరరావు, శేషయ్య మస్తాన్, బ్రహ్మయ్య, రాము తదితరులు ఉన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రోజుకు రోజుకు పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని రమాదేవి హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, బి.పెద్దగోవిందమ్మ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో రాణించిన పేస్ విద్యార్థులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 17: జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ, తృతీయ బహుమతులు సాధించారు. పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఈ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో జి. అశోక్‌కుమార్, బి.రాజుకోటి, డి.మహేష్ నాయక్‌ల బృందం ప్రథమ బహుమతి పొందారు. బి. పావని, ఎన్.సోనియా, ఆర్.మనీషా బృందం తృతీయ స్థానంలో నిలిచారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, ఆర్ .వీరాంజనేయులు, మేరీ జోన్స్, అధ్యాపకులు అభినందించారు.

రేపు డీసీసీ అధ్యక్షుడిగా సైదా ప్రమాణం

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 17: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా షేక్ సైదా ఈనెల 19న ప్రమాణం చేయనున్నారు.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరవుతున్నారు. కాంగ్రెస్‌వాదులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సైదా కోరారు.



ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌కు విరాళం అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు తదితరులు

వరద బాధితులకు రూ.5.65 లక్షల విరాళం

మద్దిపాడు, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో రూ.5 లక్షల 65 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్బూరి శేషగిరిరావు, గోరంట్ల చిరంజీవి, తుమ్మల సుధాకర్, అద్దేపల్లి లక్ష్మీదుర్గాభవాని, చిట్టిబోయిన అనిల్ యాదవ్, మండవ గోపి, ముత్తనపల్లి రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ఒంగోలు నగరం, సెప్టెంబరు 17: భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శ్రీ లోకేష్, పి.సాయిబాబు, సుబ్రహ్మణ్యం, మందా బాబు, సీహెచ్ సురేష్, సిద్ధాంతి బ్రహ్మాచారి, జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖాధికారి ఎం. అంజల, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జగన్నాథరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చీమకుర్తి, సెప్టెంబరు 17: మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. చీమకుర్తి పట్టణం, మర్రిచెట్లపాలెం, గరిమెనపెంట ప్రాంతంలో సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో స్పెషల్‌పార్టీ పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. గంజాయి తదితర మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

చీమకుర్తి, సెప్టెంబరు 17: విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం చీమకుర్తి మండలంలో ఆకస్మికదాడులు జరిపారు. విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఈఈ కరీంల పర్యవేక్షణలో 41బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిని గుర్తించి రూ.4.15 లక్షల అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డీఈలు కృష్ణారెడ్డి, పిచ్చయ్య, శ్రీనివాసరావు ఏఈ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహం వద్ద బీఎన్ పూజలు

చీమకుర్తి, సెప్టెంబరు 17: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో మంగళవారం వినాయకచవితి ఏకాదశ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొన్నారు. విగ్రహం వద్ద జరిగిన విశేషపూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో చావాబత్తిన వెంకటేశ్వర్లు, మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధరరావు, కరుణాకరరెడ్డి ,గంగుల శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సందీప్‌కు బంగారు పతకం



డాక్టర్ సందీప్‌ను గోల్డ్ మెడల్‌తో సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 17: ఒంగోలులోని వెంకటరమణ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ సందీప్‌కు బంగారు పతకం లభించింది. ఇటీవల వెంకట రమణ హాస్పిటల్‌లో ఓ పేషెంట్‌కు ముక్కుకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. భీమవరంలో జరిగిన చెవి, ముక్కు, గొంతు వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన శస్త్రచికిత్సకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ సందీప్‌ను ప్రశంసించి గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. కాగా వెంకట రమణ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్, డాక్టర్ కామేపల్లి శీతారామయ్యతోపాటు ఇతర వైద్యులు సందీప్‌ను అభినందించారు.

హజీరా బేగంకు ఆచార్య దేవోభవ అవార్డు



అవార్డును అందుకుంటున్న హజీరాబేగం

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 17: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో నాలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన ఆచార్యదేవోభవ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో త్రోవగుంట జడ్పీ హైస్కూలు వ్యాయామోపాధ్యాయురాలు ఎండీ హజీరా బేగంకు అవార్డు లభించింది. మంగళవారం జరిగిన ఈకార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ మనువడు సుబ్రమణ్యం శర్మ చేతులమీదుగా అవార్డు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, బేగంను అభినందించారు.

అరెస్టు భయంతో వైసీపీ ధర్నా ఎత్తుగడ

- ప్రతిస్పందించిన టీడీపీ నేతలు
- పకడ్బందీగా వ్యవహరించిన పోలీసులు
- ఇరుపార్టీల నాయకులకు ముందస్తు నోటీసులు
- దర్శిలో 144 సెక్షన్ విధింపు
- అదనపు బలగాలతో కవాతు

దర్శి, సెప్టెంబరు 17 : దాడుల కేసులలో అరెస్టు చేస్తారనే భయంతో వైసీపీ నాయకులు వేసిన ధర్నా ఎత్తుగడ వికటించింది. పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు జరగకుండా అడ్డుకున్నారు. ఇరు పార్టీల నాయకులకు నోటీసులు ఇచ్చి గృహాలకే పరిమితం చేశారు. దర్శి పట్టణంలో 144 సెక్షన్ విధించి ప్రజలు గుంపులుగా తిరగకుండా ఆంక్షలు విధించారు. అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. సాయంత్రం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియటంతో పోలీసులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

తొలుత ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అందుకు నిరసనగా మగళవారం ధర్నా చేస్తామని సోమవారం రాత్రి ప్రకటించారు. దీనికి ప్రతిగా టీడీపీ నాయకులు కూడా స్పందించారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి గాయపరిచి ఆస్పత్రి పాల్జేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు సీఐ వై రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఉపేక్షిస్తే తామూ ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దర్శిలో నివాసం ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు ముఖ్యమైన నాయకులకు నోటీసులు ఇచ్చారు. అనుమతి లేనందున ధర్నా చేయరాదని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఇంటి నుంచి బయటకు రాకూడదని నోటీసులు ఇచ్చారు.

అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యతోపాటు పలువురు టీడీపీ నాయకులకు కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఇతర గ్రామాల నుంచి ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు రాకుండా పట్టణంలోకి రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు గృహాలకే పరిమితమయ్యారు. సాయంత్రం వరకు పోలీసులు పట్టుసడలకుండా వ్యవహరించటంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా వివాదం ముగిసింది.

టీడీపీ నాయకులపై దాడులు చేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలి



మాజీ ఎమ్మెల్యే పాపారావుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

టీడీపీ నాయకులు, కార్యకర్తలపై మొన్నటి ఎన్నికల సందర్భంగా ఆ తర్వాత దాడులు చేసిన వైసీపీ గూండాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డిమాండ్ చేశారు. ఎన్నికల రోజున బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపర్చారని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తనను దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారని, అదేవిధంగా దర్శి-కురిచేడు రోడ్డులోని ఎన్ఎపీ కార్యాలయం పోలింగ్ బూత్‌లోకి అభ్యర్థిని అయిన తనను వెళ్లకుండా అడ్డుకొని రాళ్లతో దాడిచేసి దుర్భాషలాడారని లక్ష్మి చెప్పారు. కొత్తరెడ్డిపాలెంలో ప్రచారం చేయకుండా అడ్డుకున్నారని, గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే బాడుగకు వెళ్లిన దళిత యువకులు టీడీపీ సానుభూతిపరులన్న అక్కసుతో దాడి చేశారని తెలిపారు. ఈ సంఘటనల్లో నిందితులైన వైసీపీ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులు అబద్ధపు ప్రచారంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టటం శోచనీయమన్నారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని ఆమె చెప్పారు.



ఎమ్మెల్యే బూచేపల్లికి నోటీసు ఇస్తున్న పోలీసులు

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులు: బూచేపల్లి

వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. దర్శిలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ తాము శాంతియుతంగా ఆందోళన చేయాలని భావిస్తే పోలీసులు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తలకు అండగా నిలచి కాపాడుకుంటానన్నారు. భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

- విజయవాడలో ధర్నాకు తరలివెళ్లిన వైద్యాధికారులు
- సమస్యను పరిష్కరించేంత వరకు విరమించం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన ఉద్యమం ఉధృతమైంది. గత వారం రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు మంగళవారం చలో విజయవాడకు భారీగా తరలివెళ్లారు. విజయవాడలో జరిగిన ధర్నాలో ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. పీజీ విద్యలో ఇన్‌సర్వీసు కోటాను 15శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని వైద్యులు ఈ ఆందోళనలు చేస్తున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ పీజీ విద్యలో ఇన్‌సర్వీసు కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం జీవోనెంబరు 85 జారీచేయడాన్ని ఖండించారు

ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం విజయవాడలో జరిగిన ధర్నాకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందించి చర్చలు జరిపి ఆ జీవోను రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహించాలని ధర్నాలో నిర్ణయించినట్లు రాహుల్ తెలిపారు. మరోవైపు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే డాక్టర్లు వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలుగుతున్నారు. ప్రభుత్వం నుంచి సూచనలు, సలహాలు, ఆదేశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు ఆ గ్రూపులకు పార్వర్డ్ చేస్తుంటారు. గత వారం రోజుల నుంచి వైద్యులు ఆందోళనలో ఉన్నా పట్టించుకోకపోడంతో వాట్సప్ గ్రూపుల నుంచి తొలగిపోవడం వల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏమి జరుగుతుందో కూడా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలియని పరిస్థితి ఏర్పడింది.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

'జీవన విధానంలో పరిశుభ్రత భాగం కావాలి'

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతపై ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా పేరుతో అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక ప్రకాశం భవనం వద్ద నుంచి మినీ స్టేడియం వరకు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం నుంచి అక్టోబర్ 1 వరకు స్వభావ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్టెప్ సీఈవో లోకేశ్వరరావు, మెప్మా పీడీ రవికుమార్, సీఎంఎం కొండయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మనాయక్, డీపీవో ఉషారాణి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మెడికో ఆత్మహత్యాయత్నం

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 17: మెడికో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానిక రిమ్స్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తాడేపల్లికి చెందిన వై.దిలీప్ ఫైనలియర్ ఎంబీబీఎస్ చదువుతున్నాడు. మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు చికిత్స పొందుతున్న దిలిప్‌తో మాట్లాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే దిలీప్ పరిస్థితి ఆందోళన కరంగా ఉంది.

దర్శిలో నేడు జాబ్ మేళా

దర్శి, సెప్టెంబరు 17 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతుల ఆధ్వర్యంలో దర్శి పట్టణంలోని పీడీఎస్ కల్యాణ మండపంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. టెక్‌మహేంద్ర, అమర్‌రాజా తదితర పేరొందిన 32 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయి. ఉద్యోగాల కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చినట్లు సమాచారం. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు సొంత నిధులతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగం లభించని వారికి హెచ్‌ఆర్‌సీఏ సంస్థ ద్వారా శిక్షణ ఇప్పిస్తారు. ఆరు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 17 : మండలంలోని పందిళ్లపల్లి పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి మంగళవారం పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గడ్డివాము దగ్ధం

చీరాలటౌన్, సెప్టెంబరు 17 : చీరాల పరిధిలోని హరిప్రసాద్‌నగర్‌కు చెందిన కొత్త గొర్ల శ్రీనివాసరావుకు సంబంధించిన 10 ఎకరాల గడ్డివాము మంటల్లో ఆహుతి అయింది. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. అయితే ఎవరైనా నిర్లక్ష్యంగా సిగరెట్ వంటివి విసిరిన కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.1.80 లక్షలు నష్టం జరిగిందని యజమాని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో విద్యార్థిని మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 17: అనుమానాస్పదస్థితిలో విద్యార్థిని మృతి చెందింది. ఈఘటన మంగళవారం స్థానిక విన్నకోటవారి వీధిలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చోటుచేసుకుంది. జరుగుమల్లి మండలం పచ్చవకు చెందిన వడ్డిముక్కుల భావన (16) కళాశాల టెర్రాస్‌లో ఉరివేసుకొని మృతి చెందిందని కళాశాల యాజమాన్యం చెబుతుంది. మృతురాలి తల్లిదండ్రులు మాత్రం తమ బిడ్డ మృతికి కారణం ఏమిటో తేల్చాలని డిమాండ్ చేస్తు కళాశాల ముందు ఆందోళనకు దిగారు.

మృతురాలు భావన ఆ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈనెల 4న ఇంటికి వెళ్ళి సోమవారం మధ్యాహ్నం కళాశాలకు వచ్చింది. మంగళవారం రాత్రి మూడు గంటల తరువాత భావన లేచి ఐదో అంతస్థులో తిరిగినట్లు సీసీ పుటేజీలో పోలీసులు గుర్తించారు. అనంతరం టెర్రాస్ మీదకు వెళ్ళి అక్కడఉన్న రేకుల షేడ్ ఇనుప రాడ్‌కు చీరతో ఉరివేసుకొని మృతి చెందింది. తెల్లవారు జామున లేచిన విద్యార్థినులు చదువుకునేందుకు వెళ్ళగా గుర్తించినట్లు కళాశాల యాజమాన్యం చెబుతుంది. వెంటనే వేలాడుతున్న చీరను విప్పి చూడగా అప్పటికే భావన మృతి చెందిందని పోలీసులకు తెలిపారు.

పోలీసులు విచారణలో భావన నోట్ బుక్‌లో ట్రిపుల్ ఐటీ సీటు రావాలి వినాయకా అని సుమారు నాలుగు ఐదు పేజీలలో రాసి ఉన్నట్లు చెబుతున్నారు. తల్లిదండ్రులు మాత్రం తన బిడ్డ ఎందుకు మృతి చెందిందో విచారణ చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తల్లి ధనలక్ష్మీ పేర్కొంది. కళాశాల వద్ద కొద్దిసేపు విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులతో కలిసి సంఘాల నాయకులు ఆందోళన చేశారు. అనంతరం కళాశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకునేవిధంగా చర్చించి ఆదోళనను విరమింపజేశారు.

కేసు నమోదు చేసిన ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

విచారణ చేయకుండా ఎలా నివేదిక ఇస్తారు!

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 17: జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర సేకరించిన వరద సాయం విరాళాల అవకతవకలపై విచారణ చేయకుండానే విచారణ చేసినట్లుగా నివేదిక ఎలా ఇస్తారని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మండిపడింది. వరద బాధితుల విరాళాలతో పాటు ఇతర మరికొన్ని అంశాలపై సీఎస్ఈకి ఫిర్యాదు చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ తెలిపారు. దీనిపై విచారణాధికారిగా గుంటూరు ఆర్‌జేడీని నియమించారన్నారు. అయితే, ఆయన విద్యాశాఖలో విచారణ చేయకుండానే విచారణ చేశామని, ఎలాంటి అవకతవకలు లేవని సమాచారం ఇవ్వడం దారుణంగా ఉందన్నారు.

శని, ఆదివారాలు సెలవులు దినాలలో విచారణాధికారి అసలు విచారణ చేయకుండా స్టేట్‌మెంట్ ఇవ్వడం దారుణంగా ఉందన్నారు. అవినీతికి కొమ్ముకోయకుండా సరైన రీతిలో విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


ప్రజలు ఛీకొట్టినా వైసీపీకి బుద్ధి రాలేదు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దర్శి, సెప్టెంబరు 17 : గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఛీకొట్టినప్పటికీ వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నాలు ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వార మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ దుర్మార్గ పాలన పట్ల ప్రజలు విసుగుచెంది దారుణంగా ఓడించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి అండ చూసుకొని టీడీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొట్లపాలెంలో కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే కాన్వాయ్‌కు ఎదురు వచ్చాడని ఒక వ్యక్తిని స్థానిక వైసీపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలోనే దారుణంగా కొట్టి గాయపర్చారన్నారు. కొత్తరెడ్డిపాలెంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే బాడుగకు వెళ్లిన దళిత యువకులను టీడీపీ సానుభూతిపరులన్న ఉద్దేశంతో కొట్టారని చెప్పారు. కురిచేడు మండలం దేకనకొండలో వైసీపీ వర్గీయులు చేసిన దాడిలో 10 మంది టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారని వివరించారు. వైసీపీ వరుసదాడులు చేస్తూ దోషులను తప్పించేందుకు ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి దొంగదీక్షలు చేసేందుకు సిద్ధంకావటం శోచనీయమన్నారు. నియోజకవర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కర్నా శ్రీనివాసరావు, నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డి, టీడీపీ నాయకులు గుర్రం బాలకృష్ణ మారెళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన చెన్నారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 17 : నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ గోడలకు నీరు పడుతూ జారిపడి ఎర్రంరెడ్డి చెన్నారెడ్డి(62) మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెన్నెల అపార్ట్‌మెంట్ వద్ద కొత్తగా మరో అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతోంది. మండల పరిధిలోని పునుగోడు గ్రామానికి చెందిన చెన్నారెడ్డి తన అల్లుడుకు చెందిన అపార్ట్‌మెంట్ నిర్మాణ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. దీంతో ప్రతిరోజూ మాదిరిగానే గోడలకు నీరు పెడుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. కింద పడిన సమయంలో తలకు ఫ్లోర్ బలంగా తగలటంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

'ప్రజలతో మమేకమై పనిచేయటం అభినందనీయం'

దర్శి, సెప్టెంబరు 17 : రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు మంగళవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అందుకు స్పందించిన మంత్రి లోకేష్ ప్రజలతో మమేకమై ముందుకు సాగటం పట్ల అభినందించినట్లు సమాచారం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మీరు చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్నట్లు గొట్టిపాటి లక్ష్మి వివరించారు. అనంతరం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. దర్శి అభివృద్ధికితోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

సభ్యత్వాలు స్వీకరించిన బంగారు వర్తకులు

పామూరు, సెప్టెంబరు 17 : పామూరులోని మానవత సేవ సంస్థ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు సభ్యత్వాలను స్వీకరించారు. మర్చంట్ గౌరవ అధ్యక్షులు పోతురాజు వెంకటరత్నం, అధ్యక్షులు గోస్తు రామారావు, ఉప సర్పంచ్ వైవీ సాయికిరణ్, ఉపాధ్యక్షుడు గుత్తి వెంకటరాజులు సభ్యత్వాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు కే రామిరెడ్డి, అధ్యక్షులు ఎం మునలయ్య, కార్యదర్శి వీ వెంకటేశ్వరరెడ్డి, టీ రమేష్, ఆకుల మాల్యాద్రి, ఎన్ శ్రీనివాసులు, గద్దె శేషు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన ఉగ్ర

పీసీపల్లి, సెప్టెంబరు 17 : మండలంలోని మారెళ్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇరువురు కార్యకర్తల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం పరామర్శించారు. గ్రామకమిటీ అధ్యక్షుడు పరిమి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉగ్ర మారెళ్ల గ్రామానికి వచ్చి వెంకటేశ్వరు సతీమణి ఆదిలక్ష్మమ్మతోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. అనంతరం ఇటీవల ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి గాయపడిన టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు నాగేంద్ర బాబును పరామర్శించారు. ఈయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, ములకా నాగేశ్వరరావు, గ్రామా టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- 'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా అవగాహన కార్యక్రమాలు
- చీపురుపట్టి వీధులు ఊడ్చిన సబ్‌కలెక్టర్



స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా వీధులు శుభ్రం చేస్తున్న సబ్‌కలెక్టర్

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 17: ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మార్కాపురం మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ స్వయంగా చీపురుపట్టి రోడ్లను ఊడ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్, టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, నాయకులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, తాళ్లపల్లి సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నూనె శివారెడ్డి, జనసేన నాయకుడు సయ్యద్ సాదిక్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పీవీ కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారపేట : ప్రతివ్యక్తి పచ్చదనం పరిశుభ్రత పాటించాలని ఏపీడీ భాస్కరరావు అన్నారు. మంగళవారం బేస్తవారపేట జాతీయ ఉపాధి పథకం క్లస్టర్ ఆధ్వర్యంలో ప్లాంట్-4 మదర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వీధిలో ర్యాలీ నిర్వహించి ప్రజావైద్యశాలలో ఏపీడీ కార్యలయం వద్ద మొక్కలు నాటారు. పచ్చదనం-పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ భాస్కరరావు, ఎంపీడీవో టి.పార్వతి, ఏపీవో గురువరకుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు అంబటి రమేష్, బాలకృష్ణ, మూర్తి, సుబ్బారెడ్డి, శంకర్, ప్రవీణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహద పడతాయని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు జీవనవిధానంలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 2 వరకూ గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యాక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యాక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ, ఈవోపీఆర్‌డీ సతీష్, టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాసులరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీవో తోట చందన అన్నారు. మండలంలోని రాయవరం గ్రామంలో మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నాయకులు, అధికారులతో కలిసి నిర్వహించారు. గ్రామం లోని ప్రధాన వీధులలో గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పేదలకు ఇళ్లు నిర్మించున్న కాలనీలో లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చందన మాట్లాడుతూ ప్రతిఒక్క రూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని అనుసరించి తమ గృహాలను, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వై.భాగ్యవతి, గ్రామసర్పంచ్ కె.భాగ్యమ్మ, ఈవోపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, వెలుగు ఏపీఎం రమేష్ బాబు, ఏపీవో జీవరత్నం, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని పలు గ్రామాలలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంపై మంగళవారం అవగాహన ర్యాలీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులు, విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ భారత్ కలలు సాకారం అవుతాయని గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో వరప్రసాద్, ఎంఈవో-2 రాజశేఖరరెడ్డి, ఏపీఎం కృపమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తూ సిబ్బంది వీధులను శుభ్రం చేశారు. ప్రతిఒక్కరూ శుభ్రతను పాటించాలని, తద్వారా వ్యాధులు దూరమవుతాయని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లొక్కు రమేష్, టీడీపీ నాయకులు షానేషావలి, బిల్లా రమేష్, చిన్నశ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.



దోర్నాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పొదిలి : స్వచ్ఛాంధ్రప్రదేశ్‌తోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమౌతుందని నగరపంచాయతీ కమిషనర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, గునుపూడి భాస్కర్‌లు అన్నారు. మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పెద్ద బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం 15 రోజులపాటు మండలంలో పారిశుధ్య కార్యక్రమాలపై పలు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మారుతీరావ్, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది టీడీపీ పట్టణాధ్యక్షుడు ఖుద్దూస్, జిలాని, బొడ్డు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజ్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి మోహన్‌రావు, హెచ్ఎం నారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





మొక్కలు నాటుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్, బేస్తవారపేటలో మొక్కనాటుతున్న ఏపీడీ

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలంటే చేయి తడపాల్సిందే

మార్కాపురం, సెప్టెంబరు 17: వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే దానికి మరమ్మతులు నిర్వహించి సకాలంలో రైతులకు మళ్లీ ఏర్పాటు చేయాల్సింది విద్యుత్‌శాఖే. రైతు పొలం నుంచి ఎస్‌పీఎం కేంద్రానికి తరలించి మరమ్మతుల అనంతరం మళ్లీ యథాస్థానంలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆ శాఖదే. రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితికి అందుకు విరుద్ధంగా ఉంది. లంచం ఇస్తే రెండు నుంచి నాలుగు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ పంపిస్తున్నారు. లేదంటే 15 రోజులకు కూడా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌ను అందించలేకపోతున్నారు. ఎక్కువగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురవుతున్నాయి. రూ.10 వేల వరకు ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి లైన్‌మన్ నుంచి సబ్ డివిజన్‌స్థాయి అధికారి వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని విద్యుత్‌శాఖకు చెందిన కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి వరకు అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

పట్టుకొని విడిచిపెట్టారు

- రేషన్‌బియ్యం లారీని వదిలిపెట్టిన అధికారులు!

కంభం, సెప్టెంబరు 17 : కంభం మండలం పెద్దనల్లకాల్వ గ్రామసమీపంలో మంగళవారం తెల్లవారుజామున 45 టిక్కిల రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు అడ్డుకొన్నారు. అనంతరం స్థానికుల సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనంతోసహా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై అధికారులు నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి అక్రమార్కులకు వంతపాడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టుబడిన రేషన్‌బియ్యంతో పాటు వాహనాన్ని వదిలేసినట్లు ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు వాహనాన్ని అటు పోలీసుస్టేషన్‌కు గాని, రెవెన్యూ కార్యాలయానికి గాని తరలించకుండానే వదిలివేసినట్లు తెలిసింది. ఈవిషయంపై గోడౌన్ డీటీ ప్రసాద్‌కు పలుమార్లు ఫోన్ చేసినా రాత్రి తొమ్మిది గంటల వరకు స్పందించలేదు. అనంతరం అవి బియ్యం కాదు కొర్రలని సమాధానం చెప్పారు. దీనిపై ఆర్ఐ శ్రీనివాసులును బియ్యం గురించి అడగ్గా ఇక్కడకు ఏ వాహనం రాలేదని చెప్పడం గమనార్హం.



పట్టుబడిన వాహనం

సమస్యల పరిష్కారం కోసం నేడు ధర్నా

గిద్దలూరు, సెప్టెంబరు 17 : సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలు, లేబర్ ఆఫీసుల వద్ద ఈనెల 18న జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు బాబూరావు, విజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో భవన నిర్మాణ కార్మికుల ఉపాధి, సంక్షేమం ప్రమాదంలో పడ్డాయని విమర్శించారు. ప్రభుత్వాలు మారినపుడల్లా నూతన పాలసీలు తీసుకొని రావడంతో ఇసుక కష్టాలతో నెలల తరబడి పనులు లేక కుటుంబాలను పోషించుకోలేక కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక సరిపడేంత అందించి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 18న జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆవాస్ యోజన గృహప్రవేశాలు

కంభం, సెప్టెంబరు 17 : ప్రతి పేదవాడి సొంత ఇంటికల నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకం ద్వారా దేశంలో కోటి మంది లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేసినట్లు ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి తెలిపారు. నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా దర్గా గ్రామంలో మంగళవారం నిర్మాణాలు పూర్తయిన గృహాల ప్రవేశాలకు ముఖ్యఅతిథులుగా హాజరైన వారు దేశంలో ప్రధానమంత్రి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద, బడుగు, బలహీన వర్గాల కోసం కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల వెంకటరంగమ్మ, ఎంపీడీవో మస్తాన్‌వలి, తహసీల్దార్ కిరణ్, ఈవోఆర్‌డీ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు తోట శ్రీనివాసులు, కొత్తపల్లి శ్రీను, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, తోట శ్రీను, చేగిరెడ్డి ఓబులరెడ్డి, కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.08 లక్షలు పలికిన వినాయకుని లడ్డూ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 17: మార్కాపురం పట్టణంలోని మెయిన్ బజార్ వినాయకస్వామి ఆలయం వద్ద వినాయకుని లడ్డూ దర ఏకంగా రూ. 2.08 లక్షలు పలికింది. మెయిన్ బజార్‌లోని వినాయకుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా గణేశుని వేలంపాట లడ్డూ కమిటీ సభ్యులు నిర్వహించారు. మార్కాపురానికి చెందిన డా.లావణ్య, కాశీరావు దంపతులు ఈ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. దోర్నాలలోని శ్రీరంగ వైద్యశాలను డాక్టర్ లావణ్య నడుపుతున్నారు. లడ్డూ కైవసం చేసుకున్న దంపతులను కమిటీ సభ్యులు సన్మానించారు.



లడ్డూ దక్కించుకున్నకాశీరావు దంపతులు

దేశాన్ని అగ్రగామిగా నిలపడానికి ప్రధాని మోదీ కృషి

- ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 17 : ప్రధాని నరేంద్రమోదీ అన్ని రంగాలలో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు విశేష కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ 75వ జన్మదిన వేడుకలను పట్టణంలోని పొట్టిశ్రీరాములు సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరై భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలుపుతున్న ఘనత మోదీదేనన్నారు. ఆర్థికంగా విద్యా, వైద్యం, సాంకేతికంగా ప్రపంచంలో ముందుకు తీసుకుపోతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు షానేషావలి, బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, నాయకులు దప్పిలి కాశిరెడ్డి, డాక్టర్ జేవీ.నారాయణ, పిడతల రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రశేఖర్‌యాదవ్, లొక్కు రమేష్ డి.బాదుల్లా, ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మనిషి మోదీ

కంభం : భారతదేశ ప్రధానిగా మూడు పర్యాయాలు ఎన్నికైన నరేంద్రమోదీ ఉక్కుమనిషిగా ప్రపంచ దేశాల అధినేతలతో ప్రశంసలు అందుకుంటున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం కంభం చౌక్ సెంటర్‌లో బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. కంభం, కందులాపురం పంచాయతీలలో పనిచేస్తున్న 81మంది పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాదం మనోహర్, పల్లెం శ్రీను, టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు, కొత్తపల్లి శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు, బిజ్జాల కిశోర్, జనసేన నాయకులు, కార్యదర్శి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అశోక్‌రెడ్డి

మార్కాపురం వన్‌టౌన్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు వేడుకలు మార్కాపురం పట్టణంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు కిరణ్ ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, పేస్టులు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, లక్ష్మీ, రామకృష్ణ, నాగరాజు, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక శివసదన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గండి వీరారెడ్డి అధ్యక్షతన కేకును కత్తిరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ వై.నాగేశ్వరరావు, పెద్దారవీడు మండల అధ్యక్షుడు కోటిరెడ్డి, మల్లారెడ్డి, ఖాశింపీరా, అల్లూరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, రామలక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మాబు, కొప్పుల సుబ్బారెడ్డి, షేక్.మౌలాలి, సుబ్బరత్నం, డాక్టర్ లావణ్యఅరుణ్ కుమార్ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : అన్నా క్యాంటీన్ నిర్వహణకు రూ.10వేల విరాళాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి పట్టణానికి చెందిన మొర్రి శ్రీనివాసులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 భోజనాన్ని ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమానికి తనవంతుగా రూ.10వేలు అందజేయనున్నట్లు శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో మొర్రి వెంకటేశ్వర్లు, మొర్రి రమణ, నల్లబోతుల శ్రీనివాసులు, బత్తుల రాజశేఖర్‌గౌడ్, బుక్కా మల్లయ్య, అద్దంకి వంశి పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 17: పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక కంభం రోడ్డులోని జడల పిచ్చయ్య మఠం నుంచి గాయత్రీదేవి సమేత విశ్వకర్మ స్వాములకు విశేష అలంకారాలు, పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి కనక తప్పెట్లు, మంగళ వాయిద్యాల నడుమ, ఖడ్గాల నడుమ స్వామివారి ఊరేగింపు పట్టణ వీధులలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పోతులూరయ్య ఉపాధ్యాక్షుడు బాల వెంకటేశ్వర్లు, పత్తిపాటి భద్రయ్య, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : మండల కేంద్రమైన మర్రిపూడిలో మంగళవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో, నిర్మామహేశ్వరస్వామి ఆలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న విశ్వకర్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో గాయత్రీమాత విశ్వ బ్రాహ్మణ సంక్షేమసంఘం కార్పెంటరీ యూనియన్ల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముందుగా ప్రధాన వీధులలో స్వామివారికి ఊరేగించారు. అనంతరం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు సూర్యం, రాచర్ల రాజశేఖర్, కల్యాణం, ఉప్పులూరి బాబు, యద్దనపూడి వీరబ్రహ్మం, గోవిందయ్య వానుకొండ శ్యామల, కోటయ్య, ఆర్.బ్రహ్మం పాల్గొన్నారు.



మార్కాపురంలో విశేష అలంకరణ

పెద్దదోర్నాల : స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మ యజ్ఞమహోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా ఉమామహేశ్వరాచారి, రంగోజి నాగాచారి దంపతులు ఉభయ దాతలుగా పీటలపై కూర్చున్నారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామప్రజలు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని సేవించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో కమిటి పెద్దలు శివశంకరాచారి, శ్రీనివాసాచారి, బ్రహ్మం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దోర్నాలలో విశ్వకర్మ యజ్ఞం

విశ్వకర్మ జయంతి వేడుకల్లో ముత్తుముల

గిద్దలూరు టౌన్ : సృష్టికర్తగా, ఆహార ప్రదాతగా, దేవశిల్పిగా పూజలు అందుకునే విరాట్ విశ్వకర్మ జయంతి మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో, శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ కమిటీ సభ్యులతో టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, గంట కృష్ణారెడ్డి శ్రీనివాసులు ముదిరాజ్ పాల్గొన్నారు.

ఊరిని తాకట్టు పెట్టిన వైసీపీ నాయకుడిపై విచారణ

- తగు న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ హామీ

పుల్లలచెరువు, సెప్టెంబరు 17: పుల్లలచెరువు మండలం సిద్దెనపాలెం గ్రామాన్ని తాకట్టు పెట్టిన వైసీపీ నాయకుడిపై మార్కాపురం సబ్ కలెక్టరు బి.సహధిత్ వెంకట త్రివినాగ్ విచారణ చేపట్టారు. మంగళవారం ఐటివరం పంచాయతీలోని సిద్దెనపాలెంలో అధికారులతో కలిసి ఆయన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్దెనపాలెం గ్రామస్థులు మాట్లాడుతూ సిద్దెనపాలెం గ్రామంలో ఎ.4.32సెంట్ల భూమిని గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గడ్డ సుబ్బయ్య అనే వ్యక్తి ముటుకుల సొసైటీలో తాకట్టు పెట్టారన్నారు. ఇదేమని ప్రశ్నించిన గ్రామస్థులపై దాడులు చేశారని ఆరోపించారు. గ్రామస్థులు ఏర్పాటు చేసిన బోర్లను పూడ్చి వేశారని అన్నారు. ప్రశ్నించిన వారిని రూ.10 లక్షలు ఇస్తేనే ఊర్లో ఉండండి లేదంటే వెళ్లిపోండి అని 12 కుటుంబాలను ఊరి నుంచి తరిమి వేశారని ఆయన దృష్టి తీసుకెళ్లారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో దర్జాగా చేపల చెరువు వేసి సాగు చేస్తున్నప్పటికీ, అధికారులు వత్తాసు పలికారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారిస్తున్నట్లు తెలిపారు. ఐటీవరం రెవెన్యూ గ్రామంలోని సర్వే.నెం.296 సిద్దెపాలెం గ్రామానికి య.4.32 సెంట్ల భూమిని ఆన్‌లైను చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న భూమిని ముటుకుల సొసైటీలో ద.నెం.2510/2020 తనఖా దస్తావేజుగా రిజిస్ట్రరు చేసి రూ.3 లక్షలు లోన్ తీసుకున్నట్లు ఫిర్యాదు అందిందన్నారు. రికార్డులు పరిశీలించి ప్రజలకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ మహ్మద్ నయీం, అధికారులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

అవీ..ఇవీ..

రేపటి నుంచి క్రీడా పోటీలు

మార్కాపురం రూరల్ 17. మండలంలోని గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల సమన్వయకర్త బాబురావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు అండర్-14, 17 బాలబాలికలకు 19వ తేదీన అథ్లెటిక్స్, చెస్, యోగ విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వ తేదీన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణపత్రం, ప్రధానోపాధ్యాయులు అటెస్ట్ చేసిన తగిన పత్రాలను తీసుకుని రావాలన్నారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు వారి విద్యార్థులతో కలిసి 19వ తేదీ ఉదయం 8 గంటలకు గజ్జలకొండ జిల్లా పరిషత్ పాఠశాలకు చేరాలని సూచించారు.

గిద్దలూరు : గిద్దలూరులో ఈ నెల 19, 20 తేదీలలో మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఛైర్మన్ బి.అనురాధ పేర్కొన్నారు. స్థానిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడార. అండర్ 14, 17 విభాగాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు అండర్-14 విభాగంలో 2011 జనవరి 1 తరువాత, అండర్-17 విభాగంలో 2008 జనవరి 1వ తేది తరువాత జన్మించిన వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్లు జి.శోభన్‌బాబు, స్వర్ణ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పొదిలి : ఈ నెల 19 నుండి 21 వరకు ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు బాలుర ఉన్నత పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు కరీమున్ బీబీ మంగళవారం తెలిపారు. మండలస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్ ఆధ్వర్యంలో కబాడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని ఆమె సూచించారు. ఈ పోటీల గురించి సందేహాలు ఉంటే 8328399057కు ఫోన్ చేయాలని చెప్పారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

గిద్దలూరు, సెప్టెంబరు 17 : ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలు పరిష్కరించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడేందుకు వీలుగా ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటు స్కూల్ బస్సులలో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బస్సుడ్రైవర్ల, క్లీనర్ల సంఘం అధ్యక్షులు ఎం.పిచ్చిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 60 ఏళ్ల నిండిన డ్రైవర్లకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్మికులందరూ ఉచిత ప్రమాద బీమా నమోదు చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు ఆవులయ్య మాట్లాడుతూ జీవో నెంబరు 21ని రద్దు చేయాలని, ఈ- చలానాలను రద్దు చేయాలని, ఆటోలు నిలుపుకునేందుకు స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహులు, వర్కర్స్ యూనియన్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, రంగస్వామి, భూషణం, అబ్దుల్లా పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న స్కూల్ బస్ కార్మికులు

ఖేల్ ఇండియా జంప్‌రోప్ పోటీలకు కంభం విద్యార్థిని ఎంపిక

కంభం, సెప్టెంబరు 17 : కంభం ఎస్‌వీకేపీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సివిల్ మొదటి సంవత్సరం చదువుతున్న రామిరెడ్డి ప్రసన్న ఖేల్ ఇండియా జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాయిబాబు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 14 వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన నేషనల్ జంప్‌రోప్ చాంపియన్‌షిప్‌లో ఎన్నికకాగా ప్రసన్నను నాందేడ్ ఎమ్మెల్యే చవాన్ సత్కరించారు. అక్టోబరులో నేపాల్ దేశంలో జరిగే చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఒలింపిక్స్ ధ్యేయంగా సాధన చేస్తున్నట్లు ప్రసన్నరెడ్డి తెలిపారు. కడప జిల్లా ముత్తుకూరు ఈమె స్వగ్రామం.



మెడల్ అందుకుంటున్న పాలిటెక్నిక్ విద్యార్థిని

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

పొదిలి, సెప్టెంబరు 17 :జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం వైద్యఆరోగ్యశాఖ కేజీబీవీ పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరపంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ చేతులను శుభ్రంగా కడుక్కున్న తరువాత భోజనం చేయాలన్నారు. డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ చేతులతోపాటు తినే ఆహారాన్ని కూడా శుభ్రంగా చూసుకోవాలన్నారు. అనంతరం నులిపురుగుల మాత్రలు గురించి వివరించారు. అనంతరం కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు పిల్లలకు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మెరీనా, కేజీబీవి ప్రిన్సిపల్ అనురాధ, ఏఎన్ఎం కె విజయ, కేజీబీవీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జార్జి ఆశయాలను కొనసాగిస్తాం

- మాజీ మంత్రి సురేష్

మార్కాపురం, సెప్టెంబరు 17: వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో విద్యను పేదలకు చేరువ చేసిన మహోన్నతుడు డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి ఆశయాలను కొనసాగిస్తామని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం డాక్టర్ శామ్యూల్ జార్జి 18వ వర్ధంతి (జార్జి స్మృతి) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జార్జి సమాధి వద్ద పూలమాలలతో నివాళి అర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జార్జి విద్యాసంస్థల ద్వారా పేదలకు ఉన్నత విద్యను మరింత చేరవ చేస్తామన్నారు. కళాశాలను రానున్న రోజుల్లో డీమ్డ్ యూనివర్శిటీ స్థాయికి తీసుకుపోవడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ విజయలక్ష్మి, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపల్స్ రాజబాబు, రాజా జయరావు, అధ్యాపకులు, పాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సురేష్ దంపతులు

వీరారెడ్డి, రమణారెడ్డిలకు సహజ సాహితీ పురస్కారాలు

మార్కాపురం వన్ టౌన్, సెప్టెంబరు 17: మార్కాపురం పట్టణానికి చెందిన కవులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, కేవీ రమణారెడ్డిలకు సహజ సాహితీ పురస్కారాలు లభించాయి. చీరాలకు చెందిన సహజ సాహితీ సంస్థ వీరిద్దరికి విశిష్ఠ పురస్కారం ప్రకటించింది. డాక్టర్ వీరారెడ్డి గత 50 ఏళ్లుగా చేస్తున్న సాహితీ సేవ వెలువరించిన పుస్తకాల సాహిత్యం పట్ల నిబద్ధతను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేశారు. రెండు దశాబ్దాలుగా సాహితీ రంగంలో కృషి చేస్తున్న కేవీ రమణారెడ్డికి కూడా పురస్కారం లభించిందని, వీరికి ఈనెల 22వ తేదీ పురస్కారం అందించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మంత్రి కృష్ణమోహన్ తెలిపారు. వీరికి పురస్కారం లభించడంపై పట్టణంలోని సాహితీ సంఘాలు హర్షం ప్రకటించాయి.



వీరారెడ్డి, రమణారెడ్డి

కాంప్లెక్స్ పాఠశాల తనిఖీ

పొదిలి, సెప్టెంబరు 17 : జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం రమేష్ మంగళవారం పొదిలి కాంప్లెక్స్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈనెల 17, 18 తేదీల్లో మండలంలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న కాంప్లెక్స్‌లను సందర్శించి పలు సూచనలు చేశారు. బోధన పద్దతుల గురించి విద్యార్థులు ఏమి నేర్చుకున్నారనే దానిపై ఉపాధ్యాయులు సమీక్షించుకోవాలన్నారు.

అరెస్టు భయంతో వైసీపీ ధర్నా ఎత్తుగడ

ప్రతిస్పందించిన టీడీపీ శ్రేణులు

తెలుగుదేశం కార్యకర్తలపై దాడులు చేసిన వారిని

అరెస్టు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిక

పకడ్బందీగా వ్యవహరించిన పోలీసులు

ఇరుపార్టీల నాయకులకు ముందస్తు నోటీసులు

దర్శిలో 144 సెక్షన్ విధింపు

అదనపు బలగాలతో పోలీసుల కవాతు



ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డికి నోటీసులు ఇస్తున్న పోలీసులు



మాజీ ఎమ్మెల్యే పాపారావుకు నోటీసులు ఇస్తున్న దృశ్యం

దర్శి, సెప్టెంబరు 17 : దాడుల కేసులలో అరెస్టు చేస్తారనే భయంతో వైసీపీ నాయకులు వేసిన ధర్నా ఎత్తుగడ వికటించింది. పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు జరగకుండా అడ్డుకున్నారు. ఇరు పార్టీల నాయకులకు నోటీసులు ఇచ్చి గృహాలకే పరిమితం చేశారు. దర్శి పట్టణంలో 144 సెక్షన్ విధించి ప్రజలు గుంపులుగా తిరగకుండా ఆంక్షలు విధించారు. అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. సాయంత్రం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియటంతో పోలీసులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అందుకు నిరసనగా మగళవారం ధర్నా చేస్తామని సోమవారం రాత్రి ప్రకటించారు. దీనికి ప్రతిగా టీడీపీ నాయకులు కూడా స్పందించారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి గాయపరిచి ఆస్పత్రి పాల్జేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు సీఐ వై రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఉపేక్షిస్తే తామూ ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దర్శిలో నివాసం ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు ముఖ్యమైన నాయకులకు నోటీసులు ఇచ్చారు. అనుమతి లేనందున ధర్నా చేయరాదని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఇంటి నుంచి బయటకు రాకూడదని నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యతోపాటు పలువురు టీడీపీ నాయకులకు కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఇతర గ్రామాల నుంచి ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు రాకుండా పట్టణంలోకి రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు గృహాలకే పరిమితమయ్యారు. సాయంత్రం వరకు పోలీసులు పట్టుసడలకుండా వ్యవహరించటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా వివాదం ముగిసింది.

టీడీపీ నేతలపై దాడులు చేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలి

నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

టీడీపీ నాయకులు, కార్యకర్తలపై మొన్నటి ఎన్నికల సందర్భంగా ఆతర్వాత దాడులు చేసిన వైసీపీ గూండాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ డిమాండ్ చేశారు. ఎన్నికల రోజున బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపర్చారని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తనను దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారని, అదేవిధంగా దర్శి-కురిచేడు రోడ్డులోని ఎన్ఎపీ కార్యాలయం పోలింగ్ బూత్‌లోకి అభ్యర్థిని అయిన తనను వెళ్లకుండా అడ్డుకొని రాళ్లతో దాడిచేసి దుర్భాషలాడారని లక్ష్మీ చెప్పారు. కొత్తరెడ్డిపాలెంలో ప్రచారం చేయకుండా అడ్డుకున్నారని, గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే బాడుగకు వెళ్లిన దళిత యువకులు టీడీపీ సానుభూతిపరులన్న అక్కసుతో దాడి చేశారని తెలిపారు. ఈ సంఘటనల్లో నిందితులైన వైసీపీ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులు అబద్ధపు ప్రచారంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టటం శోచనీయమన్నారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని ఆమె చెప్పారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులు

ఎమ్మెల్యే బూచేపల్లి

వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. దర్శిలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ తాము శాంతియుతంగా ఆందోళన చేయాలని భావిస్తే పోలీసులు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తలకు అండగా నిలచి కాపాడుకుంటానన్నారు. భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

స్వచ్ఛతను సేవగా అందరూ పాటించాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే

కనిగిరి, సెప్టెంబరు 17 : స్వచ్ఛతే సేవగా ప్రతి ఒక్కరూ భావించి పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. పీఎం మోదీ పుట్టినరోజు సందర్భంగా కూటమి నాయకులు, శ్రేణులతో కలసి మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. చర్చిసెంటరులో మంగళవారం జరిగిన మానవహారంలో ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి నాటించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను, చిల్ల కంపలను, చెత్త, చెదారాలను ఎమ్మెల్యే స్వయంగా సిబ్బందితో కలసి శుభ్రం చేశారు. తొలుత మోడి పుట్టినరోజు కేకును కట్ చేసి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లతో పాటు కేకును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్ పులిశాంతి, కమిషనర్ దానియేలు, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ఫిరోజ్, శ్రీనివాసరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, కేవీఎస్ గౌడ్, తెలుగుమహిళలు కరణం అరుణ, దొరసాని, తులసి, మెప్మా, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ అత్యాధునిక పరిజ్ఞానానికి మూల పురుషుడు

విశ్వకర్మ ఆధునిక పరిజ్ఞానానికి మూల పురుషుడని ఎమ్మెల్యే ఉగ్ర చెప్పారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా దొరువు వద్ద ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

దొనకొండ, సెప్టెంబరు 17 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవటానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా దొనకొండలో పారిశుధ్యంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ చెత్త అక్కడ వేయకూడదని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చుదిద్దుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి డేవిడ్, వెలుగు సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో...

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 17 : ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తాచెదారాలను పంచాయతీ రిక్షా బండ్లలోనే వేసి స్వచ్ఛతాహి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని సర్పంచ్ శ్రీరాం పద్మావతి కోరారు. స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా సీఎస్‌పురంలో మంగళవారం అవగాహన ర్యాలీ, మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుందరరామయ్య, కార్యదర్శి సింగంపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత

తాళ్లూరు, సెప్టెంబరు 17 : గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్ చార్లెస్ సర్జన్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛతహేసేవా 2024 కార్యక్రమం మంగళవారం జరిగింది. నూర్‌అహమ్మద్, అజయ్‌కీర్తి, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురిచేడులో...

కురిచేడు, సెప్టెంబరు 17 : కురిచేడు పంచాయతీ కార్యాలయలం నుంచి ప్రధాన కూడలి వరకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్మికులు, విద్యార్థులు స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈవోఆర్డీ భాస్కర రావు, మండల విద్యాశాఖాధికారి వస్రాం నాయక్, సర్పంచ్ కేసనపల్లి కిష్టయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు మొఘల్ మస్తాన్ వలి, మేరువ పెద్దిరెడ్డి, మర్రి సుబ్బారావు పాల్గొన్నారు.

పామూరులో...

పామూరు, సెప్టెంబరు 17 : పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఈ నెల 17 నుంచి జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతాహిసేవా కార్యక్రమాల్లో భాగంగా సచివాలయ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రత్నకుమార్, సచివాలయ కార్యదర్శులు రజినీకాంత్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

'ప్రజలతో మమేకమై పనిచేయటం అభినందనీయం'



లోకేష్‌ను కలిసిన డాక్టర్ లక్ష్మి, సాగర్ దంపతులు

దర్శి, సెప్టెంబరు 17 : రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు మంగళవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అందుకు స్పందించిన మంత్రి లోకేష్ ప్రజలతో మమేకమై ముందుకు సాగటం పట్ల అభినందించినట్లు సమాచారం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మీరు చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్నట్లు గొట్టిపాటి లక్ష్మి వివరించారు. అనంతరం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. దర్శి అభివృద్ధికితోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

దర్శిలో నేడు జాబ్ మేళా

దర్శి సెప్టెంబరు 17 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతుల ఆధ్వర్యంలో దర్శి పట్టణంలోని పీడీఎస్ కల్యాణ మండపంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. టెక్‌మహేంద్ర, అమర్‌రాజా తదితర పేరొందిన 32 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయి. ఉద్యోగాల కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చినట్లు సమాచారం. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు సొంత నిధులతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగం లభించని వారికి హెచ్ఆర్‌సీఏ సంస్థ ద్వారా శిక్షణ ఇప్పిస్తారు. ఆరు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

ముండ్లమూరు, సెప్టెంబరు 17 : మండలంలోని పసుపుగల్లు గ్రామంలో బస్టాండ్ సెంటర్‌లో వైసీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని మంగళవారం నిమజ్జనానికి తరలించారు. స్వామి లడ్డూను మేడగం రాజగోపాలరెడ్డి రూ 2.50 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతా శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి, బాదం రమణారెడ్డి, కోట ఆది గోపాలరెడ్డి, రాజగోపాలరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని వేముల గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఉంచిన 10 కేజీల లడ్డుకు మంగళవారం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన భూమా తిరుపతిరెడ్డి రూ 1,00116లకు కైవసం చేసుకున్నారు. సర్పంచ్ గజ్జల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ సూరపరెడ్డి ఏడుకొండలరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు ఛీకొట్టినా వైసీపీకి బుద్ధి రాలేదు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దర్శి, సెప్టెంబరు 17 : గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఛీకొట్టినప్పటికీ వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నాలు ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వార మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ దుర్మార్గ పాలన పట్ల ప్రజలు విసుగుచెంది దారుణంగా ఓడించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి అండ చూసుకొని టీడీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొట్లపాలెంలో కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే కాన్వాయ్‌కు ఎదురు వచ్చాడని ఒక వ్యక్తిని స్థానిక వైసీపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలోనే దారుణంగా కొట్టి గాయపర్చారన్నారు. కొత్తరెడ్డిపాలెంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే బాడుగకు వెళ్లిన దళిత యువకులను టీడీపీ సానుభూతిపరులన్న ఉద్దేశంతో కొట్టారని చెప్పారు. కురిచేడు మండలం దేకనకొండలో వైసీపీ వర్గీయులు చేసిన దాడిలో 10 మంది టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారని వివరించారు. వైసీపీ వరుసదాడులు చేస్తూ దోషులను తప్పించేందుకు ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి దొంగదీక్షలు చేసేందుకు సిద్ధంకావటం శోచనీయమన్నారు. నియోజకవర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కర్నా శ్రీనివాసరావు, నగర పంచాయతీ కౌన్సిలర్ వీసీ రెడ్డి, టీడీపీ నాయకులు గుర్రం బాలకృష్ణ మారెళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన చెన్నారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 17 : నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ గోడలకు నీరు పడుతూ జారిపడి ఎర్రంరెడ్డి చెన్నారెడ్డి(62) మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెన్నెల అపార్ట్‌మెంట్ వద్ద కొత్తగా మరో అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతోంది. మండల పరిధిలోని పునుగోడు గ్రామానికి చెందిన చెన్నారెడ్డి తన అల్లుడుకు చెందిన అపార్ట్‌మెంట్ నిర్మాణ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. దీంతో ప్రతిరోజూ మాదిరిగానే గోడలకు నీరు పెడుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. కింద పడిన సమయంలో తలకు ఫ్లోర్ బలంగా తగలటంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సైనిక స్కూల్‌కు ఎంపికైన తాళ్లూరు విద్యార్థి



అనపర్తి అఖిలేష్

తాళ్లూరు, సెప్టెంబరు 17 : తాళ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన అనపర్తి అఖిలేష్ సైనిక స్కూల్‌కు ఎంపికయ్యాడు. అఖిలభారత స్థాయిలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను సైనిక స్కూల్ ప్రవేశానికి ప్రవేశ పరీక్ష రాశాడు. అఖిలేష్ స్థానిక ఏబీసీ స్కూల్ నందు 5వ తరగతి చదువుతున్నాడు. ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించటంతో తమిళనాడులోని వికాస సైనిక స్కూల్‌లో 6వతరగతి ప్రవేశానికి సీటు లభించింది. అఖిలేష్ తండ్రి అనపర్తి దాసు విద్యుత్తు శాఖలో చిరు ఉద్యోగం చేస్తున్నాడు. అఖిలేష్‌ను హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కాలేషాబాబు అభినందించారు.

రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులను గుర్తించాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

పామూరు, సెప్టెంబరు 17 : వ్యవసాయం రంగం తరువాత అత్యధికంగా ప్రభుత్వానికి ఆదాయం కల్పిస్తున్న రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ గుర్తించడం లేదని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే మాల్యాద్రి డిమాండ్ చేశారు. రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమం లో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మస్కీడాడీ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ అల్లభక్ష్, కే శంకర్, జక్రయ్య, మాధవ, సుల్తాన్, కాదర్‌బాష, నాయబ, కొండయ్య, నారాయణ పాల్గొన్నారు.

గాయపడిన వారిని పరామర్శించిన దద్దాల

పామూరు, సెప్టెంబరు 17 : మండలంలోని కంభాలదిన్నె గ్రామ వైసీపీ నేత మారాతల భాస్కర్, మనోజ్‌లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకొన్న వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ మంగళవారం కంభాలదిన్నె గ్రామానికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.40 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చప్పిడి సుబ్బయ్య, నాయకులు కే రామిరెడ్డి, జీవీ భాస్కర్‌రెడ్డి, నక్కా మాల్యాద్రిరెడ్డి, పిచ్చాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

దొనకొండ, సెప్టెంబరు 17 : పోషకాహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, అవసరమైన పోషకాహారం తీసుకుంటేనే శారీరక వికాసం సాధ్యమవుతుందని ఆరోగ్యకేంద్రం సీహెచ్‌వో ఇన్యాసమ్మ చెప్పారు. దొనకొండలోని బేతేల్‌పురం-11 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త జయమణి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం మంగళవారం జరిగింది. అనంతరం గ్రామంలో నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లీలాభాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయమణి, జె. నిర్మల, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పామూరులో...

పామూరు, సెప్టెంబరు 17 : సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఎంవీఎస్ పార్వతి చెప్పారు. మండలంలోని మోట్రావులపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా పోషకాహార పదార్థాలను లోగో రూపంలో ప్రదర్శించి వాటి ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎమ్మెస్కే అబిదా, కార్యకర్తలు సుబ్బలక్ష్మీ, సునీత, ఆయాలు చంద్రకళ, రత్తమ్మ పాల్గొన్నారు.

తల్లిపేరుపై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పామూరు, సెప్టెంబరు 17 : ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా తల్లి పేరుపై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో సురేష్ తెలిపారు. మండలంలోని కంభాలదిన్నె జడ్పీ పాఠశాలలో ఉపాధి హామీ పథకం కింద మంగళవారం పలు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రభాకర్ చౌదరి, మన్నం రమణయ్య, గోళ్ల వీరబాబు, ఏలూరి నరసింహారావు, కందా వెంకటనారాయణ, చుంచు కొండయ్య, ఉడుత కిశోర్, వై చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, హెచ్ఎం షేక్ మహబూబ్‌బాష పాల్గొన్నారు స్థానిక వాసవీమాత దేవస్థానంలో నిర్వహించిన ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో బీజేపీ శ్రేణులు రమణయ్య, చిన సుబ్బయ్య, కేవీ సుబ్బారావు, ఉమ్మడిశెట్టి శ్రీను, కే హరగోపాల్, చామల శ్రీనివాస్‌రెడ్డి, హజరత్‌కుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో...

దొనకొండ, సెప్టెంబరు 17 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ 74వ జన్మదిన వేడుకలను మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటరామయ్య ఆధ్వర్యంలో స్థానిక కస్తూరీబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.మండల పార్టీ ఉపాధ్యక్షుడు పిచ్చిరెడ్డి, మండల ఓబీసీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జాన్సన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ మహాయజ్ఞ వేడుకలు

పామూరు, సెప్టెంబరు 17 : స్థానిక విరాట్ నగర్‌లోని శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గాయత్రీ సమేత విశ్వకర్మ మహా యజ్ఞ హోమాల వేడుకలను మంగళవారం భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. అర్చకులు నొస్సం సుఖేష్ ఆచారి, బద్రినాథ్ ఆధ్వర్యంలో పలు పూజలు, పలువురి దంపతులతో మహాయజ్ఞ హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఉప్పలపాటి హరిబాబు, నొస్సం నాగేంద్రాచారి, బాల బ్రహ్మచారి, రామాచారి, ఎం దొరసానాచారి, శ్రీనివాసాచారి, బాలాచారి, శివయ్య వెంకటేశ్వర్లు, వినుకొండ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సభ్యత్వాలు స్వీకరించిన బంగారు వర్తకులు

పామూరు, సెప్టెంబరు 17 : పామూరులోని మానవత సేవ సంస్థ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు సభ్యత్వాలను స్వీకరించారు. మర్చంట్ గౌరవ అధ్యక్షులు పోతురాజు వెంకటరత్నం, అధ్యక్షులు గోన్సు రామారావు, ఉప సర్పంచ్ వైపీ సాయికిరణ్, ఉపాధ్యక్షుడు గుత్తి వెంకటరాజులు సభ్యత్వాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు కే రామిరెడ్డి, అధ్యక్షులు ఎం ముసలయ్య కార్యదర్శి వీ వెంకటేశ్వరరెడ్డి, టీ రమేష్, ఆకుల మాల్యాద్రి, ఎన్ శ్రీనివాసులు, గద్దె శేషు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన ఉగ్ర

పీసీపల్లి, సెప్టెంబరు 17 : మండలంలోని మారెళ్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇరువురు కార్యకర్తల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం పరామర్శించారు. గ్రామకమిటీ అధ్యక్షుడు పరిమి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉగ్ర మారెళ్ల గ్రామానికి వచ్చి వెంకటేశ్వరు సతీమణి ఆదిలక్ష్మమ్మతోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. అనంతరం ఇటీవల ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి గాయపడిన టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు నాగేంద్ర బాబును పరామర్శించారు. ఈయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య ములకా నాగేశ్వరరావు, గ్రామా టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

పశు బీమా.. పశువుల కొనుగోలుకు క్రెడిట్ కార్డులు.. తదితరాలతో పాడి పోషణను ప్రోత్సహించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2019కు ముందు ఉన్న సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేసి పాడి పోషణకు పూర్వ వైభవం తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన రంగాల్లో పాడి పోషణ కూడా ఒకటి. సేద్యం చేసే ప్రతి రైతులకు, వారి కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటుందనే ఉద్దేశంతో పశు పోషణ తరతరాల నుంచి వస్తోంది. అయితే వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసిన జగన్ ప్రభుత్వం అదే వైఖరిని పాడి పరిశ్రమపైన కూడా అవలంభించి పోషకుల నడ్డి విరిచింది. అన్ని విధాలుగా కుదేలైన పాడి రైతులను ఆదుకుని తిరిగి ఆ రంగానికి జవసత్వాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పశు బీమా రాయితీ సొమ్ము అందించి ప్రోత్సాహకం కల్పించనుంది. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పాడి రైతులకు ఆర్థికంగా అండగా ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది.

పాడికి.. పూర్వ వైభవం





- పోషకుల సంక్షేమంపై దృష్టి
- పశు బీమాతో పాటు క్రెడిట్ కార్డుల జారీ
- 2019కు ముందు సంక్షేమ పథకాల అమలు
- పోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ చర్యలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రంగం

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో పాడి రైతులు నిర్లక్ష్యానికి గురయ్యారు. పశు పోషణ.. పోషకుల గురించే జగన్ ప్రభుత్వం ఆలోచన చేయలేదు. పైగా గత ప్రభుత్వాలు అమలు చేసిన ఎన్నో పథకాలను వైసీపీ పాలకులు కొనసాగించలేదు. 2019కు ముందు ఉన్న వివిధ పథకాలను రద్దుతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో కాలయాపన చేసి పాడి రైతులను నాటి పాలకులు వేధించారు. మినీ గోకులాలు మొదలుకుని సబ్సిడీపై అందించే దాణాను సైతం ఎత్తివేసి పాడి రైతులకు నష్టం చేకూర్చింది. పశుబీమా కోసం ఏళ్ల తర బడి కార్యాలయాల చుట్టూ తిరిగిన పోషకులు విసిగి వేసారిపోయారు తప్పితే గత ప్రభుత్వం కరుణించిన దాఖలాలు లేవు. ఇలా గత వైసీపీ పాలనలో అనేక ఇక్కట్లకు గురైన పాడి రైతులు కాలూ చేయి కూడ దీసుకుని అడుగులేసేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దానిలో భాగంగా పశునష్ట పరి హారం స్థానంలో పాడిరైతులకు పశుబీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. సేద్యంతో సమానంగా విరాజిల్లే పశుపోషణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాడి రైతులకు మేలు జరగనుంది. పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. బీమా డబ్బుల కోసం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే దురవస్థకు చెల్లుచీటి పడనుంది. పశువులు మరణించిన రోజుల వ్యవధిలోనే బీమా పరి హారాన్ని సదరు పాడి రైతు ఖాతాలో జమ చేయడంతో పాటు పశువులను కొనుక్కోవడానికి మరింత అండగా ఉండడానికి కిసాన్ క్రెడిట్ కార్డులను ఇచ్చే కార్యక్రమానికి పశు సంవర్థక శాఖ శ్రీకారం చుటింది. పశుబీమా కోసం చెల్లించే మొత్తంలో ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం, మిగిలిన వారికి 50 శాతం రాయితీ అందించేలా మార్గ దర్శకాలు విడుదల చేసింది. పశువులకు రూ.15,000, అదే మేలుజాతి వాటికైతే రూ.30,000లకు ప్రభుత్వం బీమా చేస్తోంది. ఇంతకంటే ఎక్కువ సొమ్ముకు అదనంగా పాడి రైతు తన పశువులకు బీమా చేసుకోవా లని భావిస్తే అదనంగా అయ్యే మొత్తాన్ని పోషకులే భరించాలని మార్గ దర్శకాల్లో పేర్కొన్నారు. పశుబీమా పథకంలో భాగంగా జిల్లా ల వారీగా రాయితీ సొమ్మును కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బాపట్ల జిల్లా కు సంబంధించి రూ.11 లక్షలను కేటాయిం చగా ఇప్పటికే రూ.25,000 రాయితీ కోసం ఖర్చు పెట్టారు. పల్నాడు జిల్లాకు రూ.15 లక్షలు కేటాయించగా ఇందులో రూ.60,000 బీమా కోసం వెచ్చించారు. గుంటూరు జిల్లాకు రూ.5.50 లక్షలు కేటాయించగా ఇందులో పదివేల వరకు ఖర్చుపెట్టి పాడి రైతులకు భరోసా కల్పించే చర్యలకు శ్రీకారం చుట్టారు. పాడి పశువుల చెవిపోగుకు బీమా ట్యాగ్ పడిపోయినా సమీపంలోని పశుసంవర్థకశాఖ కార్యాలయంలోని సిబ్బంది ద్వారా దానిని తిరిగి వేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పశువు మరణించిన వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వడం ద్వారా పరిహారాన్ని రోజుల వ్యవధిలోనే పొందే వీలుంటుంది.

క్రెడిట్ కార్డులు జారీ ఇలా..

పశుపోషణకు పాడి రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. వీటికి సంబంధించి బాపట్ల జిల్లాలో 7,700 కార్డులను అందించాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికి 8,200 కార్డులు మంజూరు చేశారు. గుంటూరు జిల్లా లక్ష్యం 17,000 కాగా 9,000 వరకు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో 18,500 కార్డులకు 13,000 కార్డులను



పాడి రైతులకు అందించారు. ఈ కార్డుల ద్వారా పాడి రైతు ఒక్కొ క్కరికి బ్యాంకులు రూ.1.60 లక్షల వరకు రు ణం మంజూరు చేస్తాయి. నగదు అవసర మైనప్పుడు క్రెడిట్ కార్డు ద్వారా డ్రా చేసి వా డుకోవచ్చు. ఖర్చు చేసిన సొమ్మును 40 రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే ఎటువంటి వడ్డీ ఉండదు. అదే 40 రోజులు దాటితే 7 శాతం వడ్డీని బ్యాంకులు వసూలు చేస్తాయి. ఇందులో 3 శాతం వడ్డీని ప్రభుత్వమే భరించనుం డగా మిగిలిన 4 శాతాన్ని పాడి రైతు చెల్లించాల్సి ఉంటుంది.

గతంలో మొక్కుబడి తంతుగా..

పశువులు, గొర్రెలు, మేకలు మరణిస్తే నష్టపోయిన పోషకులకు అండగా నిలవడానికంటూ 2019లో వైసీపీ ప్రభుత్వం పశునష్ట పరిహార పథకాన్ని అమల్లోకి తెచ్చింది. తొలి ఏడాదిలో బీమా డబ్బులు సకాలంలోనే అందించిన ప్రభుత్వం అక్కడ నుంచి గద్దె దిగేవరకు దానిని మొక్కుబడి తంతుగానే మార్చింది. డబ్బులు చెల్లించే విషయంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైసీపీ చివరి నాలుగేళ్ల పాలనలో 3,800 పాడి పశువులు మృతి చెందితే కేవలం 500 పశువులకు మాత్రమే పరిహారం అందింది. ఇది గత ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. పశువులకు సైతం ఓ షెల్టర్ ఉండాలనే సదుద్దేశంతో మినీగోకులాలకు 2019కు ముందు టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని అటకెక్కించడమే కాకుండా దాదాపు రెండు కోట్ల వరకు బిల్లులను పెండింగ్‌లో ఉంచింది. 50 శాతం రాయితీతో ఇచ్చే దాణా విషయం లో కూడా వైసీపీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది.

- ఆందోళనకరంగా వింత జ్వరాలు
- ఇంటింటా వైరల్ ఫీవర్ బాధితులు
- పలు ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో డెంగీ కేసులు
- వర్షాల అనంతరం వాతావరణంలో విపరీత మార్పులు
- అంతుపట్టని లక్షణాలతో తలలు పట్టుకుంటున్న వైద్యులు



పర్చూరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

కాక్‌టెయిల్.. వైరస్

జ్వరం తగ్గాక విపరీతమైన దగ్గు.. కొందరిలో వైరల్ హెపటైటిస్ లక్షణాలు.. మరికొందరిలో డయేరియా లక్షణాలు.. ఇంకొందరిలో శ్వాస సంబంధమైన స్వైన్‌ఫ్లూ లక్షణాలు.. పలువురిలో ప్లేట్‌లెట్లు తగ్గిపోతూ డెంగీ లక్షణాలు.. బాధితుల్లో కీళ్ల నొప్పులతో చికున్ గున్యా లక్షణాలు.. విరేచనాలు, వికారం వంటి అతిసార లక్షణాలు.. ఇలా అంతుబట్టని జ్వరాలతో బాధితులు అల్లాడిపోతుండగా.. అర్థంకాని వైరస్ లక్షణాలతో వైద్యులు తలలుపట్టుకుంటున్నాయి. వాతావరణంలో పలు రకాల వైరస్‌లు కలిసి(వైరస్ కాక్‌టెయిల్) కనిపిస్తున్నట్లు వైద్య వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. రోగుల్లో కనిపిస్తున్న లక్షణాలతో ఇవి ఎటువంటి జ్వరాలో అర్థం కాక వైద్యులు కూడా కలవరపడుతున్నారు. ఇన్‌ఫ్లుయెంజా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గన్యా, డయేరియా, స్వైన్‌ఫ్లూ వంటి పలు రకాల రోగ లక్షణాల బాధితులతో ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడిపోతున్నాయి.

పడకేసిన పారిశుధ్యం.. కనిపించని వైద్య శిబిరాలు..

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల ధాటికి పల్లెలతో పాటు పట్టణాల్లోనూ పారిశుధ్యం పడకేసింది. చాలా చోట్ల వరద పోటెత్తడంతో గతంతో పోల్చుకుంటే దోమల విజృంభణ మరింతగా పెరిగింది. పారిశుధ్య పనుల్లో పైపైన వ్యర్థాలు తొలగించడానికి పారిశుధ్య సిబ్బంది పరిమితమవుతున్నారు తప్పితే పూర్తి స్థాయి శ్రద్ధ లోపించింది. దీంతో రాత్రిళ్లే కాకుండా పగలు కూడా దోమల దాడి అధికమవుతోంది. దోమల కారణంగానే అధిక సంఖ్యలో జ్వరాలు ప్రబలుతున్నా నివారణ చర్యలపై మున్సిపాలిటీలు, పంచాయతీలు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక జ్వరాలతో పల్లెలు, పట్టణాల్లో పలు కాలనీలు పడకేసినా వైద్య శిబిరాల నిర్వహణపై కనీసంగా కూడా వైద్య ఆరోగ్య శాఖ స్పందించడంలేదు. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు కూడా జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఇక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు అయితే ఇన్, అవుట్ పేషంట్లకు లెక్కేలేదు. రెండు వారాల వ్యవధిలో బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఒక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 13 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే డెంగీ కేసులను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య 50కి పైగానే ఉండే అవకాశం ఉంది. గడచిన నెలలో డెంగీ లక్షణాలతో బాపట్ల పరిధిలో ఓ అంగన్వాడీ కార్యకర్త మృతి చెందిన సంగతి తెలిసిందే. డెంగీ, టైఫాయిడ్, మలేరియా లక్షణాలకు సాధారణ జ్వర లక్షణాలతో రోజూ వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రుల బాట పడుతున్నారు. బాపట్ల ఏరియా ఆస్పత్రిలో రోజూ దాదాపు 400 వరకు ఓపీలు వస్తుండగా సాధారణ జ్వరాలతో వస్తున్న వారు 80 మంది వరకు ఉంటున్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 43 పీహెచ్‌సీలలో ఇదే పరిస్థితి నెలకొంది.

గుంటూరు(మెడికల్)/ బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, ముంచెత్తిన వరదలతో అల్లాడిపోయిన ప్రజలను ప్రస్తుతం జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా అంతుబట్టని జ్వరాలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలతో అల్లాడుతున్నారు. వాతావరణంలో వింత వైరస్‌లు ప్రవేశించాయి. వీటి ప్రభావంతో రోగుల్లో పలు రకాల వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రబలుతున్న వింత జ్వరాలు దోమల ద్వారా వస్తున్నాయా? కలుషిత నీరు, ఆహారం ద్వారా సంక్రమిస్తున్నాయా? లేక ఒక రోగి నుంచి మరొక రోగికి గాలి తుంపర్ల ద్వారా(డ్రాప్‌లెట్ ఇన్‌ఫెక్షన్స్) వస్తున్నాయా? అనేది అంతు బట్టడం లేదు. మొత్తం మీద జిల్లావాసులను వైరల్ ఫీవర్లు వణికిస్తున్నాయి. ఇంట్లో ఒకరు వైరల్ ఫీవర్ బారిన పడితే.. ఇంటిల్లిపాదీ జ్వరాల బారిన పడుతున్నారు. ఇన్‌ఫ్లుయెంజా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గన్యా, డయేరియా, స్వైన్‌ఫ్లూ వంటి పలు రకాల రోగ లక్షణాలు రోగుల్లో కనిపిస్తున్నాయి. ఇవి ఎటువంటి జ్వరాలో అర్థం కాక.. వైద్య వర్గాలు తలలు పట్టుకుంటున్నాయి. అడుగంటిన పారిశుధ్యం, దోమల కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ జ్వరాలకు తోడు ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న విపరీత మార్పులతో వైరల్ జ్వరాలు తీవ్రమవుతున్నాయి. గుంటూరు నగరం తో పాటు పట్టణాలు, గ్రామాల్లో ఇంటి కొకరు జ్వరం బారిన పడి ఉన్నారంటే ఆశ్చర్యం కాదు. కొన్ని గ్రామాల్లో అయి తే వందల సంఖ్యలో జ్వర పీడితులు ఉన్నారు. తీవ్రతను బట్టి వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన యంత్రాంగం ఆ దిశగా కనీస చర్యలు చేపట్టకపోవడంతో జ్వరాలు వ్యాప్తికి కారణంగా ఉంది. జ్వర పీడితులు చాలా మంది డెంగీ భయంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

వైద్యుల్లో అయోమయం..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బాధితుల్లో జ్వర లక్షణాలతో వైరల్ హెపటైటిస్-ఏ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. కొందరిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కనిపిస్తున్నాయి. రోగులకు జరుపుతున్న వైద్య పరీక్షల్లో ప్లేట్‌లెట్లు తగ్గడం కనిపిస్తోంది. ఇవి వైరల్ ఫీవర్ లక్షణాలు. రోగుల్లో ఈ రెండు లక్షణాలు కనిపించడంతో వైద్యులు కూడా కొంత అయోమయానికి గురౌతున్నారు. కలుషిత నీరు, ఆహారంతో వైరల్ హెపైటిస్ విజృంభిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీటి వనరులు కలుషితం కావడం వల్ల హెపటైటిస్ ఏ విజృంభణకు కారణంగా చెబుతున్నారు. ఏది వైరల్ జ్వరమో, ఏదీ హెపటైటిస్-ఏ ఇన్‌ఫెక్షనో తెలియక రోగులు ఆందోళన చెందుతున్నారు. సగటున ప్రతి పది మంది జ్వర పీడితుల్లో కనీసం ఇద్దరిలో హెపటైటిస్ నిర్ధారణ అవుతోంది. గతంలో రోగుల్లో ఈ తరహా లక్షణాలు చూడలేదని వైద్యులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మాస్క్ తప్పనిసరి..

ప్రబలుతున్న వైరల్ ఫీవర్ల నేపథ్యంలో కొవిడ్-19 సమయంలో పాటించిన విధంగా ప్రజలు కొంతకాలం మాస్కులు ధరించడం, సోషల్ డిస్టెన్సింగ్ పాటించడం ఉత్తమం. దీని వల్ల డ్రాప్‌లెట్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది.

\- డాక్టర్ ఎస్ రఘు, ప్రభుత్వ ఛాతివ్యాధుల వైద్యశాల సూపరింటెండెంట్, గుంటూరు

విపరీత లక్షణాలు..

మొదట రోగుల్లో మూడు రోజుల పాటు జ్వరం కనిపిస్తోంది. జ్వరంతో పాటు చలి, రోగుల్లో చలిజ్వరం, విపరీతమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు, వికారం వంటి అతిసార లక్షణాలు కనిపిస్తున్నాయి. వారం తర్వాత రోగుల్లో కీళ్ల నొప్పులు, కాళ్లు చేతులు బిగుసుకుపోవడం వంటి చికున్ గున్యా లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరిలో తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు తగ్గిపోతున్నాయి. ఇవి డెంగీ లక్షణాలు. కొందరు రోగుల్లో లివర్ ఎంజైమ్‌లైన బైలిరూబిన్, బైలివర్డిన్‌తో పాటు ఎస్‌జీవోపీ, ఎస్‌జీపీటీ వంటి స్థాయి బాగా పెరిగి ఉండటం కనిపిస్తోంది. ఇవి హెపటైటిస్-ఏ లక్షణాలని వైద్యులు చెబుతున్నారు. మరికొందరిలో శ్వాస సంబంధమైన సమస్యలు, ముక్కు కారడం వంటి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఇవి స్వైన్‌ఫ్లూ, కొవిడ్ -19 లక్షణాలను పోలి ఉంటున్నాయి. మరి కొంత మంది రోగుల్లో జ్వరం తగ్గిన తర్వాత గంట నుంచి మూడు గంటల పాటు ఆగకుండా దగ్గు వస్తోంది.



గుంటూరులోని నూనె షాపుల్లో ఉన్న డబ్బాలపై ఉన్న లేబుల్స్ పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రవణ్‌కుమార్

వంట నూనెలపై.. విజిలెన్స్

- దుకాణాల్లో డెకాయిడ్ ఆపరేషన్ తనిఖీలు
- గుంటూరు, నరసరావుపేటలో 9 మందిపై కేసులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 17: రాత్రికి రాత్రి వంట నూనెల ధరలు పెంచేయడంపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వంట నూనెల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాలో ఏకకాలంలో డెకాయిడ్ ఆపరేషన్ తరహాలో తనిఖీలు జరిగాయి. తొలుత సామాన్య పౌరుల మాదిరిగా విజిలెన్స్ సిబ్బంది నూనెలు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్లి ధరలు తెలుసుకున్నారు. యజమాని చెప్పే ధరకు, నూనె ప్యాకెట్‌పై ముద్రించిన ధరకు ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించి తనిఖీలు చేపట్టారు. లేబుల్స్, తూకం తదితరాలను పరిశీలించారు. కొంతమంది వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుపుతుండటం గమనించి వారిపై తూనికలు, కొలతలకు సంబంధించిన కేసులు నమోదు చేయించారు. గోడౌన్లలోని స్టాక్‌ను కూడా అధికారులు పరిశీలించారు. వంట నూనెలు బ్లాక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని వ్యాపారుల ను అధికారులు హెచ్చరించారు. గుం టూరులో ఐదుగురు, నరసరావు పేటలో నలుగురు వ్యాపారుల పై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఉదయం ప్రా రంభమైన దాడులు రాత్రి పొద్దుపో యే వరకు కొనసాగినట్లు తెలిసింది. దాడుల్లో విజి లెన్స్ సీఐలు శ్రీహరిరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు

ప్రకృతి రక్షణతోనే ప్రజల సంరక్షణ

- స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 17: ప్రకృతిని రక్షిస్తే అది ప్రజలను సంరక్షిస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. డీపీవో రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్‌మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిశుభ్రమైన భారతదేశాన్ని రూపొందించాలన్నారు. స్వచ్ఛాంధ్ర మిషన్ అమలులో ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. తడిచెత్తను ఎరువుగా మార్చి తోటల పెంపకానికి వినియోగించాలన్నారు. పొడిచెత్తను రీసైక్లింగ్‌కు పంపించాలన్నారు. తద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గించవచ్చని చెప్పారు. చెత్తనిర్వాహణపై ప్రజల్లో అవగాహన కల్పించి, మార్పు తీసుకురావాలన్నారు. పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవడానికి 400 ఏళ్ల పడుతుందనే విషయాన్ని ప్రజలు గుర్తించి వాడకాన్ని క్రమేపి పూర్తిగా తగ్గించాలని కోరారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్లాస్టిక్‌లో ఉండే ఆహారం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కలుషితమైన నీటిని, ఉప్పు నీటిని శుద్ధజలంగా మార్చి ప్రజలు వినియోగించుకునేలా ఎస్‌టీటీ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎం.శివకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో పులి శరత్‌బాబు, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, డాక్టర్ జి.చార్వాక, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, సీనియర్ నాయకులు ఇనగంటి గాంధీ, మందపాటి ఆంద్రేయ, పల్లంసరోజిని, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, చెన్నుపాటి హైమావతి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఉప ఖజానాలో కాసులవేట

ఆదాయం వచ్చే సీటు కోసం పోరు

పర్సంటేజీల పంపకాలలో తేడాలే కారణమా

చీరాల, సెప్టెంబరు 17: చీరాల ఉప ఖజానా అధికారుల రూటే సపరేటుగా మారింది. కార్యాలయంలో ఆధిపత్యపోరు సాగుతోంది. పర్సంటేజీల పంపకాలలో తేడా లే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. అన్ని బిల్లులకు, పెన్షన్లకు, అరియర్ బిల్లులకు సంబంధించిన పనులు పూర్తి చేయాలంటే ఒక్కో సీటుకు ఒక్కో రేటు ఉంది. కార్యాలయంలో ఆధిపత్యపోరు అధికారులు, సిబ్బంది మధ్య వర్గపోరుగా మారింది. పాస్ కావాల్సిన బిల్లులు, పెన్షన్లు, అరియర్స్‌కు సంబంధించిన బిల్లులకు మూడు నుంచి ఐదు శాతం మామూళ్లుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అదనపు ఆదాయం ఎక్కువగా వచ్చే సీటు కోసం సిబ్బంది మధ్య పోటీ పెరిగింది. ఈ నేపథ్యంలో మారిన ఆఫీసు ఆర్డరుతో వివాదాలు రోడ్డెక్కాయి. దీంతో ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, డీటీవో పరమేశ్వరి విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఒక్కో సీటులో పనిచేసేవారిది ఒక్కో విధానమని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన వారు చెప్తున్నారు. కొందరు పర్సంటేజీ ముందు ఇచ్చినా ఇవ్వకపోయినా ఆపకుండా చేసి ఆ తర్వాత డబ్బు ఇచ్చినా తీసుకుంటారని, మరికొందరు ముందు పర్సంటేజి ఇస్తేనే పని చేస్తారని లేదంటే పెండింగ్ పెడుతుంటారన్నారు. అంతిమంగా కార్యాలయంలో లంచం లేనిదే ఏపని జరగదనేది తెలుస్తుంది.

అవకతవకలు లేకుండా చూస్తాం..



నాకు ఆరోగ్యం సరిగ్గా లేక దీర్ఘకాలం సెలవులో ఉన్నాను. కార్యాలయంలో నెలకొన్న పరిణామాలు, పరిస్థితులకు సంబంధించి ఆఫీస్ ఆర్డరు మార్పు చేసిన మాట వాస్తవమే. కలెక్టర్ ఆదేశాల మేర కు ఆర్డీవో, డీటీవో విచారణ చేపట్టారు. బిల్లులు పెండింగ్ లేకుండా పాస్ చేశాం. ఇకపై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకుంటాం.

\- భాగ్యలక్ష్మి, ఎస్టీవో, చీరాల

అధికారులు, సిబ్బంది రాజీ

పర్సంటేజీల విషయం వీధికెక్కడంతో తొలి రోజు విచారణలో ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణలతో పలు వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. దీర్ఘకాలంగా ఒక ప్రాంతంలో పనిచేస్తున్నవారు ఆధిపత్యం నెగ్గాలనే పంతంతో ఉన్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ ఆదేశాలతో చేపట్టిన విచారణతో తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని అధికారులు, సిబ్బంది మల్లగుల్లాలు పడుతున్నారు. ఆ క్రమంలో మంగళవారం అధికారులు, సిబ్బంది మధ్యేమార్గంగా రాజీపడినట్లు సమాచారం.



బృహత్ శిలా యుగం నాటి సమాధులు

ద్రోణాదులలో అన్నదాన శాసనం

- కొండపై 7వ శతాబ్దం నాటి శిలాయుగ సమాధులు

మార్టూరు, సెప్టెంబరు 17: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో మరికొన్ని కొత్త శాసనాలు, సమాధులు వెలుగు చూసినట్లు పురావస్తు శాస్త్ర పరిశోధకుడు విద్వాన్‌జ్యోతి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం ఆయన గ్రామంలో వెలుగుచూసిన అన్నదాన శాసనాలు, బృహత్ శిలాయుగం నాటి(రాక్షస గూళ్లు) సమాధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రోణాదుల గ్రామంలో జరిపిన పరిశోధనలో క్రీ.శ. 1634వ సంవత్సరంలో తంగేడి నాయనింగారు చేయించిన సేవావార అని రాసి ఉన్న శాసనాన్ని గుర్తించినట్లు చెప్పారు. రెండో శాసనంలో హేవళంబ సంవత్సర కార్తీక శుద్ధ పౌర్ణమి సోమవారం శ్రీశైలం, మొదలైన భిక్ష వృత్తి వారికి ద్రోణాదులలోని వీరేశ్వరస్వామి దేవస్థానం ముఖమండపంలో కోటి వీరయ్య, అవఘళ వీరయ్య, కందుకూరి కుమారరాచ విజయనరసయ్యగారు స్వామివారికి వేయించన శాసనం అని రాసి ఉందన్నారు. శ్రీశైలం వెళ్లే భిక్ష వృత్తివారికి నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని ఆ శాసనాలలో ఉన్నట్లు తెలిపారు. కొండపైన క్రీ.పూ. 7వ శతాబ్దం నాటి బృహత్ శిలాయుగం నాటి సమాధులను గుర్తించామన్నారు. వీటి ఆధారంగా ద్రోణాదుల ప్రాంతంలో అప్పటికే జనసంచారం ఉన్నట్లు తెలిస్తుందని చంద్రమౌళి తెలిపారు.



17వ శతాబ్దం నాటి అన్నదాన శాసనాన్ని పరిశీలిస్తున్న పురావాస్తు పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి

ఘనంగా వినాయకుడికి వీడ్కోలు



జనసంద్రోహం నడుమ నిమజ్జనానికి తరలుతున్న విఘ్నేశ్వరుడు

పర్చూరు, సెప్టెంబరు 17: పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహానికి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలుకుతూ నిమజ్జనానికి తరలించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసిన ప్రత్యేక వాహనంలో స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఏర్పాటుచేసి బాణసంచా కాలుస్తూ, డీజేలు, డప్పు వాయిద్యాల భారీ జనసంద్రోహం నడుమ ఊరేగింపు నిర్వహించారు. చీరాల వాడరేవు తరలించి నిమజ్జనం చేశారు. మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవిఎల్ శ్రీనివాసరావు, ఎస్సై మాలియాద్రి నేతృత్వంలోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రూ.4లక్షలు పలికిన స్వామివారి లడ్డూ వేలం

దేవరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద భక్తులు స్వామివారికి సమర్పించిన లడ్డూకు వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన కొమ్మాలపాటి సురేష్ రూ.4లక్షలకు పాడుకొని ప్రసాద లడ్డూని పొందారు.

ప్రజలకు అందుబాటులో సబ్ రిజిస్ట్రార్ సీటు

మార్టూరు, సెప్టెంబరు 17 : ఎదురుగా టేబుల్ పైన కంప్యూటర్, సాధారణమైన కుర్చీలో సబ్ రిజిస్ట్రార్ సీహెచ్.రామకోటయ్య ఆసీనులైన దృశ్యం మంగళవారం మార్టూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ కూర్చునే సీటు వైఖరిని మార్చాలనే నిబంధన తెచ్చింది. వాటికి అనుగుణంగా మార్టూరు సబ్ రిజిస్ట్రార్ గతంలో ఉన్న వాటిని తొలగించి, కొత్తగా సాధారణ ఉద్యోగి లాగా తన సీటులో కూర్చున్నారు. ఈ నేపథ్యంలో వివిధ స్థలాలు, పొలాలు, తదితర రిజిస్ట్రేషన్లు నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఈ మార్పుపై చర్చించుకుంటున్నారు.

వైసీపీ పాలనలో అక్రమ కేసులు

తెలుగు తమ్ముళ్లకు అండగా ఏలూరి

నియోజకవర్గ వ్యాప్తంగా 50మందిపై ఫిర్యాదులు

ఎమ్మెల్యే చొరవతో 25కు పైగా కొట్టివేత



హోంమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు సెప్టెంబరు 17 : తెలుగు తమ్ముళ్లకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలుస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారు. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలే లక్ష్యంగా వందలాది కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో అక్రమ కేసులను కొట్టివేయించి తమ్ముళ్లకు అండగా నిలిచేందుకు ఏలూరి ప్రత్యేక దృష్టిసారించారు. ఇందుకోసం ఏలూరి క్యాంపు కార్యాలయంలో న్యాయ నిపుణులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి కేసుల పరిష్కారానికి ఆయన దృష్టిసారించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కేసుల పురోగతిపై సమీక్షిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత దృష్టికి తీసుకుపోయి అక్రమ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే 25 అక్రమ కేసులను కొట్టివేశారని ఆయన తెలిపారు.

కేసుల పరిష్కారమే లక్ష్యంగా అడుగులు

జగన్‌రెడ్డి రాజకీయ కక్షలో భాగంగా అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడి ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించింది. ఎలాంటి ఆధారాలు సాక్ష్యాలు లేని నమోదు చేసిన కేసులను అధికారుల ముందు ఉంచారు. సుమారు 50కిపైగా నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారు. వీటిలో 25 కేసులకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని కొట్టివేయించేలా ఎమ్మెల్యే చొవర చూపారు. మిగిలిన కేసులను కూడా కొట్టివేయిస్తామని ఏలూరి ధైర్యం చెప్పారు.


పాము కాటుతో రైతు మృతి

బల్లికురవ, సెప్టెంబరు 17 : మండలంలోని గుంటుపల్లికి చెందిన రైతు చల్లగుండ్ల నాగేశ్వరరావు (52) మంగళవారం పాము కాటుతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాగేశ్వరరావు పొలం వద్ద పనులు చేస్తుండగా పాము కాటేసింది. నాగేశ్వరరావు ఇంటికి వచ్చి కాలికి ఏదో గాయమైందని సొంత వైద్యం చేసుకున్నారు. తర్వాత పశువుల వద్ద పనులు చేస్తుండగా కొద్దిసేపటికి నోటి నుంచి నురుగు రావడంతో భార్య గమనించింది. వెంటనే పీహెచ్‌సీలో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చిలకలూరిపేట తరలించగా అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాగేశ్వరరావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉన్నత విద్య కోసం అమెరికాలో ఉన్నాడు. వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు మృతితో గుంటుపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి.

గవినివారిపాలెంలో పారిశుధ్యం అధ్వానం

కార్యదర్శి తీరుపై విమర్శలు

వృద్ధకార్మికుడి జీతం నిలిపివేత



అపరిశుభ్రంగా గ్రామంలో ప్రధాన జంక్షన్

చీరాలటౌన్, సెప్టెంబరు 17 : చీరాల మండల పరిధిలోని గవినివారి పాలెంలో గ్రామంలో పారిశుధ్య సమస్యలు తాండవిస్తున్నాయి. గత రెండేళ్లుగా పంచాయతీ నిధులు లేకపోవడంతో ఇంటిపన్ను వసూళ్ల ద్వారా శానిటేషన్, ఇతర మౌలిక వసతులను అందించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. కానీ సెక్రటరీ నీలిమ కార్మికులు నెలలు తరబడి జీతాలు ఆపడంతో వారు విధులను బహిష్కరించారు. దీంతో గ్రామంలో వీధులు దారుణంగా మారాయి. చెత్తా చెదారంతో కంపుకొడుతున్నాయి. దీంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. బ్లీచింగ్ ఊసే లేదు. వీధి దీపాలు అసలే లేవు. గతంలో కూడా సెక్రటరీ ఇదే తరహాలో వ్యవహరించడంతో అప్పటి ఎంపీడీవో శోభారాణి మండల పరిధిలోని ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు కార్మికులను గవినివారిపాలెంకు పంపించి పారిశుధ్య పనులు చేయించారు. సెక్రటరీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఆమె అదే పద్ధతిని అనుసరించడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారాయి. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా చీరాలకు రెగ్యులర్ ఈవోఆర్డీ లేపోవడం, డీఎల్‌పీవోగా అద్దంకి వారిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించిన పర్యవేక్షణ అసలు లేదు. ఈక్రమంలో ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఏడు నెలల జీతం సెక్రటరీ ఆపారు

- బుర్ల పోలయ్య, పాత పంచాయతీ కార్మికుడు

గ్రామంలోని ఆర్వోప్లాంట్ కార్మికుడిగా చాలా కాలంగా పని చేస్తున్నా. కార్యదర్శికి నాకు మధ్య వివాదం తలెత్తింది. ఏడు నెలలు జీతం ఆపారు. వృద్ధుడునని చూడకుండా పనిలోనుంచి తొలగించారు. జీతం విషయమై అడిగితే భయానికి గురి చేస్తున్నారు. అధికారులు న్యాయం చేయాలి.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

కనిగిరి, సెప్టెంబరు 17 : నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ గోడలకు నీరు పడుతూ జారిపడి ఎర్రంరెడ్డి చెన్నారెడ్డి(62) మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెన్నెల అపార్ట్‌మెంట్ వద్ద కొత్తగా మరో అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతోంది. మండల పరిధిలోని పునుగోడు గ్రామానికి చెందిన చెన్నారెడ్డి తన అల్లుడుకు చెందిన అపార్ట్‌మెంట్ నిర్మాణ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాడు. గోడలకు నీరు పెడుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. కింద పడిన సమయంలో తలకు ఫ్లోర్ బలంగా తగలటంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు.

అంతా మామూళ్లే

విద్యుత్ శాఖ అవినీతిమయం

కొత్త కనెక్షన్ ఏర్పాటు అంటే పండగే

డబ్బులిస్తే ఇష్టారీతిన మార్పుచేర్పులు

కమర్షియల్ అయితే ఇష్టానుసారం

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.లక్ష డిమాండ్

మర్రిపూడిలో ఏఈ, లైన్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు

ఇటీవల ఏసీబీ వలలో మరో లైన్‌మెన్

పంటలను కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు

ఇదే అదనుగా దోచుకుంటున్న కరెంట్ సిబ్బంది

-రాచర్ల మండలం అనుమాలపాడులో గత నెలలో ఓ రైతు పొలంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఏర్పాటు కోసం వెళితే.. రూ.20 వేలు లంచం అడిగాడు లైన్‌మన్ రామలింగం. దీంతో ఆ రైతు విసిగిపోయి అతనిని ఏసీబీకి పట్టించాడు. లైన్‌మన్ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడని తెలిసి బాధిత రైతులంతా హర్షం వ్యక్తం చేసిన పరిస్థితి.

-మర్రిపూడి మండలంలో విజిలెన్స్ అధికారులు చేసిన విచారణలో విస్తుపోయే నిజాలు బయిటపడ్డాయి. రైతుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం లక్ష నుంచి రెండు లక్షలు డిమాండ్ చేసినట్లు వెల్లడంచడం గమనార్హం. దీంతో ఏఈ, లైన్‌మన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

- ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారులు ఇష్టారాజ్యమైంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే రూ.50వేలు, పాతది మార్చాలంటే రూ.10వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. స్తంభాలు, పరికరాలు అవసరం లేకపోయినా సరే మార్చినట్లు చూపి వాటిని రైతులకు అమ్ముకుంటున్నారు. ఇటీవల అమానిగుడిపాడు సబ్‌స్టేషన్‌లో 110 స్తంభాలను అమ్ముకోగా, అందులో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను అధికారులు సస్పెండ్ చేశారు.

-జిల్లాలోని విద్యుత్ శాఖలో ఇదీ పరిస్థితి. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించుకొని వసూలు చేయడం పరిపాటిగా మారింది. కరెంట్ మీటర్లు ఇవ్వడం నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వరకు లంచం ఇవ్వకపోతే అడుగు ముందుకు పడదు. కాదు కూడదంటే కనెక్షన్ కోసం నెలలు తరబడి తిరగాల్సిందే. లైన్‌మెన్ నుంచి ఉన్నతాధికార్ల వరకు అ మొత్తం వాటాలు పంచుకుతింటున్నారు.

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 17 : విద్యుత్ శాఖ అవినీతిమయంగా మారింది. రైతులు పొలాలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు విషయంలో లక్షలు డిమాండ్ చేసి జేబులు నింపుకొంటున్నారు. వేసిన పైర్లు ఎండిపోతున్నాయని విద్యుత్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలాగా తిరిగినా లంచం ఇవ్వందే సిబ్బంది కదలని పరిస్థితి నెలకొంది. గత నెలలో రాచర్ల మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ విషయమై రైతును లంచం డిమాండ్ చేయడంతో అతను విసిగిపోయి లైన్‌మన్‌ను ఏసీబీకి పట్టించడమే ఇందుకు నిదర్శనం. అలాగే సామాన్యుడు చిన్న ఇల్లు నిర్మించుకున్నా అందుకు మీటరు ఏర్పాటు చేయాలంటే కనీసం రూ.5 వేలకు తగ్గకుండా వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేతివాటానికి అలవాటు పడిన సిబ్బంది అనేక విధాలుగా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసి వచ్చినకాడికి దండుకోవడం షరామామూలైంది. నగరంలో కమర్షియల్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.లక్ష డిమాండ్ చేయడం అందుకు ఉదాహరణ. మామూళ్లు ముట్టజెబితే ఎలాంటి అడ్డంకులు ఉండవు. లేకుంటే ఏదో ఒకస్థాయిలో దరఖాస్తులు వెనక్కి వస్తాయి. వినియోగదారులు నేరుగా కార్యాలయాలకు వెళితే ఎలాంటి పనులు కావు. అందుకు సంబంధించి కిందిస్థాయి ఉద్యోగులు లైన్‌మన్, ఏఈలను సంప్రదిస్తే వెంటనే పనులు చేయడం పరిపాటిగా మారింది. గత ఐదేళ్లుగా వేళ్లూనుకున్న అవినీతి ప్రభుత్వం మారినా అలాగే కొనసాగుతోంది. సిబ్బందిలో ఎలాంటి మార్పు రాలేదనే చెప్పవచ్చు.



ట్రాన్స్‌ఫార్మర్లు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.లక్ష డిమాండ్

మర్రిపూడి మండలం గుళ్ళసముద్రంలో చంద్రమౌళి అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం గత రెండేళ్లుగా తిరుగుతున్న ఉపయోగం లేదు. అందుకోసం విద్యుత్ అధికారులు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై చంద్రమౌళి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులను దర్యాప్తు చేయాలని సీఎండీ ఆదేశాలు ఇచ్చారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి. ఆయా ప్రాంతాల్లో రైతుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.లక్ష చొప్పున తీసుకున్నట్లు రైతులు తెలిపారు. ఈమేరకు విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చిన తర్వాత అక్కడ పనిచేస్తున్న ఏఈ రామకృష్ణారెడ్డి, లైన్‌మన్ బాలకృష్ణారెడ్డిలను సస్పెండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం కేవలం రూ.6,200లే కట్టాలి

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతులు ఒక్కొక్కరు కేవలం రూ.6,200 మాత్రమే చెల్లించాల్సి ఉంది. రూ.5వేలు డిపాజిట్, వెయ్యి రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్, రూ.200 అప్లికేషన్ ఫీజు కట్టాలి. ఇలా ఐదుగురు రైతులు కలిసి రూ.31,000 చెల్లిస్తే 15 నుంచి 30 రోజులలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలి. అసలు విద్యుత్ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. మీసేవ కేంద్రాలలో రూ.200 అప్లికేషన్ ఫీజుతో పాటు ఆ శాఖకు సంబంధించిన డిపాజిట్ రూ.6లు చెల్లిస్తే సరిపోతుంది. ఇలా అప్లికేషన్ పెట్టిన 30 రోజులలో ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి. అయితే ఇలాంటి అప్లికేషన్లను పెండింగ్‌లో పెట్టి ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికి ఏర్పాటు చేయడం ఎక్కువైంది.

అపార్ట్‌మెంట్‌కు కనెక్షన్ ఇస్తే రూ.లక్ష

అపార్ట్‌మెంట్‌లో వినియోగించుకునే మీటర్లకు విద్యుత్ శాఖకు డిపాజిట్ చెల్లించినా అదనంగా రూ.లక్ష ఇవ్వకుంటే ఆ దరఖాస్తులు వెనక్కి వస్తాయి. సామాన్యులు విద్యుత్ మీటరు ఏర్పాటుకు రూ.5వేలు వసూలు చేస్తున్నారు. మామూలుగా అయితే కిలోవాట్‌కు రూ.2వేలు చొప్పున చెల్లించి, సెక్యూరిటీ డిపాజిట్ రూ.800 చెల్లించడంతోపాటు మీసేవలో అప్లికేషన్ ఫీజు రూ.150 ఇవ్వాలి. అయితే లైన్‌మెన్లను సంప్రదిస్తే రూ.5 వేలు మీటరుకు వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతి పనికి ఓ రేటు పెట్టి సామాన్యుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు.

వైపాలెం నియోజకవర్గంలో ఇష్టారాజ్యం

ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచాలంటే తప్పరిసరిగా దరఖాస్తు చేసుకోవాలి. అయితే వైపాలెం నియోజకవర్గంలో డబ్బులిస్తే చాలు ఎంత కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ అయినా బిగిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోంది. అయితే అధికారులు మాత్రం భారీగా లబ్ధిపొందుతున్నారు. వైపాలెం నియోజకవర్గంలో ఇప్పటికీ గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే అన్ని వ్యవహారాలను చక్కబెట్టడం గమనార్హం. పుల్లలచెరువు మండలంలో హెచ్‌వీడీఎస్ జరగ్గా అందులో కొంత పాత సామానునే వాడారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినందుకు కూడా రైతుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేశారు. అలాగే మండలంలో ఒక అధికారి స్థానికంగా పాతుకుపోయారు. ఏ ప్రభుత్వం ఉన్నా అతనే చక్రంతిప్పుతున్న పరిస్థితి. అతని అర్హత లేకున్నా గతంలో మూడు మండలాలకు అధికారిగా కొనసాగారు. వైపాలెం మండలంలోని పిల్లికుంట నుంచి పుల్లలచెరువు మండలం మురికిమళ్ల వరకు 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైన్ నిరుపయోగంగా ఉంది. అయితే ఆ లైన్‌కు వాడిన ఇనుప స్తంభాలు, వైర్లను ఇటీవల తొలగించి గుట్టుచప్పుడు కాకుండా మాయం చేశారు. వాటి విలువ సుమారు రూ.15లక్షల వరకు ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

- కెవిజి.సత్యనారాయణ, ఎస్ఈ

విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడితే ఎంతటి వారైన చర్యలు తప్పవు. మర్రిపూడి మండలంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా అక్కడ పనిచేస్తున్న ఏఈ, లైన్‌మన్‌ను సస్పెండ్ చేసాము. అదేవిధంగా ఏసీబీకి దొరికిన లైన్‌మన్‌పై కూడా చర్యలు తీసుకున్నాము. శాఖలో ఏ స్థాయి వారు అవినీతికి పాల్పడినా సహించేది లేదు. వినియోగదారులు నేరుగా తమ కార్యాలయంలో పిర్యాదు చేయవచ్చు.

అరెస్టు భయంతో వైసీపీ ధర్నా ఎత్తుగడ

ప్రతిస్పందించిన టీడీపీ నేతలు

పకడ్బందీగా వ్యవహరించిన పోలీసులు

ఇరుపార్టీల నాయకులకు ముందస్తు నోటీసులు

దర్శిలో 144 సెక్షన్ విధింపు

అదనపు బలగాలతో కవాతు



ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డికి, పాపారావుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

దర్శి, సెప్టెంబరు 17 : దాడుల కేసులలో అరెస్టు చేస్తారనే భయంతో వైసీపీ నాయకులు వేసిన ధర్నా ఎత్తుగడ వికటించింది. పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు జరగకుండా అడ్డుకున్నారు. ఇరు పార్టీల నాయకులకు నోటీసులు ఇచ్చి గృహాలకే పరిమితం చేశారు. దర్శి పట్టణంలో 144 సెక్షన్ విధించి ప్రజలు గుంపులుగా తిరగకుండా ఆంక్షలు విధించారు. అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. సాయంత్రం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియటంతో పోలీసులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అందుకు నిరసనగా మగళవారం ధర్నా చేస్తామని సోమవారం రాత్రి ప్రకటించారు. దీనికి ప్రతిగా టీడీపీ నాయకులు కూడా స్పందించారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి గాయపరిచి ఆస్పత్రి పాల్జేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు సీఐ వై రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఉపేక్షిస్తే తాము ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దర్శిలో నివాసం ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు ముఖ్యమైన నాయకులకు నోటీసులు ఇచ్చారు. అనుమతి లేనందున ధర్నా చేయరాదని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఇంటి నుంచి బయటకు రాకూడదని నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యతో పాటు పలువురు టీడీపీ నాయకులకు కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఇతర గ్రామాల నుంచి ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు రాకుండా పట్టణంలోకి రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు గృహాలకే పరిమితమయ్యారు. సాయంత్రం వరకు పోలీసులు పట్టుసడలకుండా వ్యవహరించటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా వివాదం ముగిసింది.

టీడీపీ నాయకులపై దాడులు చేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ నాయకులు, కార్యకర్తలపై మొన్నటి ఎన్నికల సందర్భంగా ఆతర్వాత దాడులు చేసిన వైసీపీ గూండాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ డిమాండ్ చేశారు. ఎన్నికల రోజున బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపర్చారని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తనను దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారని, అదేవిధంగా దర్శికురిచేడు రోడ్డులోని ఎన్‌ఏపీ కార్యాలయం పోలింగ్ బూత్‌లోకి అభ్యర్థిని అయిన తనను వెళ్లకుండా అడ్డుకొని రాళ్లతో దాడిచేసి దుర్భాషలాడారని లక్ష్మీ చెప్పారు. కొత్తరెడ్డిపాలెంలో ప్రచారం చేయకుండా అడ్డుకున్నారని, గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే బాడుగకు వెళ్లిన దళిత యువకులు టీడీపీ సానుభూతిపరులన్న అక్కసుతో దాడి చేశారని తెలిపారు. ఈ సంఘటనల్లో నిందితులైన వైసీపీ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులు అబద్ధపు ప్రచారంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టటం శోచనీయమన్నారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని ఆమె చెప్పారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులు

ఎమ్మెల్యే బూచేపల్లి

వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. దర్శిలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ తాము శాంతియుతంగా ఆందోళన చేయాలని భావిస్తే పోలీసులు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తలకు అండగా నిలచి కాపాడుకుంటానన్నారు. భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

జిల్లాకు ఐదు కొత్త కేజీబీవీలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 17: జిల్లాకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొత్తగా ఐదు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు మంజూరయ్యాయి. ఈ మేరకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొత్తగా రాష్ట్రానికి 38 కేజీబీవీలు రాగా అందులో జిల్లాకు ఐదు మంజూరు చేశారు. దొనకొండ జడ్పీ హైస్కూలు, పెద్దారవీడు మండలం ఏనుగులదిన్నెపాడు, సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లె, కొత్తపట్నం జడ్పీ హైస్కూల్, తాళ్ళూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ టైప్-4 కేజీబీవీలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో కేజీబీవీకి రూ.10లక్షల చొప్పున రూ.50లక్షలు విడుదల చేశారు. ఆయా పాఠశాలల్లో హాస్టల్ ఏర్పాటు చేసే భవనాల మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులు, పారిశుధ్య పనులు తదితరాలకు ఈ నిధులను వినియోగిస్తారు. ఈ పాఠశాలలకు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న బాలికలకు ఈ టైప్4 కేజీబీవీల్లో వసతి కల్పిస్తారు. మాములు కేజీబీవీల్లా కాకుండా ఇక్కడ విద్యార్థినులకు కేవలం హాస్టల్ వసతి మాత్రమే కల్పిస్తారు. దూరప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే బాలికల కోసమే వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

ఈ పంట నమోదు గడువు పెంపు

ఒంగోలు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఈపంట నమోదు గడువును ఈనెల 23 వరకు ప్రభుత్వం పెంచింది. తొలుత ఈ నెల 15 నాటికే నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో ఈనెల 10 నాటికే సాగైన విస్తీర్ణంలో 90 శాతం విస్తీర్ణానికి సంబంధించి ఈ పంట నమోదును ఆ శాఖ సిబ్బంది పూర్తిచేశారు. అయితే కీలకమైన వీఆర్వో గుర్తింపు. గ్రామస్థాయి వ్యవసాయ శాఖ అసిస్టెంట్(వీఏఏ) ద్వారా సాగుదారు కేవైసీ కార్యక్రమాలు 75శాతం మేర పూర్తయ్యాయి. అయితే పలు జిల్లాల్లో వరదల కారణంగా ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఈ పంట నమోదు గడువును ప్రభుత్వం పెంచింది. ఆ ప్రకారం ఈనెల 23 వరకు ఈ పంట నమోదుతోపాటు కేవైసీ ప్రక్రియను కూడా పూర్తిచేయాలి. అలా పూర్తి చేసిన సాగుదారుల జాబితాలను ఈనెల 24 నుంచి 27 వరకు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో ప్రకటించాలి. వాటిపై వచ్చిన అభ్యంతరాలను 28, 29 తేదీల్లో పరిష్కరించి తుది జాబితాలను ఈనెల 30న ప్రకటిస్తారు. ఆ మేరకు షెడ్యూల్‌ను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వగా తదనుగుణంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఏఓ శ్రీనివాసరావు కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్‌పై గోప్యం

ఉత్తర్వులు బయటపెట్టేందుకు విముఖత

నివేదికను కలెక్టర్‌కు పంపామన్న డీపీవో

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17 : జిల్లాలోని ఇరువురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినా ఆ విషయాన్ని బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య, మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు కార్యదర్శి శ్రీనివాసులును మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. అయితే ఈ విషయం బహిర్గతమైనా డీపీఓ అధికారులు మాత్రం అదేమీ లేదని చెప్పడం విశేషం. సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య అనధికారికంగా ఫోన్‌పేకు పంచాయతీ డబ్బులను పంపుకున్నారు. దీనిపై మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేయడంతో అతనిపై విచారణకు ఆదేశించారు. విచారణాధికారులు రూ.79వేల పంచాయతీ నిధులను తన ఫోన్‌పేకు పంపుకున్నట్లు నివేదించారు. అయితే ఆ నివేదికపై సత్వరమే చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు మంగళవారం అందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్ అన్సారియాకు చేరడంతో సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పంచాయతీ తీర్మానం లేకుండా రూ.7.30 లక్షలతో పలు పనులు చేపట్టి నిధులు డ్రా చేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించారు. అయితే పంచాయతీ తీర్మానాలు లేకుండా పనులు చేసినట్లుగా విచారణాధికారులు నివేదిక ఇవ్వడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణిని సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య సస్పెన్షన్‌పై వివరణ కోరగా విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. ఒకవైపు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినా ఆ ఉత్తర్వులను బయటపెట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కలెక్టర్ తమీమ్ అన్సారియా



విద్యార్థులకు నులిపురుగుల మందు వేస్తున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం ఆవిష్కృతమవుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. దానిపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారు 5,96,751మంది ఉన్నారన్నారు. వీరికి 2,849 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,718 పాఠశాలలు, 233 కళాశాలలు, 95 ఇతర వృత్తి విద్యాసంస్థలలో ఈ మాత్రలను ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 64 పీహెచ్‌సీలు, 18 యూహెచ్‌సీలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రులలో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని పిల్లలు, టీనేజ్ వారందరికి ఇచ్చితంగా ఈ మాత్రలు అందేలా కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, డీఐఓ డాక్టర్ పద్మజ, డీపీఎంఓ వాణిశ్రీ, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రహదారులు అధ్వానం..ప్రజలకు నరకం

- ఏళ్లుగా లేని మరమ్మతులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరు
- వానపడితే వాహనచోదకులకు అవస్థలే


గుంతలమయమైన పర్చూరు - ఇంకొల్లు రోడ్డు

పర్చూరు, సెప్టెంబరు 17 : వైసీపీ పాలనలో పట్టణ, గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఏ రోడ్డు చూసినా అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ప్రధాన రహదారులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి ప్రణాలు కోల్పోతున్నా పట్టించుకున్నవారే కరువయ్యారు.


ఛిద్రమైన దగ్గుబాడు - ఇంకొల్లు రోడ్డు

పర్చూరు నుంచి ఇంకొల్లు వెళ్లే (పాత మద్రాసు రోడ్డు) పరిస్థితి దయనీయంగా మారింది. గోతులు, ఎత్తుపల్లాలు, గులక రాళ్లు లేచి రోడ్డు అధ్వానంగా మారింది. ఈమార్గంలో రాకపోకలు సాగించాలంటే వాహన దారులకు కత్తిమీద సాము అన్న విధంగా పరిస్థితి ఉంది. పర్చూరు మండలం ఉప్పుటూరు నుంచి చెరుకూరు మీదుగా వెళ్లే రోడ్డు పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పర్చూరు నుంచి గుంటూరు వెళ్లే రోడ్డులో అడుసుమల్లి మద్ద రోడ్డు బాగులేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరుచేరడంతో గోతుల రోడ్లపై ద్విచక్రవాహనదారులు పట్టుతప్పి పడిపోతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

దారుణం బల్లికురవ - మార్టూరు రోడ్డు

- నాలుగు కిలోమీటర్లు ఛిద్రం
- కొత్త వ్యక్తులు వస్తే వారి వాహనాలు పోయినట్లే
- గోతులతో దెబ్బతింటున్న కార్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


1. పెద్ద పెద్ద గుంతలతో అవస్థలు పడుతున్న వాహనచోదకులు
2. బల్లికురవ- మార్టురు అర్అండ్‌బి రోడ్డులో మోకాటి లోతు గోతులలో నిలిచిన వర్షపు నీరు
3. నక్కబొక్కలపాడు సమీపంలో ఉన్న మలుపులో గోతుల్లో వేసిన గ్రానైట్ వ్యర్థాలు (ఫైల్)

బల్లికురవ : బల్లికురవ - మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డు నరకప్రాయంగా మారింది. ఆ రోడ్డున ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రయాణించారంటే అంటే వారి వాహనాలు పోయినట్లే. మోకాటి లోతు గోతులలో ఇరుక్కు పోయిన వాహనాలతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. నాలుగు కిలోమీటర్ల ప్రయాణం నరకం కనిపిస్తుందని వాహనచోదకులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వాలు మారిన రోడ్డు మాత్రం బాగు పడడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ-మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డు మెత్తం 10కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డులో 2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం 6కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచింది. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో మిగిలిన నాలుగు కిలోమీటర్ల రోడ్డుపై తట్టెడు మట్టిని కూడా వేసిన దాఖాలాలు లేవు. దీంతో ఇప్పుడు ఈ రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. మోకాటి లోతు గోతులు పడడంతో వాటిలో నీరు నిలిచి వాగులను తలపిస్తున్నాయి. ప్రతి రోజు ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారు. నిత్యం వందలాది గ్రానైట్ లారీలు రవాణా చేసే ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు మెత్తం మట్టి రోడ్డుగా మారిందని, గోతుల నిండుగా వర్షపు నీరు ఉందని దీంతో రాకపోకలు సాగించాలంటే నరకమేనని వాహనచోదకులు వాపోతున్నారు. బల్లికురవ. సంతమాగులూరు మండలాలకు చెందిన ప్రయాణికులు నిత్యం ఈ రోడ్డు మీదుగానే రాకపోకాలు సాగిస్తుంటారు. గోతులు పెద్దవిగా ఉన్న ప్రాంతంలో కొందరు ట్రాక్టర్లపై వ్యర్థ రాళ్లను తెచ్చి పడవేసి పోతున్నారని ఈ రాళ్లతో రాత్రుళ్లు ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాహన చోదకులు అంటున్నారు. వర్షాలు కురిస్తే ఈ రోడ్డు అంటే వణుకు పుడుతుందని వారు తెలిపారు. నాలుగు కిలోమీటర్ల ప్రయాణం గంట పడుతుందని ఎంతో జాగ్రత్తగా వాహనాలను నడపకుంటే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. అధికారులు వెంటనే ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, సెప్టెంబరు 17 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి మండపం నిర్మాణానికి పంగులూరు మండలం చందలూరుకు చెందిన అజిత్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు లక్ష రూపాయల చెక్కును మంగళవారం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్రకు అందజేశారు.


పి.గుడిపాడులో తాళాన్ని అందిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

నిరుపేదలకు ప్రధాని ఆవాస్ గృహాలు


కొమ్మినేనివారిపాలెంలో ఇంటి పత్రాలను అందజేస్తున్న యువనేత కమల్‌కిషోర్

బల్లికురవ, సెప్టెంబరు 17 : అర్హులైన నిరుపేదలందరికీ ఎలాంటి చెల్లింపులు లేకుండా ప్రధాన మంత్రి అవాస్ యోజన ద్వారా ఉచితంగా గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని అద్దంకి నియోజకవర్గ టీడీపీ పార్టీ యువనేత గొట్టిపాటి కమల్ కిషోర్ (బాబీ) పేర్కొన్నారు. మంగళవారం మోదీ పుట్టినరోజు సందర్భంగా ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ్ పథకంలో భాగంగా గృహ ప్రవేశ మహోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా మండలంలోని నక్కబొక్కలపాడు, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో నిరుపేదలైన జంధ్రాజుపల్లి యేబు, కీర్తిపాటి ఏడుకొండలకు మంజురైన ఇల్లు పూర్తికాగా గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత కమల్‌కిషోర్ గృహాలను ప్రా రంభించి అనంతరం పేదలకు ఇంటి పత్రాలను సీట్లను అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అర్హత ఉండి ఇల్లు లేని వారు ఉంటే వెంటనే ఏఈని సంప్రదించాలని, వారికి ప్రభు త్వం ద్వారా గృహాలను మంజురు చేయిస్తామన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో బాబీ మొక్కలను నా టారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, ఎం పీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో రాంబాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ దర్గా రమేష్, సర్పంచ్ దూళిపాళ్ల బుల్లిరామయ్య, టీడీపీ నేతలు హనుమంతురావు, వేణుబాబు, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ బ్రహ్మయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని పి.గుడిపాడులో నిర్మించిన ఇంటిని ఎంపీడీవో, తహసీల్దార్ మెహతాజ్ ప్రారంభించారు. మండలంలో 215 ఇళ్లు మంజూరు కాగా, 41 ఇళ్లపూర్తి అయినట్లు సురేష్‌బాబు తెలిపారు. పి.గుడిపాడులో 30 ఇళ్లు మంజూరు కాగా 8 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. ఇంటి తాళాలు అందజేసే కార్యక్రమానికి మండలంలోని అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఏపీవో కోటేశ్వరి, హౌసింగ్ ఏఈ నటరాజ్, ఏపీఎం అనూరాధ, టీడీపీ నాయకులు జాగర్లమూడి జయకృష్ణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, కోట్టె రవీంద్ర, మందా నాగేశ్వరావు, మందా ఆమోస్ పాల్గొన్నారు.

అద్దంకి : పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ అన్నారు. మండలంలోని శింగరకొండపాలెంలో పీఎంఏవై గ్రామీణ స్కీమ్ కింద నిర్మించిన గృహాల గృహ ప్రవేశ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో దేవసేనకుమారి, హౌసింగ్ ఏఈ కిరణ్, ఆర్ఐ శంకర్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి, టీడీపీ నేతలు కరి పరమేష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ పుట్టినరోజు వేడుకలు

చినగంజాం : మండలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలు బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చుండిబజారులోని వాల్మీకి సేవా సంఘంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఉలిచి ఏసుబాబు మాట్లాడుతూ మోదీ సేవలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు మోటుమర్రి వెంకటేశ్వరావు, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, నూనె సత్యనారాయణ, నరాలశెట్టి చిన సుబ్బారావు, భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవిందస్వామి, వాల్మీకి సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : ఇందిర కాలనీలో ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం తాళాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, గ్రామపార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, నాయకులు కొల్లా శివరాం ప్రసాద్, రాష్ట్ర నాయకుడు కోడూరి శేషబ్రహ్మాచారి, చెరుకూరి శ్రీధర్(చింపయ్య), షేక్ హుస్సేన్, బంగారుబాబు, కిషోర్, ఖాజావలి, గౌస్, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ కుమార్, కార్యదర్శి సుధీర్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహప్రవేశాలు మంగళవారం నిర్వహించారు. మండలంలో 1024 మంజూరు కాగా, 167 ఇళ్లు నిర్మించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ ప్రమీల, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, నాయకులు కరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు శాంతి పాల్గొన్నారు.

అద్దంకి : ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అద్దంకిలో బీజేపీ శ్రేణులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమాలలో బీజేపి జిల్లా ఇన్‌చార్జి పులి వెంకటకృష్ణారెడ్డి, మండవ రామకృష్ణ, పర్చూరు శ్రీనివాసరావు, యలమందరావు, శ్రీరామ్, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, కాలేషాబాబు విరాట్, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

ఇంకొల్లు, సెప్టెంబరు 17 : మండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, చిలకలూరిపేట వారు అందిస్తున్న సేవలు అభినందనీయని పలువురు అన్నారు. ఈ రెండు క్లబ్‌లు సంయుక్తంగా పాఠశాలకు సుమారు రూ.150000 విలువైన 45 బల్లలను బహూకరించారు. అందులో పాఠశాల కరెస్పాండెంట్ గోరంట్ల పున్నయ్య 25శాతం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మార్టూరు క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ సాంబశివరావు, సీనియర్ రొటేరియన్ మోహనరావు, ఆంజనేయులు, అంకమ్మచౌదరి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, సెప్టెంబరు 17 : మండలంలోని కడవకుదురు గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు ఉచిత వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని శివాలయం సెంటర్‌లోని కీర్తి మెడికల్స్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జికూటమ్ షేక్ రఫీ తెలిపారు. వైద్య శిబిరంలో పలు రకాల వ్యాధులకు సంబంధించిన 200 మందికి డాక్టర్ రామాంజనేయులు వైద్య పరీక్షలు చేశారు. కంటి సంబంధిత పరీక్షలను ఆప్తమాలజిస్ట్ సునీల్ నిర్వహించారు. ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. పరీక్షల అనంతరం 55 మందిని ఒంగోలు హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు రఫీ తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యులు పూర్ణచంద్రరావు, కీర్తి మెడికల్స్ నిర్వాహకులు మద్దసాని రాఘవరావు, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్ వద్ద ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 17 : మండలంలోని పందిళ్లపల్లి పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి మంగళవారం పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గడ్డివాము దగ్ధం

చీరాలటౌన్, సెప్టెంబర్ 17 : చీరాల పరిధిలోని హరిప్రసాద్‌నగర్‌కు చెందిన కొత్తగొర్ల శ్రీనివాసరావుకు సంబంధించిన 10 ఎకరాల గడ్డివాము మంటల్లో ఆహుతి అయింది. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. అయితే ఎవరైనా నిర్లక్ష్యంగా సిగరెట్ వంటివి విసిరిన కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.1.80 లక్షలు నష్టం జరిగిందని యజమాని తెలిపాడు.


మాత్రలను మింగిస్తున్న వైద్యాధికారి

ఆల్బెండ్‌జోల్‌తో నులిపురుగుల నివారణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17 : నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఎంపీహెచ్ఈవో నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మోదేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తిమ్మాయపాలెం మండల పరిషత్ పాథమిక పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ఆల్బెండ్‌జోల్ మాత్రలను మింగించారు. ప్రతి 6 నెలలకోసారి ఈ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 4750 మందికి గాను 4612 మందికి మాత్రలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం పురుషోత్తమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు అబ్దుల్ సత్తార్, ఏఎన్ఎంలు భారతి, సుదీక్షణకుమారి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాత్రలు పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. రామ్‌మోహనరావు తెలిపారు.

చినగంజాం : నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మండల పరిధిలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎంపీడీవో కే.స్వరూపరాణి, సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. విద్యార్థులలో రక్తహీనత లేకుండా ఉండేందుకు ఈ మాత్రలు ఉపయోగపడతాయని తెలిపారు. 271 మంది విద్యార్థినులతో మాత్రలు మింగించినట్లు ఎంఈవో-1 బి.అజయ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్‌వీజీ.కృష్ణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ నక్కల వేణు, చినగంజాం గ్రామ సచివాలయ-2 కార్యదర్శి సుబ్బారావు, ఏఎన్ఎం ఎం.స్టాన్లీదేవి, చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది, కేజీబీవీ, సంతరావూరు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంగులూరు : నులిపురుగులు నివారించి రక్తహీనత నుంచి పిల్లలను కాపాడేందుకు ఆల్బెండ్‌జోల్ మాత్రలను వేసుకోవాలని వైద్య పర్యవేక్షకులు హరిబాబు, అనూరాధ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ చిన్నారులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని చేపట్టారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల వారికి ఆరు నెలలకో ఆల్బెండ్‌జోల్ మాత్రలు మింగించడం ద్వారా నులిపురుగులు నివారించవచ్చన్నారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో 4,316 మంది బాల బాలికలకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్ఎం జానకి, రామాంజమ్మ పలు గ్రామాల ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకు సాగాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 17 : విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో పుల్లగూర జయరావు, సలగల ఇజ్రాయేలు మెమోరియల్ స్ఫూర్తి పురస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల జరిగిన ఐపీఈ పరీక్షల్లో ఉన్నతంగా రాణించిన నలుగురు పేద విద్యార్థులకు అందరికి కలిపి రూ.10 వేల సాయాన్ని అందించారు. దాతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగరరావు, విశ్రాంతి ఉద్యోగి పుల్లగూర జయశీలరావు, కళాశాల ప్రతినిధులు పుష్పరాజ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17 : అద్దంకిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో మంగళవారం పెరియార్ రామస్వామి నాయకర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ళూరి బాబూరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, వివిధ పార్టీల నాయకులు పులిపాటి హేబేలు, మందా జోసప్, వెంకటేష్, అంకయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అద్దంకి, సెప్టెంబరు 17 : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఆర్టీసీ అద్దంకి డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రజా రవాణా విభాగం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేడ్కర్ బొమ్మ వరకు తిమ్మాయపాలెం హైస్కూల్ విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ డీఎం మహబూబీ, కొండలు, యోగా శిక్షకులు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో పరిశుభ్రం చేయించారు.

కేఆర్‌కేలో ఓజోన్ దినోత్సవం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17 : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఓజోన్ దినోత్సవ ప్రాముఖ్యతను, విద్యాలయాల, పర్యావరణ సమతుల్యతను వ్యక్తిగత కృషిని అధ్యాపకులు ఎస్‌కే మస్తాన్‌వలి, వి.రామకృష్ణ, అశోక్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- పూజ్యనీయుడు
- ఎమ్మెల్యే కొండయ్య


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 17 : విరాట్ విశ్వకర్మ అనునిత్యం పూజ్యనీయుడని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పాపరాజుతోట బాపనమ్మ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విశ్వకర్మను నాగరికతకు మూలపురుషునిగా అభివర్ణించారు. నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి విశ్వకర్మ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. విశ్వబ్రాహ్మనులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అం డగా ఉంటామన్నారు. కార్యక్రమంలో విశ్వక ర్మ కమిటీ సభ్యులు, సంఘీయులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరాలలోని ది పేరాల పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీహాలులో మంగళవారం విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ విగ్రహానికి పూలమాలలువేసి నమస్కరించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. అప్పుడే మన హక్కులను మనం సాధించుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ, జిల్లా అధ్యక్షుడు కడలి జగదీష్‌కుమార్, వి.శివనాగేశ్వరరావు, పి.శివాంజనేయప్రసాద్, పిచ్చియాచార్యులు, వీరభద్రుడు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అద్దంకిలోని కమఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమంలో 21 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, టీడీపీ నాయకులు కాకాని అశోక్, పూర్ణచంద్రరావు, రామారావు, త్రిమూర్తులు, ప్రకాశం జిల్లా కార్పెంటర్ అధ్యక్షుడు రామకృష్ణ, బాపట్ల జిల్లా సెక్రటరీ నరసింహచారి, రత్నాచారి, మల్లికార్జున్, ఆంజనేయులు, నాగేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి


చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చినగంజాం, సెప్టెంబరు 17 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో కే.స్వరూపరాణి, టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని ఎంపీడీవో సూచించారు. కడవకుదురులో పీఎంఏవైజీ గృహాలు, పీఎంఏవై అర్బన్ గృహాల గృహప్రవేశ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కడవకుదురు గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి, ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ జి.రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు ఎన్.సూర్యనారాయణ, కృపారావు, మండల ఎంఆర్‌సీ సున్నం అశోక్‌కుమార్, తెలుగు యువత నాయకులు దేవతోటి నాగరాజు, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బల్లికురవ : సమాజంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు కోరారు. మంగళవారం బల్లికురవలో స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న వ్యర్థాలను అధికారులు తొలగించారు. అనంతరం పిచ్చి మొక్కలను పీకేశారు. ఈసందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులు దరి చేరవని తెలిపారు. ఈ ర్యాలీలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సుమతి, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్‌వై కోటేశ్వరరావు (బుజ్జి) పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : స్వచ్ఛత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మంగళవారం మేదరమెట్లలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబరు 2 వరకూ కార్యక్రమాలు కొనసాగించాలని ఆదేశించారు. మేదరమెట్లలోని రోడ్డు వెంట చెట్లు తొలగించడం, బ్లిచింగ్ వంటి పనులను చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఉప స ర్పంచ్ మన్నె దుర్గారావు, పంచాయతీ కార్యాదర్శి లక్ష్మీకాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే


పాత బస్టాండ్ సెంటర్‌లో ఇలా

అద్దంకి, సెప్టెంబరు 17 : అద్దంకి పట్టణంలో పలు ప్రాంతాలలో చెత్త, వ్యర్థాలు తొలగించడంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంతో కంపుకొడుతోందని స్థానికులు వాపోతున్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లో మెడికల్ షాపుల పక్కన ఉన్న రోడ్డు లో గత 5 నెలలుగా మురుగు కాలువల్లో పూడిక తీయలేదు. కనీసం కాలువలలో ఉన్న చెత్తా చెదారాన్ని కూడా తొలగించకపోవడంతో మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు అంటున్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పేరుకున్న చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నష్టాన్ని మిగిల్చిన వాయుగుండం

- నీట మునిగిన మినుము
- ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రభుత్వం ఆమోదం


నారు మడులకు నీళ్లు పెడుతున్న రైతు


నష్టపోయిన మినుముపైరును పరిశీలిస్తున్న అధికారులు

చీరాలటౌన్, సెప్టెంబరు 17 : వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చింది. చీరాల మండల పరిధిలో ఈ నెల మొదటి వారం, నెలాఖరులో కురిసిన కుండపోత వర్షాలకు రైతులు బెంబేలెత్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి 300 ఎకరాలు, వేరుశనగ 308 ఎకరాలు, మినుము 74 ఎకరాలలో సాగు అవుతోంది. సాధారణ విస్తీర్ణం 1664 నమోదై ఉండగా ప్రస్తుతం 682 ఎకరాల్లో మాత్రమే సాగులో ఉంది. వరద ప్రభావంతో ఆగస్టు 30వ తేదీన 18.4 మి.మీ. 31వ తేదీన 73.1మి.మీలో వర్షపాతం నమోదయింది. అంతేకాకుండా సెప్టెంబరు 1న 81.4 మి.మీ. కుండపోత వర్షం కురుసింది. దీంతో ఈక్రమంలో బుర్లవారి పాలెం, వాడరేవు ప్రాంతాల్లో సాగులో ఉన్న 74 ఎకరాల మినుములో సుమారు 66.42 ఎకరాల పంట నష్టం జరిగింది. దీంతో 45 మంది రైతులు బోరున విలపించారు. ఆ సమయంలో వరి సాగుకు ఎద పెట్టిన వారి పరిస్థితి కూడా ప్రతికూలత సంతరించుకుంది. గడిచిన రెండు మాసాల్లో సుమారు 326 మి.మీ. సాధారణ స్థితి ఉండాల్సి ఉండగా సమపాళ్లు లేకుండా 241 మి.మీ మాత్రమే నమోదయి. నిరాశ మిగిల్చింది.

అధికారుల పరిశీలన

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో వ్యవసాయాధికారులు విస్తృతంగానే పర్యటించి నష్టాలపై అంచనా వేశారు. ఈక్రమంలోనే రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.2.66.386 పరిహారానికి నివేదిక పంపగా అధికారుల నుంచి సానుకూల స్పందనే లభించింది. వాయుగుండ ప్రభావం వారంముందు సంభవించినట్లయితే వేరుశనగకు తీవ్ర నష్టం వాటిల్లేదని అధికారులు చెప్తున్నారు. ఎట్టకేలకు తిరిగి నారు మడులు, నాట్లతో మండలంలో పచ్చని పొలాలతో కళకళలాడుతున్నాయి. ఈ సారైనా రైతు ఆనందంతో సాగును పూర్తి చేయాలని ఆశిద్దాం.

రైతులకు ఈ-పంటతో మేలు



వరద ప్రభావంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికను ఇప్పటికే అధికారులకు పంపాం. ఎకరాకు రూ.4 వేలు ఇన్‌పుట్ సబ్సిడీకు అవకాశం ఉంది. అలాగే రైతులు వారు సాగు చేసే పంటలను కచ్చితంగా ఈ పంట యాప్‌లో నమోదు చేసుకోవాలి. తద్వారా క్రయ విక్రయాలు, ఇన్స్‌రెన్స్, ప్రొక్యూర్‌మెంట్ వంటివి కలిసొస్తాయి. ఆగష్టు 5 నుండి సెప్టెంబర్ 23 వరకు మాత్రమే నమోదుకు అవకాశం ఉంది. నమోదు లేకపోతే అన్ని విధాలుగా రైతులకు భరోసా కోల్పోతారు.

- సుమతి, మండల వ్యవసాయాధికారి

20న 'సండే మార్కెట్' వార్షికోత్సవం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 17 : నగరంలో సండే మార్కెట్ ఏర్పడి ఈ నెల 20వ తేదీకి 40 ఏళ్లు పూర్తవు తుందని, ఈ సందర్భంగా టౌనుహాలులో వార్షికోత్సవ సదస్సు నిర్వహిస్తున్నట్లు సండే మార్కెట్ వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు కిశోర్‌బాబు తెలిపారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు జిల్లా మాజీ కలెక్టర్ రాజు, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఝాన్సీ హాజరవుతారని చెప్పారు. సభకు ముందు రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షుడు హఫీ జుద్దీన్, కార్యదర్శి సెంథిల్ కుమార్, కోశాధికారి ముత్తు మారి తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు!

రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు



వామ్మో.. సురీడు భగ్గుమంటున్నాడు. రెండో వేసవిని తలపించేలా మండిపోతున్నాడు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపం చూపుతుండటంతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎండవేడిమి నెల్లూరు, కావలిలో ఉంటోంది. ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి తీవ్రత వల్ల చెమట రూపంలో రెండున్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీనివల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళల్లో రోగ నిరోధక శక్తి కూడా తక్కువగా ఉండటంతో చర్మవ్యాధులతోపాటు తలనొప్పి, ఆకలి మందగించడం, మూత్రసంబంధిత వ్యాధులు, మతిభ్రమణం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో మహిళలు జాగ్రత్తగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- నెల్లూరు (వైద్యం)

వారం రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రత

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
11	37.0	27.1
12	38.1	28.5
13	37.8	26.8
14	37.5	29.0
15	36.1	27.4
16	38.2	26.4
17	37.0	20.1

ఇంకా వడివడిగానే..

వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై భిన్నాభిప్రాయాలు

'సంక్షేమ'ం సరే.. పాలనలోనే కనిపించని బాబు మార్కు

నాటి వైసీపీ పరిస్థితులే నేడూ అంటూ ప్రజల నిట్టూర్పు

కూటమి శ్రేణుల్లోనూ నిరాశ, నిస్పృహ

కొత్తవారిని అక్కున చేర్చుకుని, పాతవారిని వదిలేశారన్న ఆవేదన


ప్రజామోదంతో అఖండ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పట్ల ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి విషయాల్లో కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు తన ముద్ర వేస్తుండగా.. స్థానిక పాలన విషయంలో మాత్రం అటు ప్రజల్లోనూ, ఇటు అధికార తెలుగుదేశం పార్టీలోనూ పెదవి విరుపులే వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న పాలన వైసీపీ పాలనకు కొనసాగింపుగా కనిపిస్తోంది తప్ప చంద్రబాబు మార్కు పాలన ఇంకా ఆరంభం కాలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నెల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతుల జీవనాడి అయిన సోమశిల డ్యాంను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రమాదస్థితికి చేరుకుంది. అప్రాన్ కొట్టుకుపోయినా పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మరో మంత్రి పొంగూరు నారాయణ చొరవ తీసుకొని సోమశిల ప్రమాద స్థితిని సీఎంకు వివరించారు. ప్రాజెక్టుల విలువ తెలిసిన చంద్రబాబు ప్రభుత్వం తొలి 60 రోజుల్లోనే శ్రీకారం చుట్టింది. రూ.99 కోట్ల వ్యయంతో అప్రాన్ పనులు మొదలు పెట్టడం ద్వారా పెను ముప్పు నుంచి ప్రాజెక్టుకు విముక్తి లభించింది.




కానీ.....!!

చంద్రబాబు అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఇంకా ఆయన మార్కు పాలన ఆరంభం కాలేదనే బాధ కన్నా వైసీపీ పాలనకు కొనసాగింపుగానే కనిపిస్తోంది తప్ప పెద్దగా మార్పు లేదనే పరిస్థితులే ప్రజలను, టీడీపీ శ్రేణులను ఎక్కువగా బాధిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ప్రకృతి వనరులను దోచుకున్నారు. ఇప్పటి కూటమి నాయకుల్లో కొంతమంది వైసీపీ నాయకుల కన్నా మేమేం తక్కువ అన్నట్లు సహజ వనరుల దోపిడీకి తెరతీశారు. గత ప్రభుత్వంలో పోలీసు స్టేషన్లలో వారి పెత్తనమే జరిగింది. స్టేషన్లలో కూర్చుని వైసీపీ నాయకులు పంచాయితీలు చేశారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. విశేషం ఏమంటే గత వైసీపీ ప్రభుత్వంలో ఏ రౌడీ షీటర్లు అయితే పంచాయితీలు చేశారో, వారిలో చాలా మంది ఇప్పుడు కూటమి జెండాలు కప్పుకొని దందాలు చేస్తున్నారని అపవాదు నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తి ప్రతిపక్షాలను, ప్రజలను పీల్చుకుతిన్న పలువురు పోలీసు అధికారులు ఇప్పుడు కూటమి నాయకుల పంచన చేరి వారి మద్దతుతో జిల్లా సరిహద్దులు దాటకుండా ఇక్కడే తిష్ట వేసి కూర్చున్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలకు ఇది వైసీపీ పాలనకు కొనసాగింపుగానే కనిపిస్తోంది తప్ప చంద్రబాబు పాలనగా అనిపించలేదు.



ప్రజల అభిప్రాయాలు ఇలా ఉంటే టీడీపీ కార్యకర్తల గోడు మరోలా ఉంది. స్థానిక సంస్థల్లో బలం పెంచుకునే క్రమంలో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను, నాయకులను టీడీపీలోకి తీసుకొంటున్నారు. ఇది టీడీపీ కార్యకర్తల్లో తీరని వేదన రగిలిస్తోంది. ఐదేళ్ల కాలం ఎవరి అరాచకాల కారణంగా వేధింపులకు గురయ్యారో, వారినే ఇప్పుడు తీసుకొచ్చి అందలం ఎక్కించుకోవడాన్ని ఆ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. చంద్రబాబును నేరుగా కలిసే అవకాశం లేక, స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎదురుతిరిగే ధైర్యం లేక సామాజిక మాధ్యమాల్లో స్వపక్షంలోనే ప్రతిపక్షంలా నిరసన గళం వినిపిస్తున్నారు. ఇప్పటివరకు పాలనా పరంగా పెద్దగా మార్పు కనిపించకపోయినా త్వరలో ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుందని, విపత్తులు, ఉప్పెనల నుంచి రాష్ట్రం కోలుకున్న వెంటనే పాలనపై దృష్టి సారిస్తారని, త్వరలోనే జిల్లాలో చంద్రబాబు మార్కు పరిపాలన ఆవిష్కృతం అవుతుందని ప్రజలు, పార్టీ కార్యకర్తలు విశ్వసిస్తున్నారు.





● ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా పింఛన్ల పెంపుతో అవ్వాతాతలను కూటమి ప్రభుత్వం ఆదుకుంది. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పట్టణ పేదల కడుపులు నింపే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మిగిలిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే దిశగా చంద్రబాబు ప్రభుత్వం పయనిస్తోందన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడింది.

● ఇంకా మొదలవ్వని చంద్రన్న పాలన అధికారంలోకి వచ్చిన వంద రోజుల కాలంలోనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతున్నా పాలన పరంగానే పెదవి విరుస్తున్నారు. ఇంకా చంద్రన్న పాలన ఆరంభం కాలేదనే భావిస్తున్నారు. నిష్పాక్షిక పాలనే చంద్రబాబుకు ఉన్న ప్రత్యేకత. అదే ఆయన ఆకర్షణ. ఆయన పాలనా దక్షతపై ఉన్న నమ్మకంతోనే రాష్ట్రం విడిపోయిన ప్రత్యేక పరిస్థితుల్లో 2014-19లో చంద్రబాబే కావాలని ప్రజలు గెలిపించు కున్నారు. వైసీపీ అరాచక పాలన పట్ల విసిగిపోయి, అన్ని వర్గాల్లో అభద్రతా భావం కలిగిన క్రమంలోనే చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకొంటూ ఎన్డీఏ కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించారు.

మర్యాద.. మర్యాద...!



నెల్లూరులోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ పోడియం ఎత్తు తొలగించి, సబ్ రిజిస్ట్రార్ కుర్చీ, ఆయన ఎదురుగా ప్రజలు కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

నెల్లూరు (హరనాథపురం : రాష్ట్ర ఖజానాకు ఆయువు పట్టు లాంటి రిజిస్ట్రేషన్ శాఖకు అన్ని రకాల పన్నులు కడుతున్న ప్రజలకు గౌరవ మర్యాదలు ప్రారంభమయ్యాయి. మొన్నటివరకు ఎర్ర తివాచీ నడుమ అరడుగు ఎత్తులో కూర్చొన్న సబ్ రిజిస్ట్రార్ ఇప్పుడు సాధారణ అధికారిలా కుర్చీలో కూర్చొని రిజిస్ట్రేషన్ లావాదేవీలు నడిపారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్నేహపూర్వక సేవలు ప్రారంభమయ్యాయి. కార్యాలయాల్లో రాచరిక పోకడలను తలపిస్తున్న ఎర్రతివాచీ పోడియంలను సమూలంగా తొలగించారు. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ ఎత్తునూ తగ్గించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలకు ప్రత్యేకంగా సబ్ రిజిస్ట్రార్ ఎదురుగానే కుర్చీలు ఏర్పాటు చేశారు. అంతేకాదండోయ్.. ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి అక్కడా కుర్చీలను ఏర్పాటు చేశారు. దస్తావేజుల కంప్యూటర్ స్కానింగ్ రూములో ఇబ్బందులు తొలగించడంతోపాటు మంచి నీటి వసతి కల్పించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమూల మార్పులు తెచ్చామని రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ డెలివరీ ఉచితం

నెల్లూరు(హరనాథపురం) : వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీల విషయంలో ప్రభుత్వం సామాన్యులకు తీపి కబురు వినిపించింది. గ్యాస్ ఏజెన్సీ నుంచి 15 కి.మీ.లోపు ఉన్న నివాసాలకు ఏలాంటి డెలివరీ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. 15 కి.మీ. దాటితే రూ.30 డెలివరీ చార్జీగా వసూలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ అధిక మొత్తంలో డెలీవరీ చార్జీలు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏజెన్సీ నుంచి నిర్దేశిత దూరంలోపు ఉన్న ఇళ్లకు ఉచితంగా సిలిండర్ డెలివరీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అది అమలుకావడం లేదు. డెలివరీ సిబ్బంది ఇష్టప్రకారం రూ.30 నుంచి రూ.80 వరకు నుంచి వసూలు చేస్తున్నారు. ఎవరైనా వినియోగదారులు డెలివరీ చార్జీలు ఇవ్వకుంటే బాయ్స్ ఒప్పుకోవడం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజా ఉత్తర్వులిచ్చింది.

అదనంగా అడిగితే చర్యలు తప్పవు

గ్యాస్ సిలిండర్ డెలివరీకి అదనపు మొత్తాన్ని వసూలు చేస్తే గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకుంటాం. గ్యాస్ ఏజెన్సీ పరిధిలోని 15 కి.మీ.లోపు ప్రాంతాల్లో సిలిండర్ డెలివరీ ఉచితం. అంతకన్నా ఎక్కువ దూరానికి రూ.30 చెల్లించాలి.

- డీవీ రమణ, డీఎస్వో

పక్షం రోజులు 'స్వచ్ఛత హి సేవ'

● పరిశుభ్రతలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరం : జేసీ



పరిశుభ్రతను పాటిస్తామని ప్రమాణం చేయిస్తున్న అధికారులు

నెల్లూరు(సిటీ) : మన ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరి భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ దేశవ్యాప్తంగా ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం నెల్లూరులోని వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు విద్యార్థులతో కలిసి స్వచ్ఛత హి సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజతో కలిసి జేసీ మాట్లాడారు. 15 రోజులు జరిగే స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు పెంచలయ్య, సుస్మిత, కన్నమనాయుడు, సాంబశివారెడ్డి, చెన్నుడు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక అక్రమాల బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నాడు అధికారమే అండగా అక్రమార్కులు చెలరేగారు. పెన్నమ్మను కుళ్లబొడిచి రూ.వేల కోట్ల విలువైన ఖనిజాన్ని దోచుకుతిన్నారు. అప్పటి ప్రభుత్వ పెద్దలే ఇందుకు సహకారం అందించడంతో అధికార వ్యవస్థ కూడా ఈ ఇసుక తవ్వకాల వైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహసించలేదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారి ఎన్డీయే ప్రభుత్వం రావడంతో నాటి అక్రమాల పుట్ట బద్దలవుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఇసుక తవ్వకాలపై అటు మైనింగ్, ఇటు ఏసీబీ అధికారులు విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ నివేదికలోని అంశాలను పరిశీలిస్తే కళ్లు చెదురుతున్నాయి. దాదాపు రూ.332 కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తవ్వి తరలించినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే ఏ స్థాయిలో ఇసుకను కొల్లగొట్టారో స్పష్టమవుతోంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

దోచిన ఇసుక విలువ రూ.332 కోట్లు

● పెన్నమ్మను కుళ్లబొడిచిన ఇసుకాసురులు

● 14 ప్రాంతాల్లో మైనింగ్, ఏసీబీ అధికారుల విచారణ

● 16.62 లక్షల మెట్రిక్ టన్నుల ప్రకృతి సంపదను కొల్లగొట్టారు

● వైసీపీ ప్రభుత్వంలో దర్జాగా సాగిన దోపిడీ

● అక్రమార్కులకు జరిమానా విధింపు

● కేసుల నమోదుకు సన్నద్ధం


పెన్నమ్మ ఒడ్డున నెల్లూరు జిల్లా ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో జిల్లా వాసులకు మాత్రం ఇసుక బంగారంగా మారింది. అంతకముందు ప్రభుత్వంలో ఉచితంగా దొరికే ఇసుకను వైసీపీ ప్రభుత్వం విక్రయించడం ప్రారంభించింది. నాడు ట్రాక్టర్ ఇసుక రూ.1500 వస్తే వైసీపీ ప్రభుత్వంలో రూ.5 వేలకు పెరిగింది. దానిని తెచ్చుకోవాలన్నా నానా తంటాలు పడాల్సి వచ్చేది. కానీ జిల్లా నుంచి మాత్రం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు యథేచ్ఛగా ఇసుక తరలివెళ్లింది. నిత్యం వందల లారీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాయి. అయితే నాడు ఒక్కరంటే ఒక్క అధికారి కూడా ఈ లారీలను పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం ఇసుక రీచ్‌లో తవ్వకాలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించే సాహసం కూడా చేయలేదు. ఎవరైనా ఆ రీచ్‌ల వైపు వెళితే బదిలీ తప్పదు అన్నట్టుగా ఉండేది పరిస్థితి. కానీ ప్రభుత్వం మారడంతో ఇసుక అక్రమాల డొంక కదిలింది. జిల్లాలో అనుమతులిచ్చిన రీచ్‌లతోపాటు అనధికారిక ప్రాంతాల్లో కూడా అక్రమంగా తవ్వకాలు జరిగినట్లు గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. పెన్నా నదిలో మొత్తం 14 ప్రాంతాల్లో విచారణ జరపాలని ఉత్తర్వులిచ్చింది. దీంతో మైనింగ్ అధికారులు దాదాపు నెల రోజుల పాటు ఈ రీచ్‌లలో గుంతలను కొలతలు తీసి అక్రమాలు నిగ్గు తేల్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు కూడా విచారణ మొదలుపెట్టారు. ఇలా ఈ రెండు విభాగాలు వేర్వేరుగా విచారణలు జరిపి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాయి. మొత్తం 14 ప్రాంతాల్లో 8.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తే ఏకంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వినట్లు నిర్ధారించారు. అందుకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.332.56 కోట్లు పెనాల్టీలు విధించారు.



డీసిల్టేషన్ పేరుతో సంగం బ్యారేజీకి ఎగువభాగంలో పెన్నానదిలో ఇసుక తరలించగా ఏర్పడిన భారీ గుంతలు (ఫైల్)

● ఈ ప్రాంతాల్లో కొల్లగొట్టారు

విరువూరు, ముదివర్తి, పల్లిపాడు, మినగల్లు ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మినగల్లులో 2.3 లక్షల మెట్రిక్ టన్నులు, విరువూరులో 1.85 లక్షలు, పల్లిపాడులో 2.35 లక్షలు, ముదివర్తిలో 2.78 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను కొల్లగొట్టారు. ఇక వేగూరు, కోడూరుపాడు, లేగుంటపాడు, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో రీచ్‌లు లేకపోయినా అక్రమార్కులు ఇక్కడ తవ్వకాలు జరిపారు. గత ప్రభుత్వంలో తొలుత జేపీ, ఆ తర్వాత ప్రతిమ సంస్థలు తవ్వకాలు జరిపాయి. ఈ రెండు సంస్థలు అధికారికంగా తవ్వకాలు జరిపిన రీచ్‌లలోనూ అక్రమాలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. కాగా ఇంత భారీస్థాయిలో అక్రమాలు జరిగాయని నిర్ధారణ జరగడంతో బాధ్యులపై కేసులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏ రీచ్‌లో ఎవరెవరు తవ్వకాలు జరిపారు? ఇతర రాష్ట్రాల్లో ఎక్కడికి తరలించారు? అన్న వివరాలను ఏసీబీ అధికారులు సేకరించారు. ఈ వివరాల ఆధారంగా అక్రమార్కులపై కేసులు పెట్టడంతోపాటు ప్రజాధనం రికవరీకి కూడా ఆలోచన చేస్తున్నారు.



● మొదటి మూడేళ్లు ఇంకెంతో..!

ఇప్పుడు జరిగిన విచారణ అంతా 2022, 2023లో జరిగిన తవ్వకాలకు సంబంధించినదే. 2021 వరకు జరిగిన తవ్వకాలన్నీ అప్పుడు వచ్చిన భారీ వరదతో కనుమరుగయ్యాయి. 2019, 2020, 2021 సంవత్సరాల్లోనూ విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిగాయి. తొలుత ఏపీఎండీసీ సంస్థ నేరుగా తవ్వకాలు జరపగా ఆ మాటున వైసీపీ నేతలు కొల్లగొట్టారు. అప్పుడు ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయన్నది నిర్ధారించడం అధికారు లకు కష్టంగా మారింది. అయితే అప్పుడు కూడా ఇదేస్థాయిలో అక్రమాలు జరిగి ఉంటాయని అంచనా వేస్తున్నారు. అందుకు సంబంధించి శాటిలైట్ ఇమేజస్ ద్వారా విచారించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఈ విచారణపై మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో విచారణ జరిపామని చెప్పారు. ఎక్కడెక్కడ ఏ స్థాయిలో పరిమితికి మించి తవ్వకాలు జరిపారన్నది గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు చెప్పారు.

రీచ్‌ల వారీగా ఇసుక అక్రమాల వివరాలు...

ప్రాంతం	అనుమతి (మెట్రిక్ టన్నులు)	తవ్వింది (మెట్రిక్ టన్నులు)	అక్రమ తవ్వకం	పెనాల్టీ (రూ.కోట్లు)
వేగూరు	-	1,86,187	1,86,187	37.23
కోడూరుపాడు	-	74,395	74,395	14.87
లేగుంటపాడు	-	1,13,816	1,13,816	22.76
ముదివర్తి-1	37,637	1,52,969	1,15,333	23.06
ముదివర్తి-2	72,000	3,50,376	2,78,376	55.67
ముదవర్తి-3	72,600	79,853	7253	1.45
ముదవర్తి-4	70,350	1,36,580	66,230	13.24
పీకేపాడు	73,755	1,25,500	51,745	10.34
పల్లిపాడు-1	72,150	3,07,154	2,35,004	47
పల్లిపాడు-2	74,100	1,32,938	58,838	11.76
వెంకటేశ్వరపురం	--	25,786	25,786	5.15
విరువూరు	73,350	2,58,350	1,85,000	37
గొల్లకందుకూరు	2,17,200	2,51,916	34,716	6.94
మినగల్లు	73,350	3,03,483	2,30,133	46.02
మొత్తం	8,36,492	24,99,303	16,62,812	332.56

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

డీఎస్పీ శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

కావలి, సెప్టెంబరు 17: కావలి డీఎస్పీగా శ్రీధర్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా ఉన్న ఎం. వెంకటరమణను బదిలీ చేయటంతో ఆయన స్థానంలో శ్రీధర్‌ను నియమించారు. 1990 బ్యాచ్‌కు చెందిన శ్రీధర్ గతంలో నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీసీఎస్‌లో పనిచేశారు. ప్రస్తుతం రాయచోటిలో పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు.

15వ ఆర్థిక సంఘం నిధులు
సర్పంచుల ఖాతాలకు జమ

లింగసముద్రం, సెప్టెంబరు 17: 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలానికి మంజూరైన 15వ ఆర్థిక సంఘం రెండోవిడత నిధులు 16 గ్రామ పంచాయతీల సర్పంచుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు ఈఓపీఆర్డీ రామసుబ్బారావు మంగళవారం తెలిపారు. టైడ్ నిధులు, రూ.48.23లక్షలు, అన్‌టైడ్ నిధులు రూ.32.19 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

కాలువకు మరమ్మతులు చేయండి

కొండాపురం, సెప్టెంబరు 17: మోపాడు రిజర్వాయరు కాలువకు మరమ్మతులు చేపట్టి దిగువ ఆయకట్టుకు నీరందేలా కృషి చేయాలని ఇరిగేషన్ ఈఈ నాగమురళి సాగునీటి సంఘ మాజీ అధ్యక్షుడు పో లినేని రమేష్ కోరారు. కాలువ పరిస్థితులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాలతో మంగళవారం ఒంగోలు కార్యాలయానికి వెళ్లి ఈఈ నాగమురళికి వినతిపత్రం అందజేశారు. కాలువ దిగువన ఉన్న బ్రిడ్జిలు, తూములతో పాటు పూడికను తీయించి నీరు సక్రమంగా చివరివరకు అందేటట్లు చూడాలని కోరారు. స్పందించిన ఆయన వీలైనంత త్వరలో కాలువ పరిరక్షణకు చర్యలు తీసకుంటామన్నారు. ఆయన వెంట దగడ మాలకొం డారెడ్డి, మన్నెం మాల కొండయ్య తదితరులు ఉన్నారు.

దాడిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

కావలి, సెప్టెంబరు 17: కొండాపురం మండలం నేకునాంపేటకు చెందిన నలగట్ల రుక్మిణమ్మపై పాత కక్షలతో గ్రామానికి చెందిన నలగట్ల పావని, కోటమ్మ, రొడ్డా శివశంకర్‌లు ఈ నెల 2వ తేదీన దాడిచేసి గాయపరిచినట్లు బాధితురాలు మంగళవారం కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దాడి విషయాన్ని కొండాపురం పోలీస్‌స్టేషన్, కావలి డీఎస్పీ, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరన్నారు.

పోలేరమ్మ చెట్టు హుండీ ధ్వంసం

అల్లూరు, సెప్టెంబరు 17: స్థానిక బీసీ కాలనీ సమీపంలో వెలసిన పోలేరమ్మ చెట్టు వద్ద ఏర్పాటు చేసిన హుండీని మంగళవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. హుండీని గడ్డపారతో పగులగొడుతుండగా సమీపంలోని గృహాల్లో నిద్రిస్తున్న వ్యక్తులకు భారీగా శబ్దం వినపడడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చారు. గ్రామస్థులను వీరు చూసి గడ్డపారను అక్కడే వదిలేసి పారిపోయారు. ఈ విషయంపై అల్లూరు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

20న జాబ్‌మేళా

ఆత్మకూరు, సెప్టెంబరు 17: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 20న ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయాల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ వినీల్ కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, సీడాప్ జేడీఎం హైమవతి, కలాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు కెఎల్ గ్రూప్, అమెజాన్, క్రెడిట్ అసిస్ గ్రామీన్ లిమిటెడ్, గ్రీన్‌టెక్, అమర్‌రాజా బ్యాటరీస్ తదితర కంపెనీలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4వరకు జాబ్‌మేళా జరుగుతుందని, యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

ఏఎస్‌పేట, సెప్టెంబరు 17: స్థానిక జడ్పీహైస్కూల్, కావలియడవల్లి హైస్కూల్‌లో బుధ, గురువారాల్లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలకు జట్లను ఎంపిక చేయనున్నట్లు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మల్లెవాసు తెలిపారు.అండర్ 14,17 బాలబాలికలకు అథ్లెటిక్స్, యోగా, చెస్ పోటీల జట్లను బుధవారం, కబడ్డీ,ఖోఖో వాలీబాల్,షటిల్, బ్యాడ్మింటన్ జట్లను గురువారం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

వీధిలైట్ల ఏర్పాటు

సీతారామపురం, సెప్టెంబరు 17: మండల పరిధిలోని పబ్బులేటిపల్లిలో సర్పంచి మద్దినేని ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వీధిలైట్లను ఏర్పాటు చేశారు. నీటి సమస్య తీర్చేందుకు బోర్లు వేయించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యదర్శి పిడుగు రవీంద్ర, ఇంజనీర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

హద్దురాళ్లు పగలకొట్టారని ఫిర్యాదు

సంగం, సెప్టెంబరు 17: తరుణవాయిలో గంటా పద్మమ్మకు చెందిన పొలం హద్దు రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు పగల కొట్టారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 17: తమకు న్యాయం చేయాలని కుర్రపల్లికి పలువురు లబ్ధిదారులు మంగళవారం తహసీల్దారు సుభద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వేనెంబర్ 94/2లో 13.64 ఎకరాలను మాదిగమాన్యం కింద కొన్నేళ్ల క్రితం మంజూరు చేసింది. అప్పట్లో గుడిపాటి యర్ర వెంకటయ్య పేరు పట్టా మంజూరు చేశారన్నారు. అయితే అప్పటి నుంచి లబ్ధిదారులంతా కలిసి ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఆయన చనిపోవడంతో కుటుంబీకులు భూమి తమదంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పూర్తిస్థాయి విచారణ చేసి ఆ భూమిలో హక్కుదారులైన తమ పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి న్యాయం జరిగేలా చేయాలని కోరారు.

త్వరలో నగర పంచాయతీలు
గ్రామ పంచాయతీలుగా మార్పు

● ఇస్కపల్లి-రాజుపాలెం రోడ్డుకు మోక్షం ● ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, సెప్టెంబరు 17: కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామాలన్నీ బాగుపడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆ దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, అలాగే నగర పంచాయతీలను గ్రామ పంచాయతీలుగా మార్పు చేయనున్నట్లు అతిత్వరలోనే ఈ కార్యక్రమం చేపట్టనుందని ఉందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌తో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు, ఎస్ఐల పరిచయ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతీ పంచాయతీలోని రోడ్లు, డ్రెయినేజీలకు రూ.5కోట్లు నిధులు మంజూరైనట్లు త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా తాగునీటి పథకానికి రూ.78లక్షలు నిధులు విడుదల అవుతాయన్నారు. ఈ నిధులతో ఇస్కపల్లి-రాజుపాలెం రోడ్డు నిర్మాణానికి అడుగులు పడతాయన్నారు. అలాగే తీరప్రాంత గ్రామాలు రామాయపట్నం, జువ్వలదిన్నె హార్బర్లను కలుపుతూ జాతీయ రహదారి నిర్మాణానికి ఇప్పటికే సర్వే చేపటామన్నారు. ఇదే జరిగితే తీరప్రాంత గ్రామాలు అభివృద్ధి అయ్యే అవకాశం ఉందన్నారు. కేంద్రంతో చర్చలు జరిపి నిధులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు అహర్నిశలు కృషి చేస్తూనే ఉన్నారన్నారు. అనంతరం పోలేరమ్మ ఆలయం గణపతి విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బండి అమర్‌రెడ్డి, నెల్లూరు నిరంజన్‌రెడ్డి, కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, రుద్రయ్య, ప్రభాకర్, కరుణాకర్, రాజేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

ఘనంగా మోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి

కందుకూరు, సెప్టెంబరు 17: బీజేపీ నియోజకవర్గ నేతలు మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోదీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని గ్రామ దేవత అంకమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కనిగిరి రోడ్డులోని టింబర్ డిపోల వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం, వైకుంఠం, చుండి మురళీధర్, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, మువ్వల భూషయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక ఎంపీఐ కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు మాట్లాడుతూ విశ్వకర్మను ప్రపంచంలో మొదటి ఇంజనీర్, ఆర్కిటెక్ట్‌గా పరిగణిస్తారన్నారు.

జలదంకి: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీనాథ్‌రెడ్డి జలదంకిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 26మంది యువకులు రక్తదానం చేయగా కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన యువకులకు మోదీ జ్ఞాపికలు అంద జేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు మధురెడ్డి, చిన్నా, తిరుపతి రెడ్డి, రాకేష్‌రెడ్డి, హనుమారెడ్డి పాల్గొన్నారు.



కావలి: ఏరియా వైద్యశాలలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో బీజేపీ నేతలు



ఆత్మకూరు: విశ్వకర్మకు నివాళులర్పిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు

కావలి టౌన్: బీజేపీ నాయకులు ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, బ్రహ్మానందం, కమల, పరుసు వెంకటేశ్వర్లు, మాల్యాద్రి పాల్గొన్నారు.

పరిశుభ్రత భారత్‌గా మార్చడమే లక్ష్యం

● ఊరూరా స్వచ్ఛత హి సేవ ర్యాలీలు

కందుకూరు, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించటం, దేశాన్ని పరిశుభ్రత భారత్‌గా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజ అన్నారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం కందుకూరులో నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధానవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ అనూష ప్రజలతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. రానున్న వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా అన్ని పంచాయతీల్లో తక్షణఆర్థిక సంఘం నిధులు వినియోగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, చదలవాడ కొండయ్య, వడ్డెళ్ల రవిచంద్ర పాల్గొన్నారు.

లింగసముద్రం: ఎంపీడీఓ శ్రీనివాసులు స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి రాఘవులు, మాజీ సర్పంచ్ కిలారి కొండయ్య, తహసీల్దార్ సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ శివకుమార్, ఈఓపీఆర్‌డీ రామసుబ్బారావు, ఏపీఓ షేక్ సమీర్‌బాషా, సూపర్‌వైజర్ రాధాదేవి పాల్గొన్నారు.

బిట్రగుంట: ఎంపీడీవో వెంకటసుబ్బారావు మేజర్ పంచాయతీలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశావర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచు అనిత, మండల కన్వీనర్ నాగేశ్వరావు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, టీడీపీ మండలాధ్యక్షురాలు అరుణమ్మ, హెచ్ఎం గంగాధర్‌రావు, జహీర్ బాషా, సామాజికకర్త ప్రభాకర్ ఉన్నారు.

కలిగిరి: పట్టణ హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఎంఈఓ సురేష్, కార్యదర్శి చెంచుక్రిష్ణయ్య, సర్పం చు వెంకటసుబ్బయ్య, యల్లకర సతీష్ పాల్గొన్నారు. నాగసముద్రంలో గ్రామస్థులతో నిర్వహించిన ర్యాలీలో మండల విస్తరణాధికారి వెలుగోటి మధు, సర్పంచ్ డేగ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ అంబటి శంకరయ్య, నరసాల మాల్యాద్రి, భాపతి మాలకొండయ్య, యర్రగుంట రాజశేఖర్ పాల్గొన్నారు.

కావలి రూరల్: ఎంపీడీవో శ్రీధర్ బాబు మండల కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి బ్రిడ్జి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ ఆలూరి కొండ మ్మ, ఎంఈవో వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

అల్లూరు: ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యం లో మండల కార్యాలయం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, నగర పంచాయతీ కమి షనరు ఫణికుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

కొండాపురం: ఎంపీడీవో ఎమ్.బ్రహ్మయ్య మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ, గుడవళ్లూరు కార్యదర్శి ప్రదీప్, బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జు, ఉపసర్పంచ్ మణి పాల్గొన్నారు.

ఉలవపాడు: మండలకేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ, ఎంఈఓ శివనాగేశ్వరరావు, సీడీపీఓ అరుణ సర్పంచ్ విజయమ్మ, రాచగల్లు సుబ్బారావు, సుదర్శి శ్రీను, అంచుపోగు వాసు, రమేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మహిమలూరులో ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, సర్పంచి, ఎంపీటీసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం: జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంఈవో మస్తాన్‌వలి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, వెంగయ్య, ప్రసాద్, కార్యదర్శి జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: ఎంపీడీవో మల్లికార్జున ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : దుత్తలూరులో అధికారులు, నాయకులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా ఉన్నారు.

ఉదయగిరి రూరల్: ఉదయగిరిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విద్యార్థులు కలిసి స్థానిక రంగనాయకుల ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ , ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, ఏఈలు రవీంద్రనాథ్, శ్రీనివాస రాజు, బయ్యన్న, నరసింహులు, సందానీ పాల్గొన్నారు.

కలువాయి: అన్నీ పంచాయతీలో ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

ఏఎస్‌పేట: ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సతీష్, ఏఎస్‌వో రాజేంద్ర విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శులు గ్రా మ పెద్దలు పాల్గొన్నారు.



కందుకూరు: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్ శ్రీపూజ



కావలి రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీధర్‌బాబు, తదితరులు



ఆత్మకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఉదయగిరి: ర్యాలీ పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

రక్తదానం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు 17: యువత రక్తదానంను సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడటంలో క్రియాశీలంగా వ్యవహరించాలని కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక రక్తదాతల గ్రూపు 8వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి కందుకూరులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీఐ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, చెన్నా రామాంజనేయులు, మంగళగిరి నరసింహారావు, కానిస్టేబుల్ పూరిపత్తి శ్రీనివాసరావు ఉన్నారు.

పీఎంఏవై లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

కలువాయి, సెప్టెంబరు 17 : ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) 2.0 కింద మంజూరైన పక్కాఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులు, నాయకులు కలసి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కలువాయిలో 18, నూకనపల్లిలో 3కలిపి మొత్తం 21మందికి ఇళ్లు మంజురయ్యాయి. వీరందరికి ఇంటి వద్దే మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే (పీఎంఏవై) 1.0 కింద నిర్మాణం పూర్తియిన ఇళ్లలో గృహప్రవేశాలు చేశారు. చిన్నగోపవరం, బద్వేలు, బ్రాహ్మణపల్లిలో గృహప్రవేశాలు జరిగాయి. ఎంపీడీవో గోవర్ధన్, ఎంఈవో-2 శేషగిరిరావు, వెంకటేశ్వర్లు నాయడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యం

కలిగిరి, సెప్టెంబరు 17: ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అల్బెండోజెల్ మాత్రల వేయించారు. కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట: పీహెచ్ఎన్ మేరీ తాళ్లూరు పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో నులిపురుగు నివారణ దినోత్సవంలో పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటసుబ్రమణ్యం, హెల్త్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి, ఎంఎల్‌హెచ్‌పీ శివ కుమార్, ఏఎన్ఎం రోజిలిన్, ఆశావర్కలు పాల్గొన్నారు.

కందుకూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని 19ఏళ్ల లోపు చిన్నారులందరికీ మున్సిపల్ కమిషనర్ కె.అనూష, పీహెచ్‌సీ వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, స్టెల్లా కారుణ్యాలు నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేయించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. నులిపురుగులతో కలిగే అనారోగ్యాలను వివరించారు. పీహెచ్ఎన్ ఇంటూరి పద్మావతి, శోభ పాల్గొన్నారు.

లింగసముద్రం: అన్ని పాఠశాలలు, హైస్కూళ్లలో ఏడాది నుండి 19ఏళ్లలోపు 6018 మంది పిల్లలల్లో 5773 మందికి నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. మిగిలిన చిన్నారులకు ఈ నెల 25న పంపిణీ చేస్తామన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 17: ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంగళ వారం బీజేపీ మండల అధ్యక్షుడు చుండి హరిగోపాల్‌రెడ్డి ఆధ్వ ర్యంలో నాయకులు తహసీల్దారు నాగరాజుకు వినతిపత్రం అందజే శారు. అనంతరం వారు మాట్లాడుతూ హైవే నిర్మాణంలో దుత్తలూరు సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించారన్నారు. ఆలయ నిర్మాణానికి సెంటర్‌లో స్థలాన్ని కేటా యించాలన్నారు.

ప్రభుత్వాధినేతల చిత్రపటాల బహూకరణ

చేజర్ల, సెప్టెంబరు17 : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు మంగళవారం టీడీపీ నాయకులు ఉడతా హజరత్తయ్య ప్రభుత్వాధినేతల చిత్రపటాలను అందజేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిత్ర పటాలను ఆయా శాఖల కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని అధికారులకు వాటిని అందజేశారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కలిగిరి, సెప్టెంబరు 17: పట్టణంలోని మసీదువీధికి చెందిన బైక్ మెకానిక్ గిడే సాహెబ్ కుమారుడు ఆశిక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఊసా మాల్యాద్రి, మేడం నరసింహారెడ్డి, చేరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, సోము భాస్కర్, పేరం నాగిరెడ్డి, జిర్రా పెద అంకిరెడ్డి, ఇంగ్లేకల్లయ్య, హటేల్‌బాష, కొప్పోలు కొండలరావు, సురేష్ పాల్గొన్నారు.

ఏఎన్ఎంపై చర్య తీసుకోవాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

కావలి, సెప్టెంబరు 17: కోవూరుపల్లి ఏఎన్ఎం నిర్లక్ష్యంతో పాము కాటుకు గురైన శంకరయ్య మృతి చెందారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. ఏఎన్ఎం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధిత కుటుంబ సభ్యులతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడారు. కోవూరుపల్లి బొచ్చు శంకరయ్య ఈ నె 2వ తేదీన పాముకాటుకు గురై వైద్యం కోసం పీహెచ్‌సీకి వెళితే అక్కడ విధుల్లో ఉన్న ఏఎన్ఎం ఒకటిన్నర గంటసేపు ఆస్పత్రి తలుపులు తీయకుండా నిర్లక్ష్యంగా వహించినట్లు మండిపడ్డారు. విషయంపై బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుడ్లూరు, సెప్టెంబరు 17: అనుమతులు లేకుండా మంగళవారం వేకువజామున దప్పళంపాడు మన్నేరు రేవు నుంచి అక్రమంగా ఇతర మండలాలకు ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుడ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన ట్రాక్టర్లను స్టే షన్‌ను తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

లింగసముద్రం: పెదపవని శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంలో ఉదయం 6గంటల సమయంలో సిబ్బందితో దాడి చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సుబాని తెలిపారు. అనంతరం ట్రాక్టర్, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కలువాయి: నూకనపల్లి సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. తెలుగురాయపురం వీఆర్వో ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. పెన్నానది పరిసర గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఓజోన్ పొర పరిరక్షణతోనే మానవ మనుగడ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 17: ఓజోన్ పొర పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఇన్‌చార్జి హెచ్ఎం డీ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కృష్ణంపల్లి ఉన్నత పాఠశాలలో అప్‌కాస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జరీనా, సుధాకర్, ముజఫర్‌అలీ, పంచాయతీ కార్యదర్శి శిల్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర పాల్గొన్నారు.

కందుకూరు : స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా మానవజీవితం ఆనందంగా సాగాలంటే ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అందుకు చేయాల్సిన మానవ ప్రయత్నాలను వివరించారు. అవకాశం ఉన్న ప్రతిచోట మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించటం ద్వారా పర్యావరణాన్ని తద్వారా ఓజోన్ పొరకు కాపాడుకునేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు కమల్‌బాబు, ఎస్వీ శ్రీహరి, ఎస్. తిరుపతిస్వామి, పద్మావతి, కరుణకుమార్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మరో వంతెన నిర్మాణానికి పరిశీలన



దువ్వూరు కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సంగం, సెప్టెంబరు 17: సంగం గ్రామం మధ్యలో వెళ్తున్న దువ్వూరు కాలువపై మరో వంతెన నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు డీఈ మధుసూదన్, ఏఈ వెంకట కృష్ణ మంగళవారం పరిశీలించారు. దువ్వూరు కాలువ సంగం మధ్యలో నుంచి వెళుతుంది. అయితే ప్రస్తుతం బస్టాండ్ సెంటర్, బండారుమిట్ట, దళితవాడ వద్ద మూడు చోట్ల దువ్వూరు కాలువపై వంతెనలు ఉన్నాయి. ఈ క్రమంలో సాయినగర్ నుంచి తూర్పువీధిని కలుపుతూ మరో వంతెన నిర్మిస్తే గ్రామస్థులతోపాటు రైతులకు ఉపయోగపడుతుంది. ఇందుకోసం అధికారులు ప్రతిపాదనలు పంపనున్నారు. కార్యక్రమంలో వారి వెంట టీడీపీ నాయకులు కాకు మధుసూదన్ యాదవ్ ఉన్నారు.

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలి



ఆత్మకూరు : మాట్లాడుతున్న షేక్ ఖాజామొహిద్దీన్

ఆత్మకూరు, సెప్టెంబరు 17: ఉర్దూ పాఠశాలల సముదాయాల సమావేశాలను సద్వినియోగం చేసుకుని, సాంకేతిక విద్యలో బలోపేతం చేయాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఉర్దూ పాఠశాలల సముదాయాల సమావేశాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్ హెచ్ఎం అనంతలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : జిల్లా డిప్యూటీ ఉర్దూ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజామొహిద్దీన్, ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి ఉర్దూ పాఠశాలల సముదాయ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజెండా ప్రకారం సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సముదాయ సెక్రటరీ షఫీ అహ్మద్, రిసోర్సుపర్సన్‌లు షేక్‌ఎండీ కరీం, షేక్ షంషాద్‌బేగం, షేక్ ఇనాయత్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

కావలి టౌన్, సెప్టెంబరు 17: స్థానిక వైకుంఠ పు రం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఏను గు వాహనంపై నిర్వహించిన గణేష్ విగ్రహ గ్రామోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైకుంఠపురం నుం చి ముసునూరు మందాటి చెరువు వరకు ట్రంకు రోడ్డు పై ముందుకు సాగారు. అనంతరం విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశారు. మాజీ కౌన్సిలర్లు గుడ్లూరు మాల్యాద్రి, చినపుల్లయ్య, అభిసాగర్ పాల్గొన్నారు.

సంగం: సంగంలో మంగళవారం పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనాలను నిర్వహించారు. శివాలయం సెంటర్, బెస్తపాళెం సెంటలో ఏర్పాటు చేసిన విగ్రహాలను పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో యువకులు కేరింతలు కొడుతూ పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు.

కావలి: గజవాహనంపై గణేశ్ విగ్రహ గ్రామోత్సవం